1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 4
పుటలు : 52
రు. 25 లు

ISSN NO : 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



తాపీ ధర్మారావు గారు గిడుగు రామమూర్తి గారికి తగిన శిష్యుడు. గిడుగు చివరి సందేశాన్ని ఆచరణలో పెట్టి తనదైన ప్రత్యేకతను కనబరిచాడు. తొలుత పత్రికారంగంలో తర్వాత సినిమారంగంలో ప్రజలభాషకు పట్టం కట్టడం కోసం ఒక పత్రికా సంపాదకుడిగా, ఒక రచయితగా లక్ష్యాలను సాధించాడు. అంతేకాదు.. కందుకూరి, గురజాడ వివాహ వ్యవస్థలోని చెడులను ఎత్తిచూపుతూ సంస్కరణలకు ప్రయత్నిస్తే – తాపీ ధర్మారావు స్వాభిమాన ఉద్యమ దృష్టితో పూజారులనూ, పురోహితులనూ, పెళ్లి వ్యవస్థలనూ నిలేసి ప్రశ్నించాడు కూడా.

తాపీ ధర్మారావు జయంతి(సెప్టెంబరు 19)ని 'తెలుగు జనమాధ్యమాల దినోత్సవం'గా జరుపుకొంటున్నాం.

## గిరిజన ఆదివాసీ కళాప్రభల కేతనం – తెలంగాణ తొలి సాంస్కృతిక కృతులు, ఆకృతుల ప్రదర్శనం



ఇది తెరచీరల వారి పటం. 12వ శతాబ్దం కవి పాల్కురికి సోమనాథుడు తన గ్రంథాలలో దీనిని పేర్కొన్నాడు. ఇందులో పెద్దదిగా కనిపించే చిత్రం గంగాదేవి



**గోండు గిరిజనుల సంకేతం.** ఇందులో అడవిదున్న కొమ్ములు ప్రముఖంగా ఉంటాయి. హరప్పా మొహంజొదారోలోని కొన్నిగుర్తులను పోలివుంటాయి. గోండుల ఉపతెగ అయిన ఓజాలు మాత్రమే దీనిని ప్రత్యేక శైలిలో ఇత్తడితో తయారు చేస్తారు.

తెలుగు అకాడమీతోపాటు ప్రాచీన తెలుగు విశిష్ట భాషాకేంద్రం కూడా అల్లరిపాలు కానుందా?

# ఆహ్వానము



భారతీయ భాషలలోని వైవిధ్యాన్ని,
వాటి కవిత్వ సంపదను,
తెలుగువారికి రుచిచూపిన కవి

# ముకుంద రామారావు గారికి

## తాపీ ధర్మారావు పురస్కారం



తేది, సమయం : 18, సెప్టెంబరు 2021 ఉ॥ గం.10:30 లకు
వేదిక : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి,
టెలిఫోన్‌భవన్ పక్కన, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా, సెక్రటేరియట్ రోడ్డు,
ఖైరతాబాదు, హైదరాబాదు.
సభాధ్యక్షులు : ఆచార్య జయధీర్ తిరుమలరావు కవి, రచయిత, పరిశోధకుడు
ముఖ్య అతిథి : ఆచార్య డి.రవీందర్ యాదవ్ ఉపకులపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి : జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి
ఆత్మీయ అతిథులు: ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు భారతీయభాషలసంఘ జాతీయఅధ్యక్షులు
డాక్టర్ ఎ.కె. ప్రభాకర్ రచయిత, సాహిత్య విమర్శకుడు
శ్రీ పి.పూర్ణచంద్రరావు విశ్రాంత ప్రిన్సిపాల్, ఐ.ఐ.ఎం.సి. కాలేజి
శ్రీమతి విమలా సోహన్ తాపీధర్మారావుగారి మనుమరాలు

తాపీ ధర్మారావు వేదిక
సమావేశకర్త : డాక్టర్ సామల రమేష్‌బాబు 98480 16136

## అదే నేల

భారతీయ కవిత్వం - నేపథ్యం
రచయిత
యెల్లపు ముకుంద రామారావు

అదే గాలి, అదే ఆకాశం, శతాబ్దాల
సూఫీ కవిత్వం, నోబెల్ కవిత్వం,
చర్యాపదాలు గ్రంథాల ద్వారా అనేక దేశాల
కవిత్వాన్నీ, సాహిత్య చరిత్రనీ, సూఫీ తత్త్వసారాన్నీ,
నోబెల్ కవుల కవిత్వ జీవితాల్నీ, సాంధ్య భాషలో
మహాయాన బౌద్ధ సిద్ధాచార్యుల ఉపదేశాల్నీ
క్రోడీకరించి- అనువదించి తెలుగు నేలకు
అందించిన విశిష్ట కవి, అనువాదకుడు

ఇంతవరకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు



డా॥ఎన్.వేణుగోపాల్-2009



డా॥కె.శ్రీనివాస్-2011



శ్రీ టంకశాల అశోక్-2013



శ్రీ జి.శ్రీరామమూర్తి-2014



శ్రీ ఎ.కృష్ణారావు-2015



శ్రీ ఆర్‌ఎం.ఉమామహేశ్వరరావు-2016



శ్రీసతీష్ చందర్-2017



డా॥ ఏటుకూరి ప్రసాద్
జీవనసాఫల్య పురస్కారం-2018

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




సెప్టెంబరు 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | తెలుగు అకాడమీతోపాటు ప్రాచీన తెలుగు విశిష్ట.... | | 07 |
| తాపీ ప్రత్యేకం: | ముమ్మొనవాలు | డా॥ ఏటుకూరి ప్రసాద్ | 09 |
| పాలకుల పక్కదారి: | తెలుగుకు వడదెబ్బ ఇంటర్మీడియేట్లో.... | జె.డి.ప్రభాకర్ | 13 |
| జర్మనీ లేఖ: | జర్మన్ల భాషావేశం-2 | శ్రీగణేష్ తొట్టెంపూడి | 16 |
| బోధన: | ప్రశ్న | సి.వి.క్రిష్ణయ్య | 18 |
| ముందడుగేనా: | మనిషి ముందుకు-భాష.... | హంసావత్ నాగేంద్ర | 20 |
| వారసత్వ సంపద: | గిరిజన ఆదివాసీ కళాప్రభల... | సన్నిధానం నరసింహశర్మ | 22 |
| చరిత్ర రచన: | 'విశ్వమానవ ఏకత్వాన్ని .... | డా॥షేఖ్ మహబూబ్ బాషా | 25 |
| వారసత్వ సంపద: | తెలుగు రాష్ట్రాలలోని.... | డా॥పి.శివరామకృష్ణ'శక్తి' | 29 |
| లిపి: | భాషాధ్వనులు-రోమన్... | డా॥అల్లంసెట్టి చంద్రశేఖరరావు | 32 |
| వంగ-తెలుగు అనుబంధం: | నాకు అర్థమైన రవీంద్రుడు | యం.సాహితి | 35 |
| సాహిత్యరంగం: | తెలుగు నవల తడబాట్లు | మధురాంతకం నరేంద్ర | 41 |
| పుస్తక పరిచయం: | | | 49 |
| గ్రంథాలయం: | | | 50 |
| నవల: | మా ఊరు | అగరం వసంత్ | 44 |
| ఆత్మకథ: | కొయ్యబొమ్మ..చంద్రప్పసోబటి/రంగనాథరామచంద్రరావు | | 46 |
| ధారావాహిక: | అడుగుజాడలూ ఆనవాళ్లు-10 | ఈమని శివనాగిరెడ్డి | 38 |
| కవితలు: | అక్షర సంధ్య | ఎన్. గోపి | 17 |
| | వలువలు | కరణం కళ్యాణ్ కృష్ణకుమార్ | 43 |



కార్టూన్లు
**సరసి, శఖర్**

కంప్యూటర్
**బండారు రఘురాం**


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

## చందా వివరాలు

| | | |
|---|---|---|
| జీవిత చందా | : | రూ.5000 |
| 4 సం॥ చందా | : | రూ.1000 |
| 1 సం॥ చందా | : | రూ. 300 |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**



## నాడు తాపీ చెప్పింది ఇది:

"1757లో ప్లాసీయుద్ధంవల్ల దేశానికెంత అరిష్టం వచ్చిందో 1857లో చిన్నయసూరి ఆచార్యుడు కావడంవల్ల తెలుగుభాషకంత నష్టం వచ్చింది"

"విద్యాప్రణాళికలో విద్యార్థులకు మార్గదర్శకంగా వ్యావహారిక భాషకు అవకాశం కల్పించమని పండితుల్ని, ఆచార్యవర్గాన్ని నేను కోరుతున్నాను. ఇరవై సంవత్సరాల అనంతరం లేదా 50 సంవత్సరాల అనంతరం నేటి దుస్థితి కంటె అన్నివిధాలా బాగుపడుతుందని నేను పండితులకూ, ఆచార్యవర్గానికీ హామీ ఇస్తున్నాను.

(19-04-1965 శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన భాషాసదస్సులో తాపీవారి ప్రసంగం.)

## నేడు జస్టిస్ రమణ స్వానుభవం ఇది:



"మాతృభాషలోనే విద్యాబోధన సాగితే ప్రయోజనాలెన్నో ఉన్నాయి. ఆంగ్లం కోసం తెలుగును విస్మరించాల్సిన అవసరం లేదు.... నేను డిగ్రీ వరకు తెలుగు మాధ్యమంలోనే చదివాను. ఇంగ్లీషు అభ్యాసం 8వ తరగతిలో ఆరంభమైంది. ఉద్యోగ ధర్మం కనుక ఆంగ్లంలో అభ్యాసం, వాడకం కొనసాగిస్తున్నాను. పల్లెటూరిలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో మాతృభాషలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. విద్యాబోధన వ్యవహారికంలో సాగడం నాకెంతో ఉపయోగపడింది".

-భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ



## భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుగారి సందేశం:

చదువంటే ఇంగ్లీషేనన్న అభిప్రాయం పోవాలి. పదహారణాల తెలుగు పరిరక్షణకు ఇది చాలా ప్రధానం. మన నేలమీద మనం పరాయివారిగా జీవించే భావజాలాన్ని ఇముడ్చుకోవద్దు. ఇంగ్లీషు లేకపోతే మన జాతికి మనుగడ లేదనే భావదాస్యం పనికిరాదు. అమ్మభాష ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తద్వారా ఆత్మనిర్భర భారత్ అవతరిస్తుంది.

## ఆంధ్రజ్యోతి దినపత్రిక 2021 ఆగస్టు 28 సంపాదకీయం

తెలుగుకి ఏమి కావాలి? తెలుగు ప్రాచీనమైనదనీ, తియ్యటిదనీ, పుల్లటిదనీ, అందమైనదనీ పరవశించిపోవడం మానేయాలి. తెలుగును ఆధునిక భాష ఎట్లా చేయాలో ఆలోచించాలి. గిడుగు సహా వాడుక భాష ఉద్యమకారులు ఎవరూ, కవిత్వంలో వినియోగించే భాష గురించి పోట్లాడలేదని గమనించాలి. వారు గత కాలంలో నామమాత్రంగా ఉంటూ, ఆధునిక కాలంలో అనివార్య అవసరంగా ముందుకు వచ్చిన వచనరచనలో వాడుక భాష కోసం తమ దృష్టి కేంద్రీకరించారు. వచనంలోనే సమస్త శాస్త్రవిజ్ఞానమూ ఉంటుంది, బౌద్ధిక చర్చలూ జరుగుతాయి. దురదృష్టవశాత్తూ, తెలుగు సామర్థ్యాన్ని పెంచడంలో గిడుగు అనంతర సమాజాలు విఫలమయ్యాయి. ప్రభుత్వాలు దారుణమైన విస్మరణను అలక్ష్యాన్ని ప్రదర్శించాయి. ఇంగ్లీషుతో అనువదనీయత ఆధునిక భాషగా తెలుగుకి అవసరం. ఆధునిక వైజ్ఞానిక, తాత్విక భావనలకు కావలసిన పదజాలాన్ని అందించవలసిన బాధ్యత భాషా రంగంలో పనిచేసే సంస్థలదీ, విశ్వవిద్యాలయాలదీ. ప్రభుత్వాలు మాత్రమే పెద్ద పెట్టుబడులు పెట్టి, భాష సామర్థ్యాన్ని క్రోడీకరించే, ఉన్నతీకరించే వ్యవస్థలను, నిఘంటువుల వంటి ప్రాథమిక వనరులను నిర్మించగలవు. కానీ, ఏ పాలకుడికి పట్టింది తెలుగు? ఒక పద్యం వల్లించి తెలుగు ప్రేమికులమవుదామని ఒకరు ప్రయత్నిస్తే, తెలుగు సంస్కృత అకాడమీలను కలిపేసి పరిహసించడానికి మరొకరు ప్రయత్నించారు. సాహిత్య అకాడమీ పదవిని కూడా రాజకీయ పదవి చేసిన ఘనత ఒకరిదైతే, ఏళ్లకు ఏళ్లు భాషాసాహిత్య సంస్థల పదవులను పడావు పెట్టిన కీర్తి మరొకరిది.

తెలుగు భక్తిని పక్కనపెట్టి, తెలుగు శక్తిని తీర్చిదిద్దే ప్రయత్నం మొదలు కావాలి.


మదర్‌టంగుని మొదట్లోనే కోసెయ్యాలి!
పిల్లలెవరూ తల్లితో మాట్లాడ
కూడదని నిషేధం విధిస్తే?!
ENGLISH ONLY


మాతృభాషా దినోత్సవం లాగా మాతృభాషా
విద్రోహ దినం కూడా పాటిస్తారట సార్!!

సంపాదక హృదయం

## తెలుగు అకాడమీతోపాటు ప్రాచీన తెలుగు విశిష్ట భాషాకేంద్రం కూడా అల్లరిపాలు కానుందా?

తెలుగుకు ప్రాచీన విశిష్ట హోదా వచ్చిన తర్వాత మైసూరులోని భారతీయ భాషల కేంద్ర సంస్థలో పరిశోధనాకేంద్రాన్ని నిర్వహించాల్సి ఉంది. అందుకోసం తగిన వ్యవస్థల్ని అక్కడే తెలుగుకు, కన్నడానికీ ప్రారంభించడానికి నాటి కేంద్ర మానవవనరుల శాఖా మంత్రిణి మైసూరుకు వచ్చేందుకు కార్యక్రమం అంతా నిర్ణయమైన తరుణంలో తెలుగు కేంద్రం తెలుగు నేలపైన ఉండాలనే డిమాండ్ వచ్చింది. మంత్రిగారు మైసూరు వచ్చినా కన్నడ సంస్థను మాత్రమే ప్రారంభించి వెనక్కి వెళ్లిపోయారు. ఆవిడ తెలుగువారు కావడం యాదృచ్ఛికం.

ప్రాచీన విశిష్ట తెలుగు కేంద్రాన్ని తెలుగు రాష్ట్రానికే రప్పించుకోవాలంటే కేంద్రానికి ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. అయితే దాని కోసం రాష్ట్రప్రభుత్వం, చట్టం ప్రకారం కావలసినంత భవనవసతిని, స్థలాన్నీ చూపాలి. ఆ వెంటనే పరిశోధనా కేంద్రాన్ని వ్యవస్థీకరించడమూ అన్ని సౌకర్యాలతో కూడిన విశాల భవనాన్ని నిర్మించడమూ ఇదంతా సిఐఐఎల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం చేస్తుంది. అంతేకాదు, అక్కడ జరిగే నియామకాలూ, పరిశోధన తదితర అన్ని వ్యవహారాల నిర్వహణ సిఐఐఎల్ ద్వారానే కేంద్ర ప్రభుత్వం చట్టప్రకారం దశలవారీగా విడుదల చేసే సొమ్ముతోనే జరుగుతుంది. మనకంటె ఎంతో ముందుగానే ఈ గుర్తింపును తెచ్చుకొన్న తమిళులకు అదే చట్ట ప్రకారం ఆర్థిక వనరులు అందుతూనే ఉన్నాయి. వాళ్లుకూడా రెండేళ్లకు పైగా మైసూరులోని సిఐఐఎల్ నుండే తమకు రావలసినవన్నీ సాధించుకొని, ఆ తర్వాతే తమిళనాడులో ముఖ్యమంత్రి కరుణానిధి స్వయంగా ఇచ్చిన స్వంత భవనంలోకి తమసంస్థను తీసుకువెళ్లారు. కేంద్ర నిధులతో పాటు, రాష్ట్రం కూడా అన్ని విధాలా తోడ్పాటు నివ్వడంతో ఆ సంస్థను విజయవంతంగా నిర్వహించుకొంటున్నారు.

కాగా, నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వహయాంలోగాని, తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రుల ఏలుబడిలో గాని పాలకులు ఈ అంశంపై ఏమాత్రం ఆసక్తి చూపలేదు. ప్రాచీన విశిష్ట భాషా ప్రతిపత్తి విషయంతో పట్టుబట్టి సాధించిన రాష్ట్రప్రభుత్వనేతలు, చట్టసభల ప్రతినిధులు, రాజకీయనేతలు ఈ అంశంపై తగినంత శ్రద్ధ తీసుకోలేదనీ, సిఐఐఎల్ ప్రతినిధులు ఇక్కడికి వచ్చి ప్రయత్నాలు చేసినా, అధికారవర్గాలు పట్టించుకోలేదనీ అందరికీ తెలిసిన చరిత్ర. ఇంతలో రాష్ట్ర విభజన జరిగిపోయింది. ఆంధ్ర, తెలంగాణల్లో ఏర్పడిన తె.దే.పా., తెరాసల ప్రభుత్వ నేతలుకూడా ఆ అంశంపై చేసిందేమీ లేదు. మద్రాసు హైకోర్టులో తెలుగుకు ప్రాచీన హోదా ఇవ్వడాన్ని ఎదిరిస్తూ జరిగిన వ్యాజ్యం విషయంలో కూడా మన ప్రభుత్వాలు శ్రద్ధచూపని దశలో తూమాటి సంజీవరావు వంటి బయటి వ్యక్తులు వ్యాజ్యంలో చేరవలసి వచ్చింది. మొత్తం మీద న్యాయస్థానం తీర్పు ఇచ్చి న్యాయాన్ని నిలబెట్టిన తర్వాత, కేంద్రప్రభుత్వం మనకు అనుకూలంగా చర్యలు తీసుకున్నాక కూడా మన రాష్ట్ర అధికార అనధికార వర్గాల పట్టనితనం వల్ల, ఎటూగాని పరిస్థితుల్లో మన ప్రాచీన విశిష్ట భాషాకేంద్రం మైసూరులో సిఐఐఎల్‌లో చైతన్య రహితంగా తలదించుకొని పడి ఉంది. అట్టి స్థితిలో, తెలుగు పట్ల తెలుగు వారిపట్ల తన అభిమానాన్ని ఎన్నడూ దాచుకోని దేశ ఉపాధ్యక్షుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు స్వయంగా పట్టించుకొని, కేంద్ర అధికారులతో మాట్లాడి, నెల్లూరులో తగిన భవనాన్ని ఇప్పించి, వెంటనే కార్యక్రమాల్ని నడిపించారు. అక్కడేదో విధంగా, పాక్షికంగానైనా, రెండేళ్లుగా కొంతపని జరుగుతోంది. ఎన్నికల తర్వాత రాష్ట్రాల ప్రభుత్వాల్లో ఏదో కదలిక వచ్చినట్లు కొన్ని ప్రకటనలు వచ్చాయి. కాని, ఆచరణలో జరిగింది ఏమీ లేదు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 'తెలుగు సంస్కృత అకాడమీ' అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి గారి చొరవతో ఈ కేంద్రాన్ని తిరుపతికి తరలించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయని, అందుకు ముఖ్యమంత్రి ఆమోదించి తగు ఆదేశాలనిచ్చారని, తాజాగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. తిరుపతిలో తెలుగు సంస్కృత అకాడమీతోపాటు, ప్రాచీన విశిష్ట భాషాకేంద్రం కోసం కూడా తగినంత పెద్ద స్థలాన్ని వెతికే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు వార్తలు సూచిస్తున్నాయి.

ఇంతకాలం మన ప్రభుత్వాలకు తలకెక్కని ఈ విషయాన్ని ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకొన్న సంగతి సంతోషాన్ని కలిగించేదే. అయితే ఇందుకోసం ఆలోచిస్తున్న తీరు మాత్రం వాస్తవాలకు దూరంగా ఉంది.

ఎన్నో ఏళ్లుగా హైదరాబాదులో కొనసాగుతున్న తెలుగు అకాడమీ ఉమ్మడి సంస్థ. దానిలో ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన కోట్లాది రూపాయలు నిధిని, ఇతర ఆస్తిపాస్తులను తెచ్చుకొని, దానినొక క్రమ పద్ధతిలో రాష్ట్రంలో నిర్వహించుకోవడంపై శ్రద్ధచూపని ప్రభుత్వం, హడావిడిగా తమంతటతామే ఒక జి.ఒ. ద్వారా ఏడాది క్రితం 'తెలుగు అకాడమీ'ని రాష్ట్రంలో స్థాపిస్తున్నట్లు ప్రకటించి, దానికి అధ్యక్షురాలుగా లక్ష్మీపార్వతిగారిని నియమించింది. అప్పటినుంచి ఆ సంస్థచేసింది ఏమీ లేదు. ఇప్పుడు ఉన్నట్లుండి అకాడమీ పేరునే 'తెలుగు సంస్కృత అకాడమీ'గా మార్చి ప్రభుత్వం నవ్వుల పాలైంది. నెలరోజులకు పైగా ఇందుకు వ్యతిరేకంగా చర్చ, ఆందోళన జరుగుతూనే ఉంది. ఇప్పుడు ఉన్నట్లుండి లక్ష్మీపార్వతి గారి ప్రతిపాదనపై ప్రాచీన విశిష్ఠ తెలుగు పరిశోధనా కేంద్రం సంగతి బయటకొచ్చింది. దీని విషయంలో కూడా ప్రభుత్వ ఆలోచన అస్తవ్యస్తంగా, అసంబద్ధంగా ఉంది. దీనికి సంబంధించిన కేంద్ర ఉత్తర్వులను, చట్టాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు! దాన్ని తెలుగు సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారట! ఈ కేంద్రం గాని, దానికి సంబంధించిన తక్కిన వ్యవహారాల నిర్వహణగాని సిఐఐఎల్ ఆధ్వర్యంలో జరుగుతాయి. అకాడమీ వేరు, విశిష్ట భాషాకేంద్రం నిర్వహణ వేరు. ముందు ఈ విషయంలో స్పష్టత తెచ్చుకొని, ముందుకు సాగమనీ, ఇప్పటికే ఏళ్లతరబడి గందరగోళంగా ఉన్న ప్రాచీన విశిష్ఠకేంద్రం పరువు ప్రతిష్టల్ని ఇంకా కించపరచే చర్యల్ని తీసుకోవద్దనీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారినీ, అకాడమీ అధ్యక్షురాలినీ కోరుతున్నాము. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉన్నతాధికారులు, సలహాదారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని హెచ్చరిస్తున్నాము.

ప్రాచీన విశిష్ట భాషాకేంద్రం నెత్తిన ఇప్పటికే ఇంకొక కత్తి కూడా వేళ్లాడుతూ ఉంది. సిఐఐఎల్‌ను భారతీయ భాషల కేంద్ర విశ్వవిద్యాలయంగా మారుస్తూ కేంద్రప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ప్రాచీన విశిష్ట భాషా కేంద్రాలను కూడా దానికిందికి తేవాలని ఆలోచన ఉందట. ఈ కేంద్రాలను స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలుగా చేయాలనే డిమాండు ఒక వైపు సాగుతుండగా, వాటిని విశ్వవిద్యాలయానికి ముడివెయ్యాలనే ఆలోచన మరోవైపు సాగుతున్నది!

భారతీయ భాషలను సంస్కృతీకరించడం ద్వారా దేశంలో భాషాసమైక్యత(!)ను సాధించాలనే సైద్ధాంతిక ఆశయంతో నేటి పాలకులు వ్యూహరచన చేస్తున్నారు. అందుకనుగుణంగానే వారి ఆలోచనలుంటాయి. భారతీయ భాషలన్నిటికి కలిపి ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చెయ్యాలనే ఆలోచనకు అదే ప్రాతిపదిక. సంస్కృతం నేతృత్వంలో, పెంపకంలో భారతీయ భాషలకు ముక్తీ మోక్షమూ లభిస్తాయట! అప్పుడే మన భారతీయత సమగ్రమూ పవిత్రమూ అవుతుందట! మాతృభాషలంటే ఏమిటో, వాటి శక్తి ఏమిటో, జాతికీ– భాషకూ గల సంబంధమెటువంటిదో తెలివిగలవారు తెలుసుకోవాలి. మన పాలకులకు జ్ఞానోదాయాన్ని కలిగించాలి.

ఇప్పుడు లక్ష్మీపార్వతిగారు తెలుగు సంస్కృత అకాడమీకీ, ప్రాచీన విశిష్ట తెలుగు భాషాకేంద్రానికీ సరిపోయే భవనాన్ని వెతికేపనిలో పట్టుదలగా ఉన్నారని, త్వరలోనే ఇది సఫలం కానున్నదనీ తిరుపతి నుండి తెలుస్తున్నది. సంతోషం. ఆమె ముందుగా రెండు విషయాలపై స్పష్టత తెచ్చుకోవాలని సూచిస్తున్నాము.

1. తెలుగు అకాడమీని తెలుగు అకాడమీగానే ఉంచాలి. దానిలో నుండి 'సంస్కృతం'ను తొలగించాలి. ఆ రెండు భాషలూ పరస్పరం మాటలను అప్పుతెచ్చుకొన్నాయి. అది సహజం. అయినా ఏ భాషకు ఆభాషే స్వతంత్రం. ఇది శాస్త్రీయమైన, హేతుబద్ధమైన ఆలోచన. చేసిన తప్పును తెలుసుకొని, సవరించుకోవడం విజ్ఞుల బాధ్యత.

2. ప్రాచీన విశిష్ట తెలుగు కేంద్రాన్ని తిరుపతికి తెచ్చుకోవాలని ప్రభుత్వం తలపెడితే అదేమీ తప్పుకాదు. అది వారి ఇష్టం. అది ఎక్కడున్నా స్వతంత్రప్రతిపత్తితో విలసిల్లేట్లు చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఆ కేంద్రానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధ్యక్షులవుతారు. సిఐఐఎల్ డైరెక్టర్ కార్యదర్శి అవుతాడు. దాని నిర్వహణతో తెలుగు అకాడమీకి గాని, మరొక సంస్థకుగాని సంబంధం ఉండదు! దీన్ని తెలుసుకొని, లక్ష్మీపార్వతి గారు తన ఆలోచనను సవరించుకోవడం మంచిది. ఆవిడ తెలుగు అకాడమీని సమర్థతతో నిర్వహిస్తేచాలు. అదే అమెకు కీర్తికిరీటాన్ని తెచ్చిపెడుతుంది. ఆమె మా ఈ రెండు సూచనల్ని గ్రహించి, తమ ఆలోచనల్లో తగు మార్పులు చేసుకోవడం శ్రేయస్కరం.

తెలుగు అకాడమీని, తెలుగు ప్రాచీన విశిష్టభాషా కేంద్రాన్నీ అల్లరిపాలు చేయవద్దు. వాటిని శక్తిమంతంగా పనిచేయనివ్వండి. ఆంధ్రప్రదేశ్ నేతలు తెలుగుకు చేయగల కనీస ఉపకారం ఇది.

తేదీ : 31-08-2021

సామల రమేష్‌బాబు

డాక్టర్ ఏటుకూరి ప్రసాద్
040 – 2638247

# ముమ్మొనవాలు



ప్రజలు కూడా భాషాసంస్కరణ జరిగిననాడే జాతి, సాహిత్యం వేయి ముఖాలుగా విస్తరిస్తుందని భావించి గిడుగుకు అండగా నిలిచారు. ఈ విధంగా గిడుగు భాషా సంస్కరణోద్యమం రూపంలో ఫ్యూడలిజం మీద తిరుగుబాటు చేశాడు. అయితే కందుకూరి, గురజాడలలాగా గిడుగు సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించలేదు. కేవలం ఒక శాస్త్రకారుడుగా వ్యావహారిక భాషాధర్మరక్షణకు నిలబడ్డాడు. ఇలాంటి పూర్వరంగం సిద్ధం అయిన దశలో తాపీ ధర్మారావు ప్రవేశించాడు. గిడుగు చివరి సందేశాన్ని ఆచరణలో పెట్టడంలో తనదైన ప్రత్యేకతను కనబరిచాడు. తొలుత పత్రికా రంగంలో, తరువాత సినిమా రంగంలో ప్రజలభాషకు పట్టంకట్టడం కోసం ఒక పత్రికా సంపాదకుడిగా, ఒక రచయితగా లక్ష్యాలను సాధించాడు. ఆయన పుట్టినరోజు(సెప్టెంబరు 19)ని 'తెలుగు జనమాధ్యమాల దినోత్సవం'గా జరుపుకొంటున్నాం.

**తె**లుగునాట 19వ శతాబ్ది చివరి పాదంలోనూ 20వ శతాబ్ది ప్రథమ పాదంలోనూ వివిధ రంగాలలో గణనీయమైన సంచలనం కలిగింది. దేశ ప్రజలలో ఫ్యూడల్ వ్యవస్థ మంచి చెడ్డలను గ్రహించే శక్తి అధికమైంది. పశ్చిమ దేశాలలో అంతకు పూర్వమే అనేక రకాలైన మార్పులొచ్చి అక్కడి స్థితిగతులను కుదిపేశాయి. ఆ భావాలూ ఆ మార్పులూ క్రమేణా తెలుగుదేశంలో కూడా ప్రభావాన్ని కలిగించటం ఆరంభించాయి. వాటి పర్యవసానమే నాడిక్కడున్న యువతరంలో ఫ్యూడల్ వ్యతిరేకతా ధోరణీ, ప్రజాతంత్ర భావాల మీద సద్భావం ఏర్పడటానికి కారణమైంది. ఆ భావాలంటే ఆసక్తి కలగడానికి ఆస్కారం కలిగించింది.

ఒక రకంగా మెకాలే కారణాన 1835 తర్వాత మనదేశంలో ఆంగ్ల ప్రభుత్వం ఒక విధమైన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టటం వల్ల మంచికి మంచీ, చెడుకు చెడూ రెండూ జరిగాయి. 1835 లోనే గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్ తన ప్రకటనలో భారతీయుల్లో సాహిత్య, శాస్త్ర జ్ఞానాలను వ్యాపింపచేయటం ఆంగ్ల ప్రభుత్వ ఆశయమని చెప్పాడు. ఆ ఇది ఎంత వరకు నిజమన్నది వేరే విషయం. అంతవరకూ అరకొరగా మనకందుబాటులోకొస్తున్న ఇతర దేశాల భావ విశేషాలు నేరుగా అధ్యయనం చేయటానికవకాశం కలిగింది. తరతరాలుగా సంప్రదాయం పేరుతో మనల్ని పీల్చి పిప్పిచేస్తున్న విభిన్న రంగాలలోని మౌఢ్యాన్నీ మూర్ఖత్వాన్ని ఎదిరించటానికి కొంత అవకాశం కలిగింది. మనస్సులో పేరుకొన్న బురదను కడగటం అవసరమన్న అభిప్రాయాలను అది అందించింది. అదే సందర్భంలో ఇది ఆంగ్ల మానసపుత్రులను తయారు చేయటం, దాన్నింతవరకూ మన దేశం వదల్చుకోలేనంత పీడగా మారటం గమనించాల్సిన అవసరం కూడా ఉంది.

ఈ విద్యావిధానం – సంపర్కం మన వారి దృష్టిని ఒక విధంగా విశాలం చేసింది. అంటే అంతవరకూ వేళ్లూని ఉన్న భూస్వామ్య వ్యవస్థ అస్తిత్వాన్ని సమాజపరంగా అర్థం చేసుకోటానికి ఇది ఉపయోగపడిందనవచ్చు. అయితే ఆ వ్యవస్థలోని చెడ్డలని గ్రహించే శక్తి ప్రజలకు అప్పుడప్పుడే కలుగుతున్నా ఆ భావాలు ప్రజల్లో వ్యాప్తి కాకుండా పాలకులు జాగ్రత్త పడుతూండేవారు. జనంలోకి విద్య బాగా దారులు వేసుకుంటూ పోతే ప్రజలు మరింత తెలివిమీరిపోతారేమోనన్న భయంతో వారిని జోకొట్టటానికి అవసరమైన విషయాలను కూడా విద్యావిధానంలో ఉండేలా చూసుకుంటూండే వారు. దానివల్ల ప్రజల్లో భూస్వామ్య వ్యవస్థ అంటే అడపాదడపా వ్యక్తమయ్యే కోపం – క్రోధం అంటుకట్టుకోలేకపోయింది.

ఆ కొద్దిపాటి విద్య ప్రసాదించిన శక్తివల్ల బయటి ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను, ఆయా ప్రదేశాల్లో తమతమ దేశ స్వాతంత్ర్యాలకై జరుగుతున్న పోరాటాలను ప్రజలు అవగాహన చేసుకోటం ఆరంభించారు. పరాయి పాలన తెచ్చిపెడుతున్న అనర్థాలను గ్రహించగల శక్తి ప్రజలకు అలవడసాగింది. ఇతర దేశాల స్వాతంత్ర్య పోరాటాల గాలులు ఇక్కడి నేలపైన వీచటం ఆరంభించాయి. ప్రజలొక కొత్తగాలి పీలుస్తున్నట్టు భావించారు. దృష్టిలో మార్పు వచ్చింది. అంతవరకూ భూస్వామ్య వ్యవస్థను సమాజపరంగా అర్థం చేసుకోగలిగిన మేరకే ఎదిగినవాళ్లు దానిలోని లోపాలను గమనించటం, అవకాశమున్నంత మేరకు వాటిని ఎత్తిచూపడం వరకొచ్చారు. అంతకు మించి ఆ వ్యవస్థను వ్యతిరేకించగల స్థైర్యంగానీ, ధైర్యంగానీ వారికి అలవడలేదు.

ఈ పై లక్షణాలతో కొత్తగా రూపు కట్టుకొంటున్న బూర్జువాతత్త్వం ప్రజల్లో ఆరంభమైంది. ఈ వర్గంవాళ్లు భూస్వామ్య వ్యవస్థలోని చెడును ప్రజలకు వివరించేటంత వరకే తమ అభ్యుదయశీలాన్ని ప్రదర్శించ గలుగుతారు. బూర్జువా వ్యవస్థ జనించటానికి ప్రతిబంధకంగా ఉండే ఫ్యూడల్ అంశాలను నిశితంగా పరిశీలించి సవిమర్శకంగా బట్టబయలు చేస్తారు. సాధారణంగా పాత సమాజం నుండి కొత్త సమాజం రూపు సంతరించుకుంటున్న తరుణంలో వచ్చిన సాహిత్యానికి అభ్యుదయ స్వభావం. ఉంటుంది. అలాంటి సంధ్యా సమయంలో పుట్టిన సాహిత్యవేత్తలలో నిర్భీకత్వం, నిస్వార్థం ఉంటాయి. సరిగ్గా

అటువంటి సమయంలోనే తెలుగు సాహిత్య రంగంలో ఉద్దండులుదయించారు. అలాంటి వారిలో అగ్రశ్రేణి యోధులు కందుకూరి, గురజాడ, గిడుగు.

అయితే బూర్జువా వ్యవస్థ పెంపొందుతున్న కొద్దీ తన పెరుగుదలకు ఆటంకాలుగా ఉన్న ఫ్యూడల్ సమాజ భావాలను తొలగించుకుంటూ అనుకూలమైన అంశాలను మాత్రమే పదిలపర్చుకుంటూ ఉంటుంది. కాలక్రమేణా ఇది కూడా సమాజ పరిణామ దశలో తన అభ్యుదయ పాత్రను కోల్పోతుంది. అప్పుడు సమాజం, సాహిత్యాలలో వచ్చే ఏ కొద్ది మార్పులకైనా వెూకాలడ్డటానికి కూడా యత్నిస్తుంది. ఈ దశలోని సాహిత్యకారులకు అసాధారణ ప్రతిభా వ్యుత్పత్తులుండటం చాలా అవసరం. ఎందుకంటే అటు ఫ్యూడలిజంలోని వైరుధ్యాలనే కాక తమ చుట్టూ ఉన్న బూర్జువా వ్యవస్థలోని వైరుధ్యాలను కూడా నిశితంగా పరిశీలించి అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని సవిమర్శకంగా చూసి, ప్రామాణిక సాహిత్య పునాదులతో దృఢపర్చుకుంటూ వాస్తవికతను వెల్లడించే లక్షణాలు పుణికి పుచ్చుకొనగలిగి ఉండాలి. యూరప్‌లో 15 – 17 శతాబ్దాల్లో వచ్చిన సాంస్కృతిక ఉద్యమం తర్వాత కలిగిన చైతన్యం ఇక్కడ కూడా ప్రసరించింది. దీన్నే మనం సాంస్కృతిక పునరుజ్జీవనమనీ 'రినైజాన్స్' అనీ అంటున్నాం. ఇక్కడి తరం ఈ భావాల వల్ల తమ సనాతన హైందవ సంస్కృతి భావాలను కాలదన్ని నూతన భావాలను స్వీకరించాల్సి వచ్చింది. సంఖ్యాపరంగా ఇలాంటి వాళ్లు కొద్దిమందే అయినా వాళ్ల కృషీ – దాని ప్రభావం అపారమైందనే అనాలి. ఇక 19వ శతాబ్దాని కొచ్చేటప్పటికి మత భావాల్లోనూ, కళాదృష్టిలోనూ నీరసపడి ఈడిగిల పడ్డ జాతికి కొత్త రక్తాన్ని అందించిందనవచ్చు.

ఫ్యూడల్ సంస్కృతి పతనావస్థలో ఉన్న దశకూ బూర్జువా వ్యవస్థ స్థాపన దశకూ మధ్య ప్రపంచ చరిత్రలో ఈ సాంస్కృతిక పునరుజ్జీవనం వచ్చిందన్న విషయం తెల్సిందే, దీనికి విజ్ఞాన శాస్త్ర రంగంలో జరిగిన అనేకానేక పరిశోధనలూ, వాటివల్ల ఆవిష్కృతమైన నూతన విషయాలూ హేతువులు. ఈ తత్వం భౌతికవాద అవగాహనతో సమాజాన్ని అధ్యయనం చేయటానికి పూనుకుంది. కనుకనే ఈ లక్షణాలన్నీ నాటి తరంలో గూడు కట్టుకున్నాయి.

ఈ భావాల ప్రతీక రాజా రామమోహనరాయలు (1772 – 1833). తన ప్రాచీన భాషా పాండిత్యంతోనూ ఉపనిషత్తుల మీద ఉన్న ప్రత్యయంతోనూ ఆంగ్ల విద్య ద్వారానే మన దేశంలోని ఛాందస సనాతనులతో హోరాహోరీగా పోరాటానికి దిగాడు. సంప్రదాయవాదులతో ఆ పంథాలోనే తలపడ్డాడు. పునరుజ్జీవన భావాలు ఆయనలో మతం – సమాజాల పట్ల విమర్శనాదృష్టిని కలిగించాయి. ఆ కొత్తచూపుతో భారత జాతిని సంస్కరించాలన్న తలంపుతో రంగంలోకి దూకాడు.

అలాగే దయానంద సరస్వతి (1824 – 1883) స్థాపించిన 'ఆర్యసమాజం' సంస్కరణలను కాలదన్నలేదు. ఆర్యసమాజం (1875) ఆచారాలన్నిటినీ శిరసావహించాలనడానికి వ్యతిరేకం. **ఇతర మతాలవాళ్లను తిరిగి హిందూమతంలోకి చేర్చుకోవచ్చంటూ – మతాలన్నవి ఉక్కు చట్రాలు కావని – వాటి ఇసుక పునాదులను వెల్లడించింది.** ఇదీ ఆనాడు భారత జాతికి కొత్త రక్తాన్ని ఎక్కించటానికి కొంత తోడ్పడింది.

విల్ డ్యురాంట్ మాటల్లో చెప్పాలంటే – ఈ దశలోని వ్యక్తుల్లో సామాన్య లక్షణాలు ముఖ్యంగా బౌద్ధిక, మానసిక వ్యక్తిత్వాల (అడాసిటీ) చుట్టూ పరిభ్రమించాయనవచ్చు. నిశితమైన మేధ; కుశాగ్రమైన జాగరూకత; వివిధ విషయాలలో ప్రజ్ఞ; అన్ని భావాలనూ ముద్రలనూ ఆహ్వానించటం; సౌందర్యారాధన, కీర్తికాంక్ష వంటి లక్షణాలే కాకుండా సంప్రదాయాలను ధిక్కరించటం, నీతులూ ఆంక్షలూ వంటివే కాకుండా చివరకు దేవుడి అస్తిత్వాన్ని శంకించటం లాంటివి కూడా నాటితరం వాళ్ళలో కనిపిస్తాయి.

ఇలాంటి పరిస్థితుల్లోనే కందుకూరి వీరేశలింగం (1848 – 1919) ఆవిర్భవించాడు. ఏ ఫ్యూడల్ వ్యవస్థనుండి తాను వచ్చాడో దాని మంచి చెడ్డలను రుచి చూశాడు. కులమత వ్యవస్థలు ఎలా నిలదొక్కుకున్నాయో గ్రహించాడు. దాన్ని ఆశ్రయించుకొని పెరుగుతున్న డంబాచారాలను, వాటి నీడలో బతికేవారి ఆచారాల ఆర్భాటాలనూ చూశాడు. అసహ్యించుకొన్నాడు. తన చుట్టూ ఉన్న సమాజంలోని అవలక్షణాలను ప్రజలకెరుక పరచడానికి సాహిత్యాన్ని వినియోగించాలని తలచాడు. పై లక్షణాలవల్ల వీరేశలింగానికి – బాధలకు గురవుతున్న ప్రజలపైన క్రమంగా ఒక రకమైన కరుణ కలిగింది. ఆ మానవతావాదమే ఆ కుళ్లు పైన ఆయనలో ఏహ్యాభావాన్ని కలిగించింది. సంస్కర్తగా తీర్చిదిద్దింది.

తన సంస్కరణలన్నీ మానవతావాదంనుండే వచ్చాయి కనుక అంతకన్నా ముందుకువెళ్లి ఈ చెడుగులకు ఆది కారణాలైన వర్ణవ్యవస్థ పై దెబ్బతియ్యాలనీ కూలదొయ్యాలనీ కందుకూరి భావించలేకపోయాడు. అయితే విధవా పునర్వివాహం – నాటి హైందవ సనాతనులు గొంతు పిసుక్కునేటంత సంస్కరణగానే మనం భావించాలి. దీనికి వారి వేలితో వారి కంటినే పొడవాలన్న భావంతో వారి శాస్త్రాలనుండే ఉదాహరణలను చూపటానికి యత్నించాడు. శాస్త్రాలు, స్మృతులూ అన్నీ చాతుర్వర్ణాశ్రమ ధర్మాలకు మూలాలు కనుక ఆ పరిధిలోనే కృషి చేయటంవల్ల వర్ణాలను అధిగమించే ప్రయత్నం చెయ్యటానికి తగిన వ్యవధికానీ, పరిణత సమయం కానీ లభించి ఉండకపోవచ్చు.

పండితులచేత తలలూపించుకుంటూ తను చెప్పే విషయాలపై వారికి విశ్వాసం కలిగించడానికే ఆదిలో వీరేశలింగం శ్రమించాడు. సాహిత్యం సంస్కరణకోసమే నన్నదాయన భావన. ఫ్యూడల్ వ్యవస్థలోని వైరుధ్యాలను సరిచేయాలన్న దానికన్నా వాటిని ప్రజల దృష్టికి తేవాలన్నదే కందుకూరి ఆకాంక్ష. కనుకనే ప్రజల సమీకరణకు తక్కువ అవకాశం ఉన్న వ్యక్తిగత సాహిత్యరూప ఉద్యమాన్నే చేపట్టాడు. నాడు ప్రజలంటే కేవలం చదువుకున్న వారే. వారి మనసులను తన రచనల ద్వారా ప్రభావితం చేసి అటు సంస్కరణ దిశలోగానీ, ఇటు సాహిత్య దిశలోగానీ మళ్లించవచ్చని కందుకూరి భావించాడు. విశ్రాంతి ఎరగని వీరుడిలా పోరాడాడు. రానున్నతరం మానవులు ఇంతకన్నా ముందుచూపుతో నాటి ఫ్యూడల్ వ్యవస్థను ఛేదించుకుని పోగల దారిని నిర్మించాడు. సాంఘిక విప్లవకర్తగా నిలిచాడు.

గురజాడ అప్పారావు (1862–1915) కూడా ఇలాటి సామాజిక పరిస్థితులలోనే అవతరించాడు. తొలినాళ్లలో అప్పారావు కుటుంబం చాలా పేదరికాన్ననుభవించినా మొత్తానికి ఫ్యూడల్ వ్యవస్థలోని మంచినే వీరు అనుభవించారనవచ్చు. జమీందారుల,

రాజాల మధ్య పెరిగారు. ఉద్యోగాలు నిర్వహించారు. ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతినిధులైన రాజుల మధ్య తగాదాలూ వైరుధ్యాలనన్నిటినీ చాలా సన్నిహితంగా చూసే అవకాశం గురజాడకు కలిగింది. ఈ అవకాశమే తన చుట్టూ ఉన్న వ్యవస్థ ఇక ఎంతో కాలం ఉండబోదని, చీకి చివికి పోతున్నదనీ ఆయన గ్రహించేలా చేసింది. కనుకనే మారుతున్న కాలాన్ని అంచనా వేయగలిగాడు గురజాడ, ఈ అవకాశం కందుకూరికి లభించలేదు. జమీలు జారటం, తగాదాలతో జమీందారులు న్యాయస్థానాల చుట్టూ తిరగడం గమనిస్తానూ; ఆ వ్యవస్థ ప్రసాదించిన అవలక్షణాలైన పరువుకోసం పాకులాడే తత్వం, బ్రాహ్మణబ్రువుల ఆధిపత్యం; వర్ణ వ్యవస్థ తెచ్చిన నైచ్యాలను క్షణం క్షణం వీక్షిస్తూ ఉండటం చేతనూ వాటిని ఎదిరించాలన్న భావం ఆయనకు కలిగింది.

కందుకూరి నిశితమైన హాస్యంతో ఎదిరించాలనుకున్న సందర్భంలో గురజాడ మెత్తని హాస్యంతో ప్రజల్లో హృదయ పరివర్తన రావాలని ఆశించి ఆ దిశగా సాహిత్యాన్ని సృష్టించాడు. కందుకూరి నాటికి పాదుకొనని అంతర్జాతీయత, గురజాడ ఉద్యమంగా సాహిత్య సృజన చేస్తున్న కాలానికి వేళ్లూనటం ఆరంభించింది. కందుకూరి కృషి సంస్కరణదిశలో పీఠాధిపతులను కదిలించటంతో ఆరంభిస్తే గురజాడ దాన్ని ఆసరాగా తీసుకుని ప్రజలను పురికొల్పటానికి ఉద్యుక్తుడయ్యాడు. అందుకనే 'నాది ప్రజల ఉద్యమం' అనగలిగిన శక్తి కందుకూరికి లేనిదీ, – దక్కనిదీ. గురజాడకు దక్కింది.

గురజాడ చిన్నతనం నుండే తనలో సాహిత్యాన్ని నింపుకున్నాడు. గిడుగు రామ్మూర్తి, గురజాడా కలిసినప్పుడల్లా ఇలాటి ఘటనలు పైకొస్తూండేవి. 'మీ పేరేమిటి'లో రామ్మూర్తి పాత్ర గిడుగువాళ్లబ్బాయే " ఈ హాస్యాన్నే ఆలంబనంగా చేసుకుని కన్యాశుల్కాన్ని తీర్చిదిద్దాడు. సంఘంలోని దురభ్యాసాలు వ్యవస్థను ఎలా చెరుస్తాయో ఇందులో చెప్తాడు. ఒకే సమస్యను ఎవరెవరెలా స్వలాభం కోసం మల్చుకోగలరో తెలిపాడు. ఫ్యూడలిజానికి ప్రతినిధులైన అగ్నిహోత్రావధానులు, రామప్పంతులు వంటి వారు తమ కనుకూలంగా సమస్యలను చూడడానికి ప్రయత్నిస్తే, కొత్తగా తలెత్తుతున్న బూర్జువా వ్యవస్థకు ప్రతినిధిగా గిరీశం తన ప్రతిష్ఠ పెంచుకోవటానికి, లేకపోతే పొట్టకూటికీ దాన్నెలా వినియోగించు కుంటాడో విడమర్చాడు. ఈ రెండు వ్యవస్థలూ ఒకదానికొకటి శత్రువులని రుజువు చేశాడు. రెంటికి చెందిన మనుషులూ ఒకరిని మరొకరు ఏరకంగా దోపిడీ చేసుకుంటారో కూడా వర్ణించి చెప్పాడు. అలాగే మూఢ నమ్మకాలనూ, అప్పటికే బూర్జువా సమాజ లక్షణమైన లంచగొండితనాన్నీ, ఆశ్రిత పక్షపాతాన్ని కళ్లముందు నిలిపాడు. పోలీసు వ్యవస్థ ధనవంతుల రక్షణకేనన్న అభిప్రాయాన్నికూడా గురజాడే అందించారు. ఛాందసుల మధ్య ఉంటూ వాళ్ళ నెదిరించడంలోనే పూర్తిగా మునిగిన కందుకూరి దృష్టికి ఈ లక్షణాలన్నీ రేఖామాత్రంగానే కనిపించాయి. గురజాడలా స్పష్టమైన అవగాహన ఆయనకు అందలేదనే అనాలి. కందుకూరి బోధన ఆదేశాత్మకంగా ఉంటే, గురజాడది ఉపదేశాత్మకంగా ఉంది. కందుకూరి సంస్కరణోద్యమంవల్ల అనుకోకుండా కొందరు కుహనాసంస్కర్తలు బయలుదేరడంవల్ల – జనం కందుకూరి ఉద్యమాన్నే శంకించే దశను – గురజాడ చాలా సమీపంగా ఉండి స్పష్టంగా గమనించాడు. అందుకే సంస్కరణ బలవంతంగా ఉండకూడదని తలచాడు. ప్రజల హృదయాలను మార్చటం అవసరమని భావించి ఆ ముసుగులను చీల్చడానికే 'సంస్కర్త హృదయం' రాశాడు.

దేవుని పేరిట జరుగుతున్న అన్యాయాలను, మతం పేరిట ప్రజలను పక్కదారి పట్టిస్తున్న సంఘటనలను కందుకూరి తన రచనల్లో విశదంగా వల్లభాచార్య మతం గూర్చి చేసిన వాటిల్లో వర్ణిస్తూ తీవ్రంగా ఖండిస్తూ నడిచాడు. గురజాడ ఇలా చేస్తూనే మరింత స్పష్టంగా భౌతికవాద దిశగా చూపు సారించాడు. దేశభక్తితో ప్రజలను కదిలించి, అంతకన్నా సమాజానికి అవసరమైన అంతర్జాతీయ దృక్పథాన్ని కూడా పెంచుకోమని ఉద్బోధించాడు. ఇదంతా కాలం మార్పుగా మనం పరిగణించవచ్చు.

కందుకూరి గ్రాంథికం నుండి సరళ గ్రాంథికం దాకా మారి, రచనలకు దారి చూపితే – ప్రజల మనస్తత్వం మరింత బాగా తెలిసినవాడు గనుక వస్తున్న మార్పులకు హృదయపూర్వకంగా ఆహ్వానం పలకాలన్న భావంతో – గురజాడ వ్యావహారిక భాషను చేపట్టాడు. తన సాహిత్య ఉద్దేశ్యం నిర్ద్వంద్వంగా ప్రజల కొరకేనని భావించాడు. లలితపద విన్యాసంతో హృదయానందకరంగా సున్నితమైన హాస్యాన్ని ఆశ్రయించి వాడుకభాష ద్వారా తన కృషి సాగించాడు.

ఇద్దరూ జీవించిన కాలం ఒకటే కనుక ఆంగ్ల భాషన్నా, ఆ విద్యావ్యాసంగం అన్నా ఇద్దరికీ అభిమానమే. గురజాడ కొంత మమకారాన్ని కూడా ప్రకటించాడు. జమీందారుల దగ్గర నౌకరీ చేస్తున్నా, గ్రంథాలనంకితం ఇస్తున్నా దేశ స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న ఉద్యమాలనూ అంతర్జాతీయరంగంలో వస్తున్న మార్పులనూ గురజాడ అధ్యయనం చేస్తూ అర్థం చేసుకున్నాడు. కనుకనే తను చేస్తున్న పనికీ ఇలాంటి ఉద్యమాలకూ మధ్య వైరుధ్యం ఉన్నా కుమ్మరి పురుగులా మసులుతూ మంచికి ఆవాహన పల్కాడు. పాత కొత్తల మేలు కలయికను ఆశించాడు. పశ్చిమ దేశాల నాగరికత వల్ల అబ్బిన భౌతికవాద శక్తితో శకునాలనూ తోకచుక్కలనూ శాస్త్రీయంగా చూశాడు. గురజాడకు భవిష్యత్తు మీద అచంచలమైన ఆశ ఉంది. సౌజన్యారావు వంటి వాళ్లు కొందరొస్తారనీ, వాళ్లు ప్రజల హృదయ పరివర్తనకు కృషి చేసి, గిరీశం లాంటి కుహనా అభ్యుదయ వాదుల ఆట కట్టిస్తారని భావించాడు. గురజాడ చూపులో కనబడిన మరో విశేషం ఏమిటంటే దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం రావటం అవసరమన్న భావం. అందుకు ఇతర దేశాలతో వర్తక వాణిజ్యాలు పెంపొందాలన్న ఆకాంక్ష. **కనుక ఒక సాహితీ వేత్తగా ప్రజల సమస్యలకు ఆర్థిక సమస్యలను జోడించి చూడటం గురజాడ కబ్బిన విశేషగుణంగా భావించాలి.**

**మనుషుల భావాలలోని కుళ్లును, గుడ్డి ఆచారాల వెనకున్న అసంబద్ధతను, ఘోరాలనూ నిర్దాక్షిణ్యంగా తుడిచేస్తూ కందుకూరి ముందడుగేస్తుంటే, దీనికి బాసటగా అంతర్జాతీయ దృష్టితోనూ ఆర్థిక పునాదితోనూ సమస్యలను సాహిత్యంలో ప్రతిబింబిస్తూ గురజాడ కలిశాడు. అక్షరాస్యులే అడ్డుగోడలౌతున్న సమాజంలో విద్యావంతులను క్షాళనం చెయ్యంది ముందడుగు వెయ్యలేమనీ – రచనలూ, రచయితలూ అందుకు కృషిచేయాలనీ, కనుక వారి భాష ప్రజలభాష కానంత వరకూ**

**అది జరగదనీ గిడుగు (1863 – 1940) భావించాడు. విద్యావంతుల మనుకుంటూ గిరిగీసుకుని రాస్తున్న వాళ్లపై చిచ్చరపిడుగులా పద్మా కందుకూరి, గురజాడలకు సైదోడయ్యాడు.**

పతనం కాబోతున్న ఆనాటి వ్యవస్థకు చెందినవారే ఈ ముగ్గురు. అప్పటికి కందుకూరి సంస్కరణ వాదం, వ్యావహారిక భాషతో కూడిన గురజాడ సంస్కరణ వాదం దేశంలో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. కందుకూరి తరహాను కొందరు ఛాందసులు ద్వేషించినా గురజాడ పద్ధతిని ప్రజలు మెచ్చుకోవటం గిడుగు గమనించాడు. విదేశాలలోని భాషోద్యమాలను ఆకళింపు చేసుకున్నాడు. వారితో ప్రత్యక్షంగానూ ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా పరోక్షంగానూ సంబంధాలు పెంచుకున్నాడు. ఒక ఉద్యమం వ్యాప్తి చెందాలంటే ప్రజలపాత్ర ప్రధానమైందని భావించాడు. ప్రజల సహాయం పూర్తిగా పొందకుండా పాండిత్య ప్రకటనతో పండితులను తానొక్కడే ఎదుర్కొన్న కందుకూరినీ, ప్రజల ఉద్యమాన్ని పెంచాలన్న ఆకాంక్షతో ప్రజలలో తక్కువ శాతంగా ఉన్న పండితులను లెక్క చెయ్యక తన సాహిత్యం ద్వారా పోరాడుతున్న గురజాడనూ గిడుగు సవిమర్శకంగా చూశారు. అంతవరకూ జరుగుతున్న ఉద్యమాలలోని ప్రధానమైన లోపం ప్రజల పాత్ర మృగ్యం కావడమేనన్నీ వారికర్థం కానిది సఫలం కాదనీ భావించాడు. అందుకే వ్యావహారిక భాషోద్యమాన్ని చేపట్టాడు. పండితులు మొదటి నుండీ సంస్కరణకు వ్యతిరేకులే. అది సమాజ సంస్కరణ అయినా, భాషా సంస్కరణ అయినా ఫ్యూడలిజం ప్రతినిధులుగా తాము వాటిని అడ్డుకోవటానికే నాటి పండితులు నిశ్చయించుకున్నారు.

పండితుల ఆటకట్టించడానికి, ప్రజల నుద్రేకపరచడానికీ భాషోద్యమం తప్ప ఆ దశలో గిడుగుకు మరోటి కనిపించలేదు. మరి పండితుల నోరు మూయించాలంటే వారిని మించిన పాండిత్యం కావాలి. కావ్యపరిచయం, శాస్త్రాలతో సంబంధం అవసరం. అందుకే శాస్త్రాలన్నింటినీ ఆపోశన పట్టాడు. ప్రాచీన కావ్యాల నుండి ఉదాహరణలు చూపుతూ నాడు పండితులుగా చలామణి అవుతున్నవారి రచనలనుండే గ్రాంధికేతరాలను చూపుతూ ఏ పండితునికీ గ్రాంధిక రచన రాదనీ కనుక వ్యావహారిక భాషనే ఉపయోగించమనీ హెచ్చరించాడు. పండితుల నెత్తిన అశనిపాతంలా పడ్డాడు. భాషాపరంగా దేశం అల్లకల్లోలస్థితిలో ఉంది. రాజాశ్రయం, జమీందారుల ఆశ్రయం పొందిన గ్రాంధిక భాషావాదులు గిడుగును ఎదుర్కోనారంభించారు. వారిని ఓడించాలన్న ఊపులో ప్రజలను కొంత మర్చిపోయి పండితులతో – వారితో సమాన స్థాయిలో చర్చించటం మొదలుపెట్టాడు. పండిత భిషక్కుల భాషా భేషజం బయట పెట్టాడు. భాషాశాస్త్రకారునిగా పండితుల పైనా, వారి గ్రాంధికవాదం పైనా చండపరశువు నెత్తాడు. సమాజంలోని విభిన్న సమస్యలపై చూపున్నా ప్రధానంగా ప్రజలకు సన్నిహిత సంబంధం ఉన్న ఒకే ఒక్క భాషా సంస్కరణలో మునిగిపోయాడు. ఇక **ప్రజలు కూడా భాషా సంస్కరణ జరిగిన నాడే జాతి, సాహిత్యం వేయి ముఖాలుగా విస్తరిస్తుందని భావించి గిడుగుకు అండగా నిలిచారు. ఈ విధంగా గిడుగు భాషా సంస్కరణోద్యమం రూపంలో ఫ్యూడలిజం మీద తిరుగుబాటు చేశాడు. అయితే కందుకూరి, గురజాడలలాగా గిడుగు సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించలేదు. కేవలం ఒక శాస్త్రకారుడుగా వ్యావహారిక భాషా ధర్మరక్షణకు నిలబడ్డాడు.**

**ఇలాంటి పూర్వరంగం సిద్ధం అయిన దశలో తాపీ ధర్మారావు ప్రవేశించాడు.** తెలుగునాడులో ఫ్యూడలిజం అవశేషాలు తమ అంతిమ ఘడియల కోసం ఎదురు చూస్తున్నాయి. కందుకూరి, గురజాడ, గిడుగుల ఉద్యమాలు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాయి. హేతువాదం ముమ్మరంగా ప్రవేశిస్తున్నది. పాత వ్యవస్థ పోయి కొత్త వ్యవస్థ రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారు. చివికిపోయిన వ్యవస్థలోని వాళ్లకు రూపుకడుతున్న బూర్జువా వ్యవస్థ మీద గట్టి నమ్మకం ఇంకా ఏర్పడలేదు. రెండు వ్యవస్థలూ పరస్పరం అనుమానంతో, అవకాశం అందినప్పుడల్లా తమతమ రంగాల్లో – దోపిడీ చేసుకుంటున్నాయి.

ధర్మారావు పాత వ్యవస్థకు చెందిన మనిషి. పైకివస్తున్న బూర్జువా సమాజం పైనా, వాటి లక్షణాల పైనా నమ్మకం కలగలేదు. అందుకే సాహిత్య రంగంలో వీరు సంప్రదాయవాదిగా అడుగుపెట్టి గ్రాంథిక భాషావాదిగా గిడుగును అడ్డుకున్నాడు. వ్యవహారిక భాషను రచనల్లో వాడినందుకు ఒక నాటకంలో గురజాడను అవహేళన చేశాడు. తాను సనాతనాచారాల కుటుంబంలో నుండి వచ్చినందువల్ల జమీందారుల దగ్గర ఉద్యోగం చేస్తున్న కారణంగానూ; వారిమీదా, వారు అంతవరకూ రక్షిస్తున్నారని అనుకుంటున్న ఫ్యూడల్ వ్యవస్థ మీదా ఆ సంబంధమైన సాహిత్యం మీదా, సహజంగానే తాపీ అభిమానం ప్రకటించాడు.

అయితే దేశంలో ఆ నాటికే ప్రబలిన సునిశిత విమర్శనాత్మక దృష్టి, హేతువాద భౌతికవాదాల ప్రభంజనం, బ్రాహ్మణ – బ్రాహ్మణేతర ఉద్యమాల ఉధృతి, అతివాద రాజకీయాలూ ఇవన్నీ తాపీ వారిపై బలమైన ప్రభావాన్ని కలిగించాయి. ముఖ్యంగా బ్రాహ్మణేతర ఉద్యమం, స్వాభిమాన ఉద్యమాలు వీరిని కొంత కాలం నడిపించాయనవచ్చు. ప్రాచీన సాహిత్యం, సంస్కృతులను గూర్చి అంతవరకూ సాంప్రదాయికంగా వస్తున్న ఆలోచనలకు భిన్నమైన దిశకు వీరు తమ దృష్టిని సారించేలా చేశాయి.

దానితో వారిలో బలమైన ఆత్మవిమర్శ ఆరంభమైంది. అంతవరకూ పాత వ్యవస్థకు లక్షణమైన గ్రాంథికవాదంపై ఎంత పట్టుదల చూపేవారో, పాత సంస్కృతిపై ఎంత అభిమానం ప్రకటించేవారో అదంతా బీటలు వారింది. స్వతహాగా శాస్త్రీయ దృక్పథం కలిగినవాడు కనక పాత వ్యవస్థ మారబోతున్న సూచనను వేగంగా పసిగట్టాడు, రానున్న లోకాన్ని ఊహించగలిగాడు. బూర్జువా వర్గం నిలదొక్కుకోవడం ధర్మారావు చూశాడు.

ధర్మారావు, ఫ్యూడల్ సంబంధాలలోని వైరుధ్యాలనూ చెడుగులనూ, అప్పుడే పుట్టి బట్టకట్టుకుంటున్న బూర్జువా వ్యవస్థలోని అవకాశవాదాన్నీ, వైరుధ్యాలనూ, లోపాలనూ, స్పష్టంగా చూడగలిగాడు, దీనికి కారణం వారు పుట్టిన, జీవించిన నాటి పరిస్థితులే. .

అందుకే ఆ వ్యవస్థలు ఏర్పరచిన సాహిత్య, సాంస్కృతిక విలువలను సమూలంగా మార్చాలన్న ఆలోచన వీరికి వచ్చింది. దేవాలయాల మీది శిల్పాలను, ఇనుపకచ్చడాలను, పెళ్లితంతునూ శాస్త్రీయ దృష్టితో పరిశీలించారు. **కందుకూరి, గురజాడలు వివాహ వ్యవస్థలోని చెడుగులను ఎత్తిచూపుతూ సంస్కరణలకు ప్రయత్నిస్తే; తాపీ ధర్మారావు తన నాటికి స్థిరపడ్డ స్వాభిమాన ఉద్యమ దృష్టితో పూజారులనూ, పురోహితులనూ, పెళ్లి వ్యవస్థలనూ నిలేసి ప్రశ్నించి కూలదొయ్యడానికి యత్నించాడు. దేవుని అస్తిత్వాన్నే శంకించాడు.**

డా॥ ఏటుకూరి ప్రసాద్ గారి తాతాజీ ప్రముఖ రచనల వివరణాత్మక విశ్లేషణ 'రావేలు గలవాడ...' నుండి– మప్పిదాలతో

జె.డి.ప్రభాకర్
8500227185

# తెలుగుకు వడదెబ్బ: ఇంటర్మీడియేట్లో సంస్కృతం ఐచ్ఛికాంశం !

ప్రపంచీకరణ నేపథ్యంలో బ్రతుకు తెరువు కోసం పలు భాషలు నేర్చుకోవలసిరావడం సర్వసాధారణమైంది. కాలంతో పాటు భాషల బ్రతుకు కాలం మారుతోంది, స్థాయి తలకిందులవుతోంది. ఒకప్పుడు ఉన్నత స్థానంలో ఉన్న భాషలు ఇప్పుడు తమ ఉనికిని కోల్పోయాయి. జ్ఞానానికీ అధికారానికీ మారుపేరుగా పిలవబడిన సంస్కృతం, లాటిన్, హిబ్రూ, గ్రీకు, పర్షియను మొదలైన భాషలు అదే అధికార దాహానికి దాసోహమయ్యాయి. ప్రతి భాషా మనిషి జీవనానికీ వికాసానికీ తోడ్పడేవే. జ్ఞానార్జనకూ జ్ఞాన విస్తృతికీ సహకరించేవే. సాధారణ పరిస్థితులలో ప్రాంతాన్ని బట్టి, ప్రజల మాతృభాష, వారిని అన్ని రంగాలలోనూ అభివృద్ధి పథంలోకి నడిపిస్తుంది. కానీ వ్యాపార కాంక్షతో ఆర్థిక ఆలంబనతో అధికారాన్ని కైవసం చేసుకోవాలనే కోరికతో కొందరు స్వార్థ శక్తులు ఇతర రాజ్యాలపై దాడి చేసి, వారి భాషనూ, సంస్కృతినీ ఇతరులపై బలవంతంగా రుద్ది– వారు ఆక్రమించిన ప్రాంతాలలో అసాధారణ పరిస్థితులు నెలకొల్పి అక్కడి భాషలనూ సంస్కృతులనూ ధ్వంసం చేశారు. ఈ "భాషా విధ్వంసం మూలజాతుల విధ్వంసానికి మూలం" అని ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు తమ అనేకానేక వ్యాసాలలో పేర్కొన్నట్లు ఎన్నో భాషలూ వాటితోపాటే ఎన్నో జాతులూ తుడిచిపెట్టుకుపోయాయి. ఉత్తర దక్షిణ అమెరికా ఖండాలలోనూ, ఆఫ్రికా ఆస్ట్రేలియా ఖండాలలోనూ జరిగినది ఇదే. ఒకప్పుడు ఐరోపాకు వలసరాజ్యాలుగా ఉన్న ఆసియా ఖండంలోని అనేక దేశాలు నేడు ప్రజాస్వామ్య సార్వభౌమిక దేశాలుగా పిలువబడుతున్నప్పటికీ, ఆధునిక మార్కెట్ ఆర్థిక వలయంలో అనేక ప్రాంతీయ భాషలు నేడు చిక్కుకున్నాయి. పాలకవర్గాలు ఈ దుస్థితికి సహకరించడం గమనార్హం.

ఈ విధంగా ఒక వైపు ప్రాంతీయ భాషలు నేడు ఆధునిక మార్కెట్ ప్రపంచీకరణ నేపథ్యంలో దూసుకొస్తున్న ఇంగ్లీష్‌భాష దాడితో పోరాడుతుంటే– మరోవైపు దైవభాష, జ్ఞానభాష పేరుతో సంస్కృతాన్ని పాలకులు ముందుకు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో స్వయం ప్రతిపత్తి కలిగిన తెలుగు అకాడమీని సంస్కృతంతో కలిపి "ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ" అని పేరుపెట్టడం, అన్ని రంగాలలోనూ వాడే ప్రజలభాషకూ– కొన్ని ప్రత్యేక రంగాలకుమాత్రమే పరిమితమై ప్రజల సామాన్యవ్యవహారంలో లేని సంస్కృతభాషకూ ముడిపెట్టడం పాలక వర్గాల అమాయకత్వమో లేక పైకి కానరాని కుట్ర ఫలితమో కావచ్చు, అలాంటిదే, తెలంగాణలో ఇంటర్మీడియేటు విద్యలో ఒక భాషా విషయంగా తెలుగుతోబాటు సంస్కృతాన్ని ఐచ్ఛిక విషయంగా పెడుతూ ఉత్తర్వులు జారీ చేయడం దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచాయి. సంస్కృతాన్ని ఒక అంశంగా పాఠశాలలోనూ, ఇంటర్మీడియేటు విద్యలోనూ బోధించడానికి గల కారణాలూ, బోధనలలోనూ మూల్యాంకనంలోనూ లోపించిన శాస్త్రీయతను వివరణాత్మకంగా తెలపడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**సంస్కృతం బోధనలో ఉద్దేశం:** నూతన విద్యా విధానం 2020(4.17, పేజీ 14) లో సంస్కృతం భాషను జ్ఞానానికీ సంస్కృతికీ శాస్త్రానికీ ప్రతీకగా భావించి పాఠశాలలో విద్యార్థులకు నేర్పించాలని పేర్కొన్నారు. పూర్వకాలంలో వేదగణితశాస్త్రం, జీవశాస్త్రం, భౌగోళికశాస్త్రం, అంతరిక్షశాస్త్రం మొదలైన శాస్త్ర జ్ఞానమంతా సంస్కృతంలో నెలకొని ఉందనీ దానిని నేర్పించడం వలన మన స్వదేశీ జ్ఞానాన్ని ఉపయోగించుకుని అభివృద్ధి చెందవచ్చనీ భావించారు కాబోలు. అందువలననే సంస్కృతానికి విద్యా వ్యవస్థలో ప్రత్యేక స్థానాన్ని కల్పించినట్లుంది. కానీ ఈ భావన ఎంతవరకూ ప్రయోజనకరమో? ప్రత్యేక అధ్యయనం ఏమీ చేయలేదు. దీనికి కారణం 2011 సంవత్సరం గణాంకాల ప్రకారం మనదేశంలో సంస్కృతాన్ని తమ దైనందిన జీవితంలో ఉపయోగిస్తున్నవారు 14,000 మంది, అంటే ఒక శాతంలో వందోవంతు కంటే తక్కువే. వీరిలో ఉత్తరాఖండ్లో సంస్కృతం మాట్లాడే వారు ఎక్కువగా ఉన్నారు, అక్కడే అధికార భాషగా కూడా ఉంది. సంస్కృత పండితులూ, సంస్కృతాన్ని మాతృభాషగా కలిగిన వాళ్ళు జ్ఞానానికి నిలయమైనదనుకున్న సంస్కృత భాషను నేర్చుకుని ఎంతమంది శాస్త్రవేత్తలయ్యారు? ఎంత మంది కొత్త ఆవిష్కరణలు చేశారు? కొన్ని భాషలు దైవ భాషలు మిగిలిన భాషలు ప్రజల భాషలు, కొన్ని భాషలు అధికమైనవి కొన్ని భాషలు అల్పమైనవీ అన్న అశాస్త్రీయ భావనలో నుంచి ఉత్పన్నమైనవే ఈ వాదనలు. కానీ స్థానిక భాషల మీద సంస్కృత ప్రభావం, అది కలిగించే నష్టం తెలిసినా రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా వాటిని బేఖాతరు చేస్తున్నారు.

**మార్కులే ప్రధానలక్ష్యంగా:** పాఠశాలల్లోనూ, ఇంటర్మీడియేటు విద్యలోనూ విద్యార్థులు తెలుగు స్థానంలో సంస్కృతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం సులభంగా వచ్చే అధిక మార్కులే. ఇది సంస్కృత భాషను నేర్పేందుకు కాక, మార్కుల మొత్తాన్ని పెంచుకోటానికీ, వాటితో ప్రైవేటు కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల్ని పెంచుకొనేందుకు ప్రోత్సాహకంగా విద్యాసంస్థలు విద్యార్థులకు వేసే ఎరగా జరుగుతుందనిపిస్తోంది. విద్యాసంస్థల మార్కుల ప్రకటనలు ఈ కాలంలో పరిపాటే. ఎక్కువమంది విద్యార్థులు కూడా అధిక మార్కులు సాధించడానికి సంస్కృతాన్ని ఎంచుకోవడం మామూలైపోయింది. అధిక మార్కులు సాధించిన విద్యార్థులు

సంస్కృతంపై పట్టు సాధించారా అంటే, అదేం కనబడదు! సంస్కృత భాషా బోధనలో, మూల్యాంకనంలో జరుగుతున్న లోపాలను పరిశీలిద్దాం.

**పాఠ్యప్రణాళిక:** పిల్లలకు వారి మాతృభాషలు కాని ఇతర భాషలు నేర్పించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని పాఠ్య ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంటుంది. పాఠ్య ప్రణాళికను శాస్త్రీయ పద్ధతిలో రూపొందించాలి. పిల్లలు ఉండే ప్రాంతం, వారి సంస్కృతి, వయసు, వారి మాతృభాష మొదలగు అంశాలను పరిగణనలోకి తీసుకొని పాఠ్యాంశాలను రూపొందించవలసిన అవసరం ఉంటుంది. కానీ సంస్కృత పాఠ్య ప్రణాళికలు వీటికి భిన్నంగా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. పిల్లలు ఒక భాషను నేర్చుకునేటప్పుడు వారు ఇంట్లోమాట్లాడేభాషా వ్యక్తీకరణలు, స్నేహితులతో, బంధువులతో, ఇతరులతో మాట్లాడే సందర్భాలూ ఇతర భాషలో ఉన్నాయా లేదా అని మొదట చూస్తారు. అవి లేనప్పుడు పిల్లలకు ఆ భాష అన్య భాషగా అనిపిస్తుంది. అదేవిధంగా పిల్లలు పెరిగిన సంస్కృతీ, చుట్టుపక్కల ఉన్న పరిసరాల ప్రభావాలూ ఎంతగానో వారు నేర్చుకునే భాషపై ప్రభావాన్ని చూపిస్తాయి. సంస్కృత భాష పాఠ్యప్రణాళిక పిల్లలు పెరిగే సంస్కృతికీ, దైనందిన జీవితంలో ఉపయోగకరంగా లేనట్లయితే విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనాన్నీ చేకూర్చేదిగా ఉండదు. **విద్యార్థి దశనూ విద్యాస్థాయిని బట్టి కూడా పాఠ్య ప్రణాళికలు శాస్త్రీయంగా రూపొందించాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఇటువంటి శాస్త్రీయత సంస్కృత భాషా పాఠ్యప్రణాళికలో ప్రధాన లోపంగా కనిపిస్తోంది.**

**వ్యాకరణం:** భాషను నేర్చుకోవడం అంటే, ఆ భాషలోని వర్ణాలూ, పద నిర్మాణం, వాక్యనిర్మాణం, అర్థాలూ, సందర్భసహిత వ్యక్తీకరణలు నేర్చుకోవడం. భాషను పదాలు నేర్చుకునే దశ నుండి సందర్భ సహిత వ్యక్తీకరణలు నేర్చుకునే దశ వరకు ప్రతి విషయంలోనూ వ్యాకరణం ఉంటుంది. సహజ వాతావరణంలో పిల్లలు తమ వారసత్వ భాషలు నేర్చుకుంటూ పెరిగే క్రమంలో ఇతర భాషలు నేర్చుకునేటప్పుడు ఆ భాష వర్ణాలు, పదనిర్మాణం, వాక్య నిర్మాణం కొత్తగా అనిపిస్తాయి. తమ మాతృభాషకు భిన్నంగా కనిపించడం, తమ మాతృభాషతో పోల్చుకోవడం సహజమే. **మాతృభాషకూ నేర్చుకునే భాషకూ దగ్గర సంబంధం ఉన్నట్లయితే, ఆ భాషను తొందరగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. సంస్కృత భాష ప్రభావం కొన్ని భారతీయ భాషలపై ఉన్నది వాస్తవమే అయినప్పటికీ, మాతృభాషకూ సంస్కృతానికీ మధ్య గల సారూప్యాలను భేదాలను అధ్యయనం చేసి శాస్త్రీయ పద్ధతిలో వ్యాకరణాన్ని నేర్పించాలి. సంస్కృత భాషలో పద నిర్మాణం తెలుగుభాషా పద నిర్మాణానికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఈ ప్రత్యేకతను బోధించే ప్రక్రియలు ఏమీ చేపట్టకుండా ఇంతకు మునుపు ఎప్పుడూ సంస్కృతం చదవకుండా, ఇంటర్మీడియేటు విద్యాస్థాయిని అనుసరించిన పాఠ్య ప్రణాళిక లేకుండా మాతృభాష తెలుగుతో సంస్కృతాన్ని ఐచ్ఛిక విషయంగా చేయడం సమతౌల్యాన్ని విస్మరించినట్లే.** దీనివలన విద్యార్థులు నూటికి తొంభై నుండి వంద మార్కులైతే సంపాదించుకోగలుగుతారు గానీ ఏ స్థాయిలో ఎంత సంస్కృతం ఒంటబట్టించుకున్నారో గానీ అలా ఒంటబట్టిన సంస్కృతం వారి భవిష్యత్తులో ఎంతవరకూ ఉపయోగపడుతుందో తెలియదు. ప్రభుత్వం దాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయదు.

**సమయం:** ఒక అంశాన్ని నేర్చుకోవడానికి దానికి వెచ్చించే కాలాన్ని బట్టి దాని ఫలితాలను ఆశించవచ్చు. తక్కువ సమయాన్ని వెచ్చించడం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోవడం విశేషమేమీ కాదు. ఈ తీరు పాఠశాలలలోనూ ఇంటర్మీడియేటు విద్యలోనూ సంస్కృత బోధనలో కనిపిస్తోంది. విద్యార్థులు సంస్కృత భాషను ఎంచుకోవడంతోనే ఎక్కువ మార్కులు సాధించగలను అన్న భావన ముందే రావడం, ఉపాధ్యాయులకు అదే ధీమా ప్రదర్శించడం దీనికి కారణమని చెప్పవచ్చు. అసలు పాఠ్యాంశాలే తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులలో ఒక తెలియని నిర్లిప్తత నెలకొంటుంది. తరగతికి కేటాయించిన సమయాన్ని అతి తక్కువగా కుదించిన సందర్భాలే ఎక్కువ. విద్యార్థులు సంస్కృతం నేర్చుకోవడానికి పూర్తి ఆసక్తి చూపరు. ఇంటికి తీసుకెళ్లి అభ్యసించే పని విద్యార్థులకు ఉండదు. సంస్కృతం మాట రూపంగానూ, వ్రాత రూపంగానూ అభ్యసించే సమయం తక్కువ. ఇంటికి వచ్చాక తల్లిదండ్రులతో, స్నేహితులతో, బంధువులతో, పొరుగు వారితో సంస్కృతంలో మాట్లాడే అవకాశమే ఉండదు. కాబట్టి సంస్కృతాన్ని నేర్చుకోవడానికి కేటాయించిన సమయం అతి తక్కువ.

**లిపి:** సాంప్రదాయికంగా సంస్కృతాన్ని ఏ లిపిలోనైనా రాయవచ్చు. అయితే, ప్రస్తుతం సంస్కృతాన్ని దేవనాగరిలిపిలో రాయాలనే నిబంధన ఉంది. కానీ సంస్కృతాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు నేర్పించేటప్పుడు తెలుగులిపిలోనో మరో లిపిలోనో రాయడాన్ని పెద్దగా పట్టించుకోరు. పరీక్షలలో సమాధాన పత్రాల లోనూ దేవనాగరి లిపి నిబంధనను పూర్తిగా అమలుచేయటం లేదు.

**బోధనా పద్ధతి:** భాషను బోధించడానికి అనేక శాస్త్రీయ పద్ధతులు ఉన్నాయి. వ్యాకరణ అనువాద పద్ధతి(గ్రామర్ ట్రాన్స్లేషన్ మెథడ్), వినికిడి-భాషా పద్ధతి(ఆడియో- లింగ్వల్ మెథడ్), ప్రత్యక్ష పద్ధతి (డైరెక్ట్ మెథడ్), పని ఆధారిత అభ్యాసం( టాస్క్ బేస్డ్ లెర్నింగ్), నిశ్శబ్ద పద్ధతి(సైలెంట్ మెథడ్), వ్యవహార భాషా బోధన (కమ్యూనికేటివ్ లాంగ్వేజ్ టీచింగ్) మొదలైన పద్ధతులు ఉన్నాయి. విద్యార్థుల నేపథ్యాన్నీ, సందర్భాన్ని బట్టి ఉపాధ్యాయుడు ఏ పద్ధతిని అవలంబించాలన్న స్వేచ్ఛ ఉపాధ్యాయుడికి ఉంటుంది. విద్యార్థులు భాషలో తాము నేర్చుకున్న అంశాలను తోటి విద్యార్థులతో పంచుకోవడం, వాటిని ఎక్కువగా అభ్యాసం చేయడం వలన విద్యార్థులకు అంశాలు ఎక్కువగా గుర్తుండే అవకాశం ఉంటుంది. భాషలు నేర్చుకోవడానికి పైన పేర్కొన్న పద్ధతులలో వ్యవహార భాషా బోధన(కమ్యూనికేటివ్ లాంగ్వేజ్ టీచింగ్) ముఖ్య భూమిక పోషిస్తుంది. ఈ బోధనా పద్ధతిలో విద్యార్థులు తమ దైనందిన జీవితంలో నిత్యం జరిగే సంభాషణలను ఒకరితో ఒకరు నేర్చుకునే భాషలో సంభాషిస్తారు (రిచర్డ్స్, రోడ్జర్స్, 2001). ఈ పద్ధతిలో విద్యార్థులు సంభాషణలతో తరగతి గదిలో భాషను నేర్చుకున్నట్లయితే వారు నేర్చుకున్న అంశాలు ఎక్కువగా గుర్తుండే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఈ పద్ధతిలో కొన్ని తప్పులు చేసేటప్పుడు ఉపాధ్యాయుడు తప్పులన్నీ గమనించి, వారి సంభాషణ పూర్తయ్యాక ఒక్కొక్కరినీ సరిచేస్తాడు. ఈ ప్రక్రియలో విద్యార్థులు భాషను ధైర్యంగా సందర్భోచితంగా మాట్లాడే అవకాశం కలుగుతుంది. ఇటువంటి శాస్త్రీయ పద్ధతి సంస్కృత బోధనలో లోపించడం వలన విద్యార్థులకు సంస్కృతం మాట్లాడడానికి

ఆత్మనూన్యత భావాన్ని పెంపొందిస్తుంది. నేటి ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఉపయోగించుకొని పాఠ్యాంశాలను విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించే విధంగా రూపొందించవచ్చు. సంస్కృత విద్య బోధనలో ఇవి ఏవీ తారసపడవు.

**మూల్యాంకన ప్రక్రియ:** సంస్కృత బోధనా పద్ధతిలో అందరిని ఆశ్చర్య గొలిపే అంశం మూల్యాంకనం. ఒక అంశానికి వంద మార్కులు ఉంటే వంద మార్కులు సాధించే ఏకైక అంశం సంస్కృతం. గణితశాస్త్రంలో ఇవ్వబడిన సమస్యలకు సరైన పరిష్కారాన్ని దశలవారీగా చూపించడం వలన పూర్తి మార్కులు ఎలా సాధిస్తాం. అయితే, సంస్కృతం పరీక్షల మూల్యాంకనాన్ని ఇతర విషయాలతో పోల్చినపుడు ఆయా విషయాలలో చూపెట్టిన శ్రద్ధాసక్తులూ, వెచ్చించిన సమయమూ వచ్చిన మార్కులకూ ఎలాంటి పొంతనా లేకపోవటం కనిపిస్తుంది. దీన్ని ఏ ఇంటర్మీడియేటు విద్యార్థిని అడిగినా తెలుస్తుంది. ఉదాహరణకు రెండు రెళ్ళు నాలుగు అన్నట్లు సంస్కృతం పరీక్ష ఉంటుంది. దీనికి ఉపాధ్యాయులకు పరీక్షా పత్రాన్ని రూపొందించడం చేతకాక కాదు, కేవలం విద్యార్థులకు పూర్తి మార్కులను సులభంగా అందించాలనే క్రమంలో ఈ పద్ధతిని అవలంబిస్తూ వస్తున్నారు. తెలుగు పరీక్షను రాసే విద్యార్థులకు ప్రశ్నపత్రం చాలా రకాల ప్రశ్నలతో సుమారు రెండువందలకు పైగా పంక్తులను సమాధానాల రూపంలో రాయాల్సి ఉంటుంది. ఇది విద్యార్థుల భాషాప్రతిభను పరీక్షించేదిగా ఉంటుంది, కానీ **సంస్కృత పరీక్ష విద్యార్థుల ప్రతిభను పరీక్షించేవిగా ఉండవు. కేవలం సంస్కృత భాష అస్తిత్వాన్ని నిలుపుకోవడానికీ విద్యార్థులను మార్కుల పేరిట ఆకర్షించడానికీ మాత్రమే ఉపయోగపడుతోంది.** సంస్కృత ఉపాధ్యాయులు, పరీక్ష పత్రాలను రూపొందించడంలోనూ, మూల్యాంకనంలో అవలంబించే పద్ధతి పూర్తిగా అశాస్త్రీయమూ అన్యాయమూ. విద్యార్థుల ప్రతిభను కొలిచే విధంగా ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తే విద్యార్థులు భాషను బాగా నేర్చుకుని పరీక్షల్లో తమ ప్రతిభను కనపరుస్తారు. ఒక పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చినా మరొక పరీక్షల్లో ఎక్కువగా మార్కులు రావడానికి బాగా అభ్యాసం చేసి, భాషను బాగా నేర్చుకుంటారు. కానీ ముందే అధిక మార్కుల వాగ్దానం ఉండటం వలన భాషాభ్యాసంపై శ్రద్ధ తగ్గుతుంది. మూల్యాంకన పద్ధతి కూడా సంస్కృత భాషను నేర్పించడంలో పెద్ద లోపం.

**ప్రయోజనం ఏమిటి?** మనం చేతిలో పట్టుకున్న ఒక పనిముట్టు ఎక్కడా మన పనిలో ఉపయోగపడకపోతే అది మన చేతిలో ఉండీ వ్యర్థమే. ఆ పనిముట్టుని మోసిన కాలం, శక్తీ వ్యర్థం. మనం నేర్చుకునే భాష కూడా ఎక్కడా ఉపయోగపడకపోతే, దాన్ని నేర్చుకున్న సమయమూ శక్తీ వ్యర్థమే. సంస్కృత భాష ఉపయోగాల గురించి తెలుసుకునే ముందు, సంస్కృత బోధన ఉద్దేశాన్ని మరోసారి జ్ఞప్తి చేసుకోవడం ముఖ్యం. సంస్కృతం నేర్చుకోవడం వలన వేదగణితం, ఆయుర్వేదం, వనస్పతుల విజ్ఞానం, ఖగోళశాస్త్రం మొదలైన అన్ని శాస్త్రాలలో గుప్తమైయున్న జ్ఞానాన్ని పొంది దేశాభివృద్ధి చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. సదుద్దేశమే. కానీ ఇంటర్మీడియేట్లో నేర్చిన అరకొర సంస్కృతంతో విద్యార్థులకు ఇవేవన్నా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఊహామాత్రంగానైనా అనుకోవచ్చా? సంస్కృతం నేర్చుకుని సాహిత్యాధ్యయనం చేసి విద్యార్థులు వికాసం పొందేందుకు అవసరం అనుకొంటే సంస్కృతంలో ఉన్న సాహిత్యంలో చాలావరకు ఇప్పటికే తెలుగులో అందుబాటులో ఉందే. అంటే ఇప్పటికిప్పుడు ఇంటర్మీడియేట్లో నేర్చుకొంటున్న అరకొర సంస్కృతంతో కాలయాపన, ప్రయాస తప్ప ఒనగూడేది ఏమిటో తెలుసుకొనేందుకు తెలుగు రాష్ట్రాల ఇంటర్మీడియేట్ బోర్డు ప్రయత్నించినట్లు లేదు.

**నష్టాలు:** ఉపయోగపడని పనిముట్టును చేతిలో ఉంచుకోవడం ఎంత వ్యర్థమో, అవసరాన్ని తీర్చే పనిముట్లను ఎంచుకుని ఆ పనిముట్లని వాడడం చాలా ఉపయోగం. సరైన పనిముట్టును వాడిన సమయమూ, అందుకోసం వెచ్చించిన శక్తీ మంచి ఫలితాలను ఇస్తుంది. అలాగే భాష కూడా మనిషికి అత్యవసరమైన పనిముట్టు. మనిషి ఆదాయ సృజనకు, వికాసానికి, సమాజంలో ప్రజలతో కలిసి ఉండడానికి భాష ఉపకరణంగా పనిచేస్తుంది. పాఠశాలలోనూ ఉన్నత విద్యలోనూ మాతృభాష నేర్చుకోవడం వలన దాంట్లో ఉండే వికాసాన్నీ, విషయ అవగాహననూ విద్యార్థులు పెంపొందించుకుంటారు. మాతృభాషను బోధించే ఉపాధ్యాయులకు దానివలన ఉపాధి కల్పన ఉంటుంది. కానీ ఇంటర్మీడియేట్ విద్యలో తెలుగుతో సంస్కృతాన్ని ఐచ్ఛికం చేయడం వలన విద్యార్థులకూ అధ్యాపకులకూ నష్టమే. **పాలకులు రాజకీయ అవసరాల కోసం సంస్కృతాన్ని తెలుగుతోపాటు ఐచ్ఛిక విషయంగా నిర్ణయించి ప్రభుత్వ ఆజ్ఞలు జారీ చేయడం తెలుగు భాషకు నష్టం. తెలుగు సమాజానికి చేటు. తెలుగును ప్రత్యేక అంశంగా ఎన్నుకొని ఉద్యోగాలు సాధించే అనేక మంది తెలుగు వాళ్లకు ఇది తీరని నష్టాన్ని చేకూరుస్తుంది.** నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక అవసరాలను తీర్చకపోగా విద్యార్థి లోకాన్ని ఒక సంక్షోభంలోకి నెట్టివేస్తుంది.

**ముగింపు: సంస్కృత భాషను రెండు రాష్ట్రాల్లోని 10 కోట్ల మంది తెలుగు వాళ్లపై బలవంతంగా రుద్దడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల భాషలే అన్ని రంగాలలో ఉండాలి. సమాజంలో అన్ని భాషలూ సమానమే. ఒక దేశంలో లేదా ఒక ప్రాంతంలో ఏ భాషలో అయితే ప్రజలు అనుబంధాలను పంచుకుంటారో ఆ భాష ఆ సమాజానికి ఆరోగ్యకరం. నేడు అంతర్జాల యుగంలోనూ స్థానిక భాషల వాడుకదే పైచేయి. ఈ సత్యాలని విస్మరించి విద్యా మాధ్యమంగా తెలుగు స్థానంలో ఇంగ్లీషునూ, ఇంటర్మీడియేట్ విద్యలో తెలుగు స్థానంలో సంస్కృతాన్ని అందించే పద్ధతులను చేపట్టడం అశాస్త్రీయం. అసలే ఆంగ్ల మాధ్యమంతో తెలుగుకు పట్టించిన గ్రహణం విడవకమునుపే ఇంటర్మీడియేట్ విద్యలో తెలుగు స్థానంలో సంస్కృత బోధన విద్యార్థులలో తెలుగు కౌశలాలను ఇంకా కుదించివేస్తుంది. జ్ఞాన వికాసం కుంచించుకుపోతుంది. గత రెండువేల యేండ్ల పైచిలుకు భారతీయ భాషా సామాజిక చరిత్ర నుంచి మన పాలకులు నేర్చుకున్న పాఠాలు తక్కువే. విద్యావ్యవస్థల్లో మాతృభాషాధారిత విద్య ఆయా సమాజాలకు జ్ఞాన కేంద్రంగా నిలుస్తుంది. ఆధునిక అవసరాలకు ఆధునిక భాషలనే వాడాలి. తెలుగు రాష్ట్రాలలోని పాలకులు తెలుగు భాషకు ప్రధాన స్థానాన్ని కల్పించి ఉన్నత విద్యలోనూ, పాలనా వ్యావహారాలలోనూ అభివృద్ధి దశకు దిశానిర్దేశం చేయాలి.**

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

శ్రీగణేష్ తొట్టెంపూడి

# జర్మన్ల భాషావేశం - 2

**ఒక జాతి భాషావికాసం–ఆ జాతి కొలబద్ద**

**ఒక** జాతి సార్వభౌమత్వం, ఆ జాతి అస్తిత్వం, ఒక జాతి వికాసం, ఆ జాతి భాషమీదే ఆధారపడి ఉంటుంది. వైజ్ఞానికత ఒక జాతి భాషలో ఎంత విస్తృతంగా అందుబాటులో ఉంటుందో అంతగా ఆ జాతి పురోభివృద్ధి చెందుతుంది అని చెప్పవచ్చు. అభివృద్ధిలేని భాషలు అంతరిస్తాయి. భాష అంతరించింది అంటే ఆ జాతి సంస్కృతి, సమాజం అంతరిస్తున్నట్లే. అంటే ఒక జాతి వికాసాన్ని కొలవటానికి ఆ జాతి భాషా వికాసం ఒక కొలబద్ద అని చెప్పవచ్చు.

ఆగస్టు 29న మనం గిడుగు రామ్మూర్తిగారి జయంతిని తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకుంటున్నాం. తెలుగు భాషను మన భాషనీ, మన విద్యావిధానాన్నీ, మన సిద్ధాంతాలనూ ఎప్పటికప్పుడు పునఃనిర్మించుకుంటూ ఉండాలి. సామాజిక అవసరాలను తీర్చేభాష ఎప్పటికీ ఆ సమాజ వికాసంలో ప్రధానపాత్ర పోషిస్తూనేవుంటుంది.

ఈ వ్యాసంలోనూ తదుపరి వ్యాసాల్లోనూ జర్మన్ల భాషావేశం ఆ దేశ అభివృద్ధిలో ఎలాంటి పాత్రను పోషించిందో క్లుప్తంగా వివరించటానికి ప్రయత్నిస్తాను.

**అమ్మనుడిలో సాంకేతిక విద్య సాహసోపేత నిర్ణయం**

**ఈ మధ్య మన కేంద్ర ప్రభుత్వం స్థానిక భాషల్లో ఇంజనీరింగ్ విద్య అని కొత్త సాహసోపేత సాంకేతిక విద్యావిధానాన్ని**




పండితమ్మన్యుల గ్రాంథిక వాదం నుండి వాడుక భాషా వ్యవహారానికి మళ్లించి, సామాన్యుడికి చేరువ చేసి, అతని సామాజిక, సాహిత్య అవసరాలని తీర్చేదిగా పోరాడి సాధించినవారు గిడుగు రామ్మూర్తిపంతులు గారు. ఆధునిక సామాజిక అవసరాలను గుర్తించి వాడుక భాషోద్యమానికి నడుంకట్టాల్సిన సమయం అది. ఒకవేళ గిడుగువారి వ్యావహారిక వాదంలేదు అనుకోండి, ప్రస్తుతం తెలుగు ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించండి. సామాజిక అవసరాలకు మనం **తీసుకొచ్చింది. ఇది చాలా అభినందనీయం.** వ్యక్తిగతంగా దీన్ని పూర్తిగా సమర్థిస్తాను. అయితే, కొందరు దీన్ని యుద్ధభూమిలోకి ఆయుధాలు లేకుండా వెళ్ళటం ఎలాంటిదో స్థానిక భాషల్లోకి సాంకేతికతను తీసుకురావటానికి చట్టాలను చేసి తగిన పాఠ్యపుస్తకాలు ముందుగా సిద్ధం చేసుకోకుండా చేయటంలాంటిదని అది సమర్థనీయం కాదు అనీ వ్యాఖ్యానించవచ్చు. కాని అన్నీ సిద్ధమైతేనే మొదలు పెట్టాలనుకుంటే– ఎప్పటికీ కాకపోవచ్చు. ఇప్పుడు ఈ

అవసరం కోసమైనా వీటిని సిద్ధం చేయవలసివస్తుంది. ఈ ప్రక్రియలో ప్రతి విద్యావేత్తా తెలుగు భాషాభిమానీ వారి వంతు కృషి చేయవలసి ఉంటుంది.

జర్మన్ల విద్యావిధానంలో స్థూలంగా 4 మెట్లు ఉంటాయి. విద్యార్థి విశ్వవిద్యాలయంలో ప్రవేశించేవరకు ఆంగ్లం ఒక ఐచ్ఛిక విషయంగానే బోధిస్తారు తప్ప మన తెలుగు రాష్ట్రాల అడ్డగోలు వ్యవహారంలోలాగా ఆంగ్ల మాధ్యమం ఉండదు. అంటే విద్యార్థి 17 లేదా 18 సంవత్సరాలు వచ్చేదాకా జర్మను మాధ్యమంలో చదవాల్సిందే. దానితోపాటు ఫ్రెంచి, స్పానిషు, ఆంగ్లం మొదలైన ఐరోపీయ భాషలను ఐచ్ఛికంగా నేర్చుకోవచ్చు. ఇంగ్లీషు మాధ్యమం చాలాఖర్చుతో కూడుకున్నది. ఇక్కడ విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. వైద్యరంగంలో పిఎచ్.డి. కూడా విద్యార్థి చేయదలిస్తే స్థానికభాషలో చేయొచ్చు.

ఈమధ్య ఎక్కడో ఒక పరిశోధనాపత్రంలో ప్రపంచంలోనే ఉత్తమ విద్యావిధానం ఫిన్లాండ్‌లో ఉందనీ, అక్కడ ప్రాథమిక విద్యాస్థాయికి వచ్చేవరకూ పిల్లలకు పుస్తకాలే అంతగా ఉండవనీ చదివాను. అదేవిధంగా జర్మనీలో కూడా చాలావరకు ప్రాథమిక స్థాయిలో పుస్తకాల మోత ఉండదు. స్థానిక ఆటలూ, పాటలూ, సంస్కృతీ, ఆహార వ్యవహారాల మీద ఎక్కువ అధ్యయనం ఉంటుంది. ఇక్కడి విద్యావిధానంలో మాతృభాష ప్రాధాన్యతను తదుపరి భాగాల్లో వివరంగా గణాంకాలతో వివరిస్తాను.

**మాతృభాషలో చదువు - విద్యార్థి హక్కు**

జర్మన్ల భాషావేశానికి 19-20 శతాబ్ది ప్రపంచ యుద్ధాలే పునాదివేశాయి. తమ అస్తిత్వాన్ని నిలుపుకోటానికీ, ప్రపంచవ్యాప్తంగా తమ ముద్ర వేయటానికీ కార్ల్ ఫ్రెహెర్, కార్ల్ ఆగుస్ట్ (1750-1822) పుర్సియా కొన్ని సంస్కరణలను ప్రతిపాదించారు. ఇవి కొంతవరకు మన ప్రాచీన విద్యావిధానాలను పోలి ఉన్నట్లు అనిపిస్తాయి. ఈ సంస్కరణలు తర్వాత 20వ శతాబ్ది విద్యావిషయక అవసరాలను తీర్చలేకపోతున్నాయని గ్రహించి జర్మన్ల విశ్వవిద్యాలయ విద్య మూలపురుషుడిగా చెప్పుకునే విల్హెం ఫాన్ హుంబోల్ట్ (1767- 1835) కొత్త విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టి, మాతృభాషలో విద్యార్థి ఎంతవరకు చదువుకోవాలన్నా అంతవరకు చదువుకోవచ్చు అని చెప్పి అది విద్యార్థి హక్కుగా ప్రతిపాదించారు. ఇప్పటికీ వీరి విద్యావ్యవస్థకి పునాది ఇతని ప్రతిపాదనలే. విద్యార్జనకు మాతృభాషే మూలాధారం అనే సైద్ధాంతిక విధానం స్థానికంగా ఎలాంటి ప్రభావాన్ని చూపాయో తెలుసుకోటానికి హొమ్మరో చూపిన ఈ కింది గణాంకాలే తార్కాణం. 85% జర్మను ప్రజలు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్థానిక విద్యాలయాల్లో చదువుకోటానికే ఆసక్తి చూపటం, 12% మంది ప్రైవేటు విద్యావ్యవస్థకి మద్దతు ఇవ్వటం, మిగిలిన 3% ఉమ్మడి ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్న విద్యాలయాలలో చదవడాన్ని కోరుకున్నవారు. వీరు ప్రైవేటు విద్యాసంస్థలకి మద్దతు ఇచ్చింది అక్కడ ఉండే వనరులూ, ద్విభాషాధారిత విద్యావిధానమూను. గమనించదగ్గ విషయం ఏమంటే, ఇక్కడ బోధన పూర్తిగా ఆంగ్లమాధ్యమం కాదు, మిశ్రమాధ్యమం.

ఎందుకు స్థానికులకి (జర్మన్లకు) వారి ప్రభుత్వ విద్యావ్యవస్థలమీద అంతనమ్మకం? వారి మాతృభాషలో జర్మన్లు సాంకేతికతను ఎలా సాధ్యం చేసుకుంటున్నారు? ఆధునికతను వీరు వీరి అమ్మనుడిలో ఎలా అందుకొంటున్నారు? మరిన్ని విషయాలను తదుపరి వ్యాసాల్లో ప్రస్తావిస్తాను. మరొక్కసారి గిడుగువారి స్ఫూర్తితో ప్రతి తెలుగువాడు అమ్మనుడిని ఆధునిక అవసరాలకు సిద్ధం చేసుకునే మహాయజ్ఞంలో త్రికరణ శుద్ధిగా భాగస్వాములు కావాలని కోరుకుందాం.

**తొట్టెంపూడి శ్రీగణేశ్,**
హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయం, జర్మనీ

**కవిత**

# అక్షర సంధ్య

కష్ట కాలంలో
ఆహ్లాదాన్ని పంచే
ఏకైక మైత్రీ పుష్పం కవిత్వమే.

నిరుడు కురిసిన వాన
ఇవాళటి దాకా కొన సాగుతుంది.
ఉపద్రవానికి
కాలువలు తీసేది కవిత్వమే.

సందేహం లేదు
మాటలు
నిశ్శబ్దంలోంచే పుడతాయి.
మనిషి కన్న
కాలమే బాగా మాట్లాడుతుంది.
దానికి వ్యాఖ్యానం చెప్పేది కవిత్వమే.

అది
తటపటాయింపుల సంధ్య
తీర్పులు చెప్పే న్యాయమూర్తిలా
అటో ఇటో తేల్చేది కవిత్వమే.

అంతకు ముందు ఆ దారిలో
మృత్యువు పయనించింది.
ప్రాణాన్ని గురించి దుఃఖిస్తూ
కవిత్వం తల పట్టుకొని కూర్చుంది.
ఎప్పటికైనా ఆత్మను
కవిత్వీకరించాలని దాని ఆశ.
ఎక్కడి నుంచో ఓ పాట వినిపిస్తుంది
దానికి కట్టు కట్టేది కవిత్వమే.

కవిత్వానికి
కాగితమే ఒక సామ్రాజ్యం
దాని విస్తీర్ణం
సామాన్యమైంది కాదు
క్షణ క్షణ వికీర్ణం.

కవిత్వ మొక
స్వప్నాల రిజర్వాయరు
ఇన్‌ఫ్లో ఔట్‌ఫ్లోలను బట్టి
ఏ నిర్ణయమూ కుదరదు.
అంత వరకు
జలార్ణవమే
ఒక ప్రాకృతిక కలవరం.

మిత్రమా!
కవిత్వం ముందు
ఏదీ విలువైంది కాదు
వజ్రం కూడా బొగ్గే.
కాని
దాని కాంతి మాత్రం
మనస్సులో ముద్రించుక పోతుంది.
కవిత్వ మంటే అదే!

డా. ఎన్. గోపి
93910 28496

బోధన

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# ప్రశ్న

ప్రశ్ననుండే మనిషి సమస్త విజ్ఞానమూ సమకూర్చుకొన్నాడు. ఆ విజ్ఞానం ప్రశ్నతోనే మరింత విస్తరిస్తూ ఉంది.

ప్రశ్న, ప్రశ్న మీద ప్రశ్న. ఎందుకు? ఎలా? ఏమిటి? అంటూ మనుషుల మెదళ్లను వేడెక్కించే ఈ ప్రశ్న మనిషికి ఒక దాహంలాంటిది. ప్రశ్న ప్రతిదాన్ని తెలుసుకోవాలనే కుతూహలంతో మనిషిని పరుగులు పెట్టిస్తూనే ఉంటుంది. ప్రశ్న మనిషిని నిరంతర అన్వేషికుడిగా, అనంత ప్రయాణికుడిగా మార్చింది.

ప్రశ్న పాలను చిలికి వెన్నను తీసే కవ్వంలాంటిది. చర్చలకు తర్కానికి మూలం ప్రశ్నే.

సమాధానంకంటే ప్రశ్న గొప్పది. శక్తిమంతమైనది. ప్రశ్న తల్లిలాంటిదైతే- సమాధానం బిడ్డలాంటిది. సమాధానం ఎప్పుడూ సందేహాస్పదంగానూ అసంపూర్ణమైనదిగాను ఉంటుంది.

ప్రశ్నించాలంటే తెలుసుకోవాలనే కుతూహలం ఉండాలి. బోధనలో ఉండే రహస్యం విద్యార్థుల్లో ఈ కుతూహలం రేకెత్తించడమే. పిల్లల్ని మనం ప్రశ్నించినా, వారికి ఏదైనా విషయం చెప్పినా, ఆ పిల్లలు మనల్ని మరిన్ని ప్రశ్నలు అడిగేటట్లు ఉండాలి.

పిల్లలకు నేర్పాల్సింది జవాబులు కాదు. ముందు ప్రశ్నించడం నేర్పాలి. జవాబులు వాళ్లే కనుక్కొంటారు. ప్రశ్నించేవాళ్లు తప్పక తెలుసుకొంటారు.

ఎక్కడ ప్రశ్నించే పిల్లలూ, చదువుకొనే ఉపాధ్యాయులూ ఉంటారో- అక్కడ విజ్ఞానం వికసిస్తుంది.

ఎంత ఎక్కువగా భాషమీద పట్టు ఉంటే- అంత ఎక్కువగా ఆలోచనలు, ప్రశ్నలు, చర్చలు ఉంటాయి.

**ప్రశ్న: తరగతి గదిలో పిల్లలు చెప్పింది సరిగా వినరు. విన్నా పట్టించుకోరు. గోలచేస్తూ ఉంటారు. ఎందుకని?**

ఇది టీచర్ల సమస్య మాత్రమేగాదు. తల్లిదండ్రుల సమస్య కూడా. ఇష్టమో అవసరమో ఉంటే తప్ప, ఎవరి మాటా ఎవరూ వినరు.

ఎదుటి వాళ్ళు చెప్పింది ఓర్పుతో వినడం, అర్థం చేసుకోవడం, తర్కబద్ధంగా ఆలోచించడం, తిరిగి ప్రశ్నించడం, చర్చించడం చివరకు సత్యాన్ని అంగీకరించడం - ఇదంతా జ్ఞానాన్ని సంపాదించడానికి మనుషులు చేసే ఒక ప్రయత్నం - ఒక పద్ధతి.

ఇక్కడ తిరిగి ప్రశ్నించడం, చర్చించడం అనేది లేదు గనుక వినడం అనేది జరగదు. ఒక్క మాటలో చెప్పాలంటే మనం చెబుతున్నాం గాబట్టే వాళ్లు వినరు. సమయం, సందర్భం, చెప్పే విధానం, చెప్పే విషయం, వినేవారి వయస్సు, వారి అభిరుచి ఇవన్నీ పనిచేస్తాయి. వినాలంటే- పాఠం వినే విద్యార్థి అయినా, పవిత్ర బోధనలు వినే పరమ భక్తుడైనా ఒక్కటే. భక్తి శ్రద్ధలు ఉన్నంత మాత్రాన వినడం సాధ్యం కాదు. వింటున్నట్లు నటించవచ్చు.

వినడం విద్యార్థుల అవసరంగదా! వారిమేలు కోరే కదా చెబుతున్నాం. వారు స్కూల్‌కు వచ్చేది టీచర్లు చెప్పింది శ్రద్ధగా విని నేర్చుకోడానికి గదా అనే సందేహాలు మనకు రావచ్చు.

కాని వినడం అనేది శ్రోత చేతిలో మాత్రమే ఉండదు. అది బోధకుడి పైన ఎక్కువ ఆధారపడి ఉంటుంది. మంచి విషయాలు వినాలని ఒక సభకు వెళతాం, ఇష్టం లేకపోతే మాట్లాడుతూనో, తూగుతూనో ఉంటాం; ఒక మంచి పుస్తకం తెరుస్తాం. ఒకటి రెండు పేజీలు చూడగానే కండ్లు మూతలు పడతాయి. ఎందుకని? మెదడు అలసిపోయి ఉండవచ్చు. విషయం గందరగోళంగా ఉండవచ్చు. ఇంకా అనేక కారణాలు ఉండవచ్చు. పిల్లలు స్కూలు చదువుకోడానికే వస్తారు. పాఠం వినాలనే అనుకుంటారు. వినడం వినకపోవడం వారి చేతుల్లో ఉండదు. ఎందుకంటే సహజంగా నేర్చుకొనే పద్ధతులు వేరే ఉన్నాయి. కాలాన్ని పీరియడ్లగా విభజించి, విషయాన్ని గూడా అనేక అంశాలుగా ముక్కలు చేసి, ఈ సమయంలో ఖచ్చితంగా ఇది నేర్చుకోవాల్సిందేనంటూ నిర్బంధించి నేర్పడం, మనిషి నేర్చుకొనే పద్ధతికి పూర్తిగా విరుద్ధం.

భయపెట్టి, నిర్బంధించి ప్రశాంతమైన వాతావరణం సృష్టించి వినేటట్లు చేయవచ్చు. అది పైకి కనిపించే దృశ్యం మాత్రమే. వినేవారి మెదళ్ల లోపల మరింత వ్యతిరేకత, మరింత ఆందోళన పెరుగుతూనే ఉంటుంది. తప్పించుకోడానికి వారి ముందు చాలా మార్గాలుంటాయి. బయటికి వెళ్ళిపోవడం, పక్కవారితో మాట్లాడడం ఇవి రెండూ వీలుగాకపోతే వింటున్నట్లు, నటించడం. ఈ నటించడం కూడా సాధ్యం కానప్పుడు నిద్రలోకి వెళ్ళిపోతారు.

కాబట్టి కేవలం పాఠాలు వినిపించి నేర్పించాలనుకోవడం శాస్త్రీయం కాదు. పిల్లలు ఎవరికి వారు స్వయంగా నేర్చుకోడానికి (సెల్ఫ్ లెర్నింగ్) ప్రయత్నిస్తూ ఉంటారు. తప్పులు చేస్తూ సరిచేసుకొంటూ నేర్చుకుంటారు. టీచర్ దీనికి సహకరించాలి. విషయంపై ఆసక్తిని రేకెత్తించడానికీ, కార్యోన్ముఖులను చేయడానికి, మన మాటలు ఉపయోగపడాలి. నేర్చుకోవడం ఎలాగో నేర్పాలి. మనం కూడా పిల్లలు క్రియాత్మకంగా నేర్చుకునే పరిస్థితులు సృష్టించలేక చెప్పడానికి అలవాటుపడిపోయాం. మనం ఎంతో బాధ్యతతో దీక్షతో అద్భుతంగా బోధిస్తూ ఉండవచ్చు. కాని అది ఫలితాన్ని ఇవ్వదు.

బోధన గురించి ప్రముఖ విద్యావేత్త జాన్ హోల్ట్ ఏమన్నాడో తెలుసుకుందాం "పిల్లలు పనిలో నిమగ్నం గాకుండా కేవలం

మౌనంగా వినేవాళ్లుగా మాత్రమే ఉండి ఉపాధ్యాయుడు బోధిస్తూ ఉంటే – ఇక చేయ గలిగిందేమీ లేదు. తరగతి గదిలో ఉన్న ఉపాధ్యాయుడు, చేతిలో దీపం పట్టుకొని, అంధకారపు అడవిలో తిరుగు తున్న వ్యక్తిలాంటివాడు. ఆ దీపపు కాంతి ఎవరి మీదకి ప్రసరిస్తుందో వారు మాత్రమే మేల్కొని ఉంటారు. ఆ కాంతి ప్రక్కకు మరలగానే వారు పగటి కలల్లోకి వెళ్ళిపోతారు. ఉపాధ్యాయుడు కాంతిని ప్రసరించిన చోట తప్ప మిగతా కారడవిలో చీకటి జీవితం గురించి అతనికి పెద్దగా తెలియదు" ఉపాధ్యాయుని దృష్టి తమ మీద ఉన్నంత వరకు ఒక రకంగానూ, ఆ దృష్టి తమ మీద లేనప్పుడు మరో రకంగాను విద్యార్థుల ప్రవర్తన ఉంటుంది. ఇది ప్రతి ఉపాధ్యాయుడికి తెలుసు.

"ఒక పిల్లవాడు బ్లాక్ బోర్డుకేసి చూసి ఎక్కువ నేర్చుకుంటాడో, కిటికీలోనుంచి వెలుపలి ప్రపంచాన్ని చూసి ఎక్కువ నేర్చుకుంటాడో, చెప్పలేము".

"పిల్లలు తమ తమ జట్టు పిల్లలతో కలిసి బయట ప్రపంచంలో సహజంగానే నేర్చుకొంటూ ఉంటారు. టీచర్లు పిల్లల్ని పార్కుల్లోకి, పచ్చికబయళ్ల మీదికీ, అడవుల్లోకి నదీ తీరాలకు తీసుకొని వెళ్ళి ఆడుకొంటూ, పాడుకొంటూ పాఠాలు ఎందుకు చెప్పరూ? ఎందుకంటే క్లాసు రూమ్‌లో బోధన సులభంగాబట్టి" అంటారు ప్రముఖ రష్యన్ విద్యావేత్త సుహూమ్లిన్ స్కీ.

పిల్లలు సహజంగా ఎలా నేర్చుకొంటారో అలాంటి పరిస్థితులు కల్పించడం చాలా కష్టంగాబట్టి, వాటిని పక్కనబెట్టి, చాలా సులువైన బోధనాపద్ధతిని కొనసాగిస్తున్నాం.

పిల్లలు కూడా తాము నేర్చుకొనే సహజమైన పద్ధతిని వదిలి, విని నేర్చుకోవడం చేతగాక నటిస్తూ కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటారు. మరి వాళ్ళకు అంతకంటే మార్గం లేదు.

**గోల చేయడం**

సహజంగా పిల్లలు అంతర్ముఖులు. వారు ప్రపంచంతో ప్రతిక్షణం అనుబంధం(కనెక్ట్)కలిగి ఉంటారు. ప్రతిదాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. అందుకే వాళ్లు ఒంటరిగా ఆలోచిస్తూ ఆడుకుంటూ ఉంటారు. ముఖ్యంగా ఏడు సంవత్సరాలలోపు పిల్లలు ప్రతి క్షణం స్పందిస్తూ ఉంటారు. అందుకే మనం చెప్పేది వారు ఆలకించరు. వారు మాట్లాడుతూ ఉంటారు – ఎందుకంటే వారి లోపల ఏవో మాటలు వారికి వినిపిస్తూ ఉంటాయి. అవి నిన్నటి జ్ఞాపకాలు కావచ్చు. దానికి స్పందనగా వాళ్ళు ఏవో ఒకదానికొకటి పొంతనలేకుండా కూడా మాట్లాడుతూ ఉంటారు.

మనంగాదు మాట్లాడాల్సింది పిల్లలు. వాళ్ళు మాట్లాడుతూ ఉంటే మనం వినాలి. కొన్నిసార్లు అందరూ ఒక్కసారిగా అరుస్తారు. ఒంటరి తనం నుండి బయట పడడానికి అలా అరుస్తారు. నిశ్శబ్దం నుండి శబ్దాన్ని పుట్టించడం వారికి వినోదంగాను రిలీఫ్ గాను ఉంటుంది. పెద్ద భారం తొలగినట్లు ఫీలవుతారు. చిన్న పిల్లలు అప్పుడప్పుడు పెద్దగా అరవడానికి అవకాశం కల్గించాలి. అలాగే మాటలు నేర్చుకుంటున్న 2 సంవత్సరాలలోపు పిల్లలు గొంతుతోను, నాలుకతోను, పెదాలతోను, శబ్దాలు సృష్టించి ఆనందిస్తూ ఉంటారు.

యుక్తవయస్సు వచ్చిన పిల్లలు తమ నిరసనను తెలియజేయడానికి, ఆనందాన్ని, ఐక్యతను చాటడానికి కూడా పెద్దగా అరుస్తారు.

పెద్దలంటే ఉన్న భయాన్నుండి విముక్తి కావడానికి తమ స్వరాలు పెంచి ఒకే కంఠంగా అరుస్తారు. ఇది స్వేచ్ఛకు సంకేతం. ఏ గోల ఎందుకో అర్థం చేసుకొని జాగ్రత్తపడాల్సింది పెద్దవాళ్లు.

"వారి గొంతులు బిగ్గరగా అరవాలని, వారి కాళ్ళు లేచి పరుగెత్తాలని, వారి కళ్లు బయట ప్రపంచాన్ని చూడాలని, వారి చేతులు ఏదో చేయాలని ఏ ఆదృశ్య శక్తో బలవంతం చేస్తూ ఉంటే – తరగతి గదిలో ఆ నాలుగు గోడల మధ్య ఎవరి మాట ఎవరింటారు?




అందుకే టీచరు పాఠాలు చెప్పడంకంటే పిల్లల్ని నిశ్శబ్దంగా వుంచడానికి, క్లాస్ రూమ్ నిర్వహణకూ – ఎక్కువ సమయాన్ని శక్తిని ఉపయోగిస్తుంటాడు.

తరగతి గదిని సమర్ధవంతంగా నిర్వహించలేకపోవడం టీచర్ వైఫల్యంగాదు. అలాగే తరగతి గదిలో అరవకుండా నోరుమూసుకొని ఉండలేకపోవడం పిల్లల క్రమశిక్షణా రాహిత్యం కాదు. అది మనం ఎన్నుకొన్న బోధనా పద్ధతి యొక్క వైఫల్యం.

('ఐక్య ఉపాధ్యాయ' అక్టోబరు 2015 సంచిక సౌజన్యంతో)

హంసావత్ నాగేంద్ర

# మనిషి ముందుకు - భాష, సంస్కృతి వెనక్కి

ప్రతి రోజూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవాలి, సరికొత్త పనులు చేయాలి అని ఆలోచిస్తూ ఉంటాను. కాని ఆచరణలో అది నాకు సాధ్యపడేది కాదు. రోజూ నా రాక కోసం ఎదురుచూస్తూ బయటి ప్రపంచం తిరిగి ఎంతో తెలుసుకోవాలని తపించేవాడు ఆరేండ్ల నా మేనల్లుడు జగరాం నాయక్(చిన్ను). అతను ఎవరు, ఇది ఏంటి, దీన్నేలా తయారు చేస్తారు, గాలి ఎందుకు కనిపించదు, నీరు ఎందుకు త్రాగాలి, నేనింకా ఎన్ని రోజులకు పెద్దవాడినవుతాను, నాకు లంబాడీ భాషలో మాట్లాడడం ఎప్పుడు వస్తుంది అని ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి ప్రతి జవాబును మరలా ప్రశ్నగా మలిచి నన్ను ప్రశ్నిస్తూ ఉంటాడు. తాను అడిగే ప్రతి సందేహం నా దేహాన్ని వ్యక్తిత్వాన్ని ధృఢపరిచేది. ఇలాంటి సందేహాలు నాక్కూడా చిన్నప్పుడు వచ్చాయా? అని మా అమ్మని అడిగానంటే నా మేనల్లుడి ప్రశ్నల ప్రభావం నాపై ఎంతగానో ఉందని తెలుస్తోంది.

హమయ్య టైం రాత్రి పదిగంటలైంది. వీడు పడుకునే ఉంటాడు. ఈ రోజు సందేహాలకి స్వస్తి అని ఇంటికి బయలుదేరాను. ఇంట్లో అందరూ టీ.వీ. ముందు కూర్చున్నారు, అందులో ప్రసారం అవుతున్న బిగ్‌బాస్ షోనూ లీనమై చూస్తున్నారు. అన్నం పెట్టమని అడిగాను. అందుకు సమాధానంగా నా పెద్ద మేనకోడలు నిమ్మిబాయి ఈ రోజు షో విన్నర్ ఎవరో తెలుస్తుంది. అప్పటి దాకా కూర్చోని నువ్వుకూడా చూడు అని చెప్పింది. నా చిన్నమేనకోడలు ధద్దుబాయి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. నాకేమో ఈ టీవీ సీరియళ్ళ మీద, సినిమాలు, క్రికెట్ వంటి వాటి మీద పెద్దగా మనసుండదు. కాని నా మేనల్లుడి సందేహాలు విని విని నాక్కూడా ఒక సందేహం వచ్చింది. అప్పట్లో కబాలి సినిమా గురించి పరీక్షల్లో అడిగారు, ఒక వేళ బిగ్‌బాస్ షో గురించి కూడా ఏమైనా అడిగే అవకాశం ఉంది కదా. ఇక్కడేమైనా కొత్త విషయాలు తెలుస్తాయేమో అని ఆలోచిస్తూ కూర్చుందామని కుర్చీల వైపు చూశాను. అన్నీ హౌస్‌ఫుల్. ఒక్కొక్కరు రెండేసి కుర్చీల మీద కూర్చున్నారు. అదెలా అంటారా... శరీరానికో కుర్చీ, కాళ్ళకు మరో కుర్చీ. వీళ్ళందరూ సాయంత్రం నుండే టీవీలకు అతుక్కుని ఉన్నారన్న సంగతి నాకప్పుడు అర్థమైంది. చేసేది లేక అయిష్టంగానే క్రింద కూర్చుని చూస్తున్నాను. ఈలోగా షోలో మెగాస్టార్ చిరంజీవి గారు అతిథిగా వచ్చి అందులో పాల్గొన్న అందరిని పలకరిస్తున్నారు. సరిగ్గా అప్పుడే మోనాల్ గజ్జర్‌తో మాట్లాడుతున్నాడు. మోనాల్ గుజరాతీ కావడంతో చిరంజీవి గారు ఆ భాషలో తమే కీమ్ చో (మీరు ఎలా ఉన్నారు) అని అడిగిన ప్రశ్నకు తను మజ్జార్ మా ఛూ (బాగున్నాను) అని సమాధానం ఇచ్చింది.

మజ్జార్ మా ఛూ అనగా బాగున్నాను అని అర్థం. కాని ఇదే పదం బంజారాల గోర్ బోలి భాషలో అదే అర్థంతో ఉంది. ఎక్కడో చదివాను బంజార భాష అంటే గుజరాతీ + మరాఠి + రాజస్థానీ + హిందీ భాషల కలయిక అని, అది నిజమే అని నేను ఈ రోజు ఈ ఒక్క పదంతో నిర్ధారించుకున్నాను. నాకు కావల్సిన కొత్త విషయం దొరికింది అనిపించింది. ఈ విషయానికి వస్తే తెలుగు రాష్ట్రాలలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, ఏ కార్యాలయంలో, ఏ ఊరిలో చూసినా కనిపించే గిరిజనులు, బంజారలు (స్థానికంగా లంబాడీలు/ సుగాలీలు) వారి జీవన విధానం అభివృద్ధి పేరుతో ముందుకు సాగుతుంటే వారి భాషా, సంస్కృతి మాత్రం తిరోగమంలో సాగుతుంది. కారణాలు ఏవైనప్పటికి మాతృభాషలోని మమకారాన్ని మరిచిపోతున్నారనిపించింది. ప్రపంచంలోని ఎన్నో భాషలు అంతరించిపోవడానికి రకరకాల కారణాలున్నాయి. అందులో ఒకటి ఆయా తెగలలోని గొప్పవారు ఇంకా వెలుగులోకి రాకపోవడం. కాని బంజారల విషయానికి వస్తే అలా కాదు. వీరిలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులు, రాజకీయ నాయకులు ఇలా అన్ని రంగాల వారుండి కూడా- ఇప్పటి తరం బంజారలకు వారి భాష, సంస్కృతి గురించి సరిగ్గా తెలియకపోవటం బాధాకరమైన విషయం.

**ట్రైబ్స్ - నిర్వచనం:**

Tribes అనే పదాన్ని లాటిన్ భాషలోని tribus (tri & bu) అనగా నివాస స్థలము (inhabited) నుండి గ్రహింపబడినది. Tribes అనే పదాన్ని రోమన్లు ఒక సమూహపు ప్రజలుగా అంటారని 16వ శతాబ్దంలో మొదటగా బైబిల్‌లో లిఖించారని 'Tribes of Ancient India' అనే పుస్తకంలో వ్రాయబడింది. భారత రాజ్యాంగంలోని 342 ఆర్టికల్‌లో ట్రైబ్స్ నిర్వచనం ఇవ్వబడింది. భారతదేశంలో సుమారు 700లకు పైగా గిరిజన తెగలున్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే సుమారు 35 గిరిజన తెగలున్నాయి. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండి ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో బంజారలను / సుగాలీలను గిరిజనులుగా గుర్తిస్తే, తెలంగాణ ప్రాంతంలో బంజార / లంబాడీలను 1976వ సంవత్సరంలో షెడ్యూల్డు ట్రైబ్స్ జాబితాతో చేర్చడం జరిగింది.

**గిరిజనులు భౌగోళిక విస్తరణ:** గిరిజనులు నివసించే ప్రాంతాలను బట్టి ఈ క్రింది ఆరు విభాగాలుగా విభజించవచ్చు.

1. సముద్రపు ఒడ్డున నివసించేవారు. 2. నదుల ఒడ్డున నివసించే వారు. 3. పర్వతాలపై నివసించేవారు. 4. కొండలపై నివసించేవారు. 5. అడవుల్లో నివసించేవారు. 6. పీఠభూములలో నివసించేవారు.

బంజారాలు / లంబాడీలు / సుగాలీలు కొండల్లో, అడవుల్లో కంటే పీఠభూములలోనే ఎక్కువగా నివసిస్తారు. వెనుకటికి వీరు సంచార వ్యాపారులుగా గుర్తించబడ్డారు. కాలక్రమేణా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని వివిధ వృత్తులలో స్థిరపడ్డారు. వీరి నివాసాలను "తండా"లు అంటారు.

**బంజార / లంబాడీలు / సుగాలీలు:**

భారతదేశపు గిరిజన తెగలలో బంజారాలు ఒక విశిష్టమైన

స్థానాన్ని కలిగి ఉన్నారు. బంజారాలు భౌతికంగా, భాషాపరంగా మరియు వారి దుస్తుల పరంగా కూడా వాయవ్య భారతదేశంలోని రాజస్థాన్ జన్మస్థలం గల వారైనా కూడా వారు దేశంలో కనిపించని రాష్ట్రం లేదు. వారి భాషలో కలవని స్థానిక మాండలికం లేదు. దీనికి కారణం వారి వృత్తి సంచార వ్యాపారం కావడమే. తండాలలో నివసించే బంజారాలు ఇతర తెగలతో కలిసి జీవిస్తూ, ఆర్థిక, వ్యాపార, వాణిజ్య సంబంధాలు ఏర్పరుచుకున్నప్పటికీ కూడా వారి మాతృభాష, సాంస్కృతిక గుర్తింపు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

భారతదేశంలో అంతటా కనబడే బంజారాలు/ లంబాడీలు / సుగాలీలు దేశంలోని ఇతర యే ప్రాంతంలో కన్నా హైదరాబాదు సంస్థానంలో ఎక్కువ సంఖ్యలో ఉండేవారని 1952వ సంవత్సరంలో హైదరాబాద్ ప్రభుత్వపు సాంఘిక సేవాశాఖ డైరెక్టర్ అబ్దుల్ గఫూర్ గారు వారు వ్రాసిన కొండజాతుల వారి సంక్షేమము అనే పుస్తకంలో రాశారు. బంజారలు దృఢకాయులు, వారిది పౌరుషవంతమైన జాతి, పొడవైన ఆకారము, అందమైన శరీరచర్మము ప్రకాశవంతమైన కన్నులు కలవారు. ఆయుధాలు ప్రయోగించుటలో వారు సమర్థులు. లంబాడీల ఉపతెగలలో మధురలను బ్రాహ్మణుల వంటి వారని, బంజారులను క్షత్రియుల వంటి వారని, లంబాడీలను వైశ్యుల వంటి వారితో పోల్చారు గఫూర్ గారు.

భారతదేశపు చరిత్రలో వీరికంటూ ఒక ప్రత్యేక స్థానముంది. దేశం నలుమూలలా వీరు వ్యాపించి ఉన్నారు. బ్రాహ్మణుల తర్వాత దేశమంతా వ్యాపించి వున్న ప్రజల సమూహం వీరిది. వీరు దేశమంతా వ్యాపించి ఉన్నప్పటికీ వారి భాష, సంస్కృతి, సంప్రదాయ, ఆచారాలలో పెద్దగా మార్పులు కనిపించవు.

బంజారాలు రాజస్థాన్ నుండి దక్కనకు మహ్మదీయుల సైనికులతో పాటుగా వచ్చారని ఎంతోమంది చరిత్రకారులు తెలిపారు. వీరు ముఖ్యంగా మొగలుల సైన్యాలతోపాటుగా వచ్చినట్లుగా మనకు మధ్య భారతదేశ చరిత్ర ద్వారా తెలుస్తుంది.

వీరి సంప్రదాయ ఆచార వ్యవహారాలు దేశం మొత్తం ఘనంగా వర్ధిల్లడానికి గల బలమైన కారణం వారి ఎద్దుల బండ్లు. వాటితో దేశం మొత్తం వారు సంచార వ్యాపారం కొనసాగించేవారు. ఇప్పటిలాగా రవాణా వ్యవస్థ అభివృద్ధి లేని రోజులలో సరుకులు ఎలా రవాణా చేయాలో ఏ దారులగుండా వెళ్లాలో తెలిసిన వారు బంజారాలు. కాలక్రమేణా భారతదేశంలో ఆంగ్లేయులు రవాణా వ్యవస్థ, రైల్వేలు వంటివి అభివృద్ధిపరిచిన తర్వాత బంజారాల ప్రాముఖ్యత తగ్గిపోతూ వచ్చింది. వారు జీవనాధారం కోల్పోవలసి వచ్చింది. బంజారాలు సంచార వ్యాపారం నుండి స్థిరనివాసం, వ్యవసాయం, పశుపోషణ వంటి వృత్తులను ఎంచుకోవడం ఆరంభించారు. అదే క్రమంలో కొంతమంది బంజారాలు వేరే వృత్తులలో ఇమడలేక చిన్న చిన్న నేరాలు చేయసాగారు. అప్పటి ప్రభుత్వం వీరిని నేరస్త తెగగా ముద్రవేసింది. వీరిని క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ క్రింద గుర్తించింది. వీరి యొక్క కదలికలపై ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వీరిని డినోటిఫైడ్ ట్రైబ్స్ గా (విముక్తతెగ) గుర్తించడం జరిగింది.

**జనాభా వివరాలు:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన తెగలలో లంబాడి తెగ అతి పెద్ద తెగ. 2011 జనాభా లెక్కల ప్రకారం 20,44,039 మంది కలరు. అక్షరాస్యత 49.01%. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 2,24,192 మంది మరియు కరీంనగర్ జిల్లాలో అత్యల్పంగా 6,238 మంది కలరు. తెలంగాణ రాష్ట్ర గిరిజన జనాభాలో ప్రతీ పది మందిలో ఆరుగురుగా మరియు తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభాలో ప్రతీ పదహారు మందిలో ఒకరు కలరు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే అనంతపురం జిల్లాలో అత్యధికంగా 1,00,182 మంది కలరు. విజయనగరం జిల్లాలో అత్యల్పంగా 71 మంది కలరు.

భారత స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిషు ప్రభుత్వం 1871వ సం॥లో ప్రవేశపెట్టిన క్రిమినల్ ట్రైబ్స్ చట్టం ప్రకారం వీరిని క్రిమినల్ ట్రైబ్స్‌గా గుర్తించింది. స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రభుత్వం 1949వ సం॥లో వీరిని 'డి నోటిఫైడ్ ట్రైబ్స్' గా గుర్తించింది.

**బంజారాలు ఎస్టీలుగా ఉన్న రాష్ట్రాలు:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బీహార్

**బంజారాలు ఎస్సీలుగా ఉన్న రాష్ట్రాలు:** కర్ణాటక, పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ (యు.టి.), ఉత్తరప్రదేశ్.

**బంజారాలు బిసిలుగా ఉన్న రాష్ట్రాలు:** గుజరాత్, గోవా, అస్సాం, హర్యానా, జమ్మూకాశ్మీర్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, త్రిపుర. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్ ఘడ్, దయ్యు డామన్.

**బంజారాలు ఓబిసిలుగా ఉన్న రాష్ట్రాలు:** రాజస్థాన్, మహారాష్ట్ర.

**బంజార భాషా - సంస్కృతి**

బంజార / లంబాడీ / సుగాలీల భాషను 'గోర్‌బోలి' భాష అంటారు. ఇది 'ఇండో ఆర్యన్' భాషా కుటుంబానికి చెందినదిగా భాషాశాస్త్రవేత్తలు తేల్చారు. తెలుగు రాష్ట్రాలలో మాట్లాడే భాషలలో తెలుగు, ఉర్దూల తర్వాత మూడవ అతి పెద్ద భాషగా గోర్ బోలి భాష ఉంది. భారతదేశంలో సుమారు 17 రాష్ట్రాలలో గోర్ బోలి మాట్లాడుతారు, ఆయా రాష్ట్రాల స్థానిక భాషల ప్రభావం చేత చిన్న చిన్న మార్పులు కనిపిస్తాయి. ***గుజరాతీ . మరాఠీ . రాజస్థానీ . హిందీ భాషలు = గోర్ బోలి భాష అని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం.*** భారతీయ భాషలను పరిశోధించి "లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా" అనే గ్రంథాన్ని రచించిన గ్రియర్సన్ ప్రకారం గోర్ అంటే తండా మనిషి. దీనిని బట్టి పరిశీలిస్తే తండా మనుషులు మాట్లాడే భాష కాబట్టి గోర్ బోలి అనే పేరు వచ్చి వుండవచ్చు. గోర్ బోలి భాషకు లిపి లేదు. సాహిత్యం మొత్తం మౌఖికంగానే ఉంటుంది. కొంతమంది ఔత్సాహికులు ఆయా రాష్ట్రాల స్థానిక భాషా లిపుల సాయంతో గోర్బోలి భాషా సాహిత్యాన్ని వ్రాస్తున్నారు. ఉదాహరణకి తెలుగు రాష్ట్రాలలో తెలుగు లిపిలో, కర్ణాటక రాష్ట్రంలో కన్నడలో వ్రాస్తున్నారు.

మనిషి పుట్టుక నుండి మరణం వరకు ఆ తదనంతరం కూడా

**తరువాయి 24వ పుటలో....**

సన్నిధానం నరసింహశర్మ
92920 55531

# గిరిజన ఆదివాసీ కళాప్రభల కేతనం
# తెలంగాణ తొలి సాంస్కృతిక కృతులు, ఆకృతుల ప్రదర్శనం




బ్రతుకులు కళగట్టాలంటే కళలే జీవధాతువులు. గిరిజనులకూ, ఆదివాసీలకూ- జీవితాలూ, కళలూ పడుగుపేకలు. అవి వారి ఆత్మగౌరవ ప్రతీకలు కూడా. చెప్పబడుతున్న అరవైనాలుగు కళల్లో ఎక్కువ భాగం వారిలోనే ప్రదర్శనాలవుతాయి.

ఆద్యస్థానాల కెన్నిటికో నెలవైన తెలంగాణలో - హైదరాబాదులో మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 2021 జులై 31 నుండి ఆగష్టు 28 వరకూ 'ఆద్యకళ' పేరిట 'తెలంగాణ తొలి సాంస్కృతిక కృతులు- ఆకృతుల ప్రదర్శన' జరిగింది. ఆది అక్షరం, ఆదిధ్వని, ఆదిచిత్రం, గిరిజన లోహ నిర్మాణకళ- అనే నాలుగు ప్రదర్శనశాలలు ఒక ప్రదర్శనగా అందగించిన కళ్ళముచ్చట.

ముందుచూపుతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనా విభాగాల్ని చూస్తుంటే - వెనుక చూపుతో కొన్ని శతాబ్దాల క్రిందటి కాలానికి వెళ్ళిపోతాం. అపురూప వస్తుకళా నిర్మాతలు కనబడక పోయినా, వారికి సామూహిక కృతజ్ఞతా నమస్కారాలు చేసుకుంటాం. నిర్మాణ సౌందర్య దక్షులను తలచుకొని ఇంత సంపద మనకుందా అని విస్తుపోతాం. అవసరాలు, దుఃఖాలు, ఆనందాలు, అంతర్గత సౌందర్యారాధనా ప్రేరణలు, ఆలోచనలు, కళలకలలు, క్రొత్త క్రొత్త ప్రయోగ సృజనలు, కనబడే ప్రకృతి, బ్రతికే సమాజం- ఇలా ఒకటేమిటి సవాలక్ష అంశాల సమాహారం. శ్రామిక గిరిజన ఆదివాసీల కళాకృతులు, ఆకృతులు - ఈ ప్రదర్శనకు ప్రాణాలు.

ఈ ప్రదర్శన ఆర్థిక స్తోమత, రాజకీయ శక్తుల ప్రోద్బలాలు ఉన్నవారు గాని ఉన్నత సంస్థలు గాని ఏర్పాటు చేసినది కాదు; నాగరిక సమాజంలో జనపదుడి గుండెబలంవున్న ఒక జానపదాచార్యుడు, గిరిజన ఆదివాసీల తొవ్వముచ్చట్ల ఎరుక గలవాడు. వారితో మమేకమై రాహుల్ సాంకృత్యాయన బాటపట్టినవాడు, ప్రజోపయోగకర గ్రంథకర్తతో ఆచార్య జయధీర్ తిరుమలరావు గారు. గత నాలుగు దశాబ్దాల్లో తాను తిరిగి శ్రమించి సేకరించిన కళాకృతులతో ఏర్పాటు చేసిన- ఏక వ్యక్తి ప్రదర్శన. ఒక మాటలో చెప్పాలంటే ఆశ్చర్యచకితుల్ని చేసింది.

దక్కన్ ప్రాంతంలో తెలంగాణది హృదయస్థానం. శిల్ప, సాహిత్య, సంగీత, చిత్ర ఆది కళల్లో కొన్ని విధానాలు ఉద్భవించిన ప్రదేశం. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ ఒరిస్సా రాష్ట్రాలతో సామీప్య సంబంధాలు పరిమళించిన రాష్ట్రం తెలంగాణ.

**ఆది అక్షరం-** సందర్శనలో తెలుగులిపి పరిణామాల్ని తెలిపే



శాసనాలు, తాటాకు గ్రంథాలూ వున్నాయి. అధ్యయనాలుగా గ్రంథాల్లో వున్నవి కళాకృతుల్లో చూడగలుగుతాం. క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి ప్రవహించిన తెలుగు లిపి ఆనవాళ్ళు చూడగలుగుతాం. ఒక్క తాటాకులో ఎన్ని వరసలు! ఎన్ని పంక్తులు ! ఎన్నిరకాల గంటపురాతలు! అబ్బురపోవడమే మన పని.

**ఆది ధ్వని:** మానవ అంతర్గత శక్తి ప్రకటనకు సంగీతం ఓ



సాధనం. ఆ సంగీతం అనేక రకాల వాయిద్యాల పుట్టుకకు కారణమైంది. శాస్త్రీయ సంగీతానికి గిరిజన, ఆదివాసీల సంగీత అధ్యయనం అవసరాంశం అనిపిస్తుంది. ఈ ప్రదర్శనలోని సంగీత సాధనాలను చూస్తేనే ఇంత సంతోషం కలుగుతోంది. వింటే ఎంత ఆనందం పొంగుతుందో! అనిపిస్తుంది. బుర్రవీణలు, గంజలు, ఔజములు, తొమ్మిది అడుగుల మౌగలు (మౌగను నలుగురు తీసుకొస్తారు; ఇద్దరు వాయిస్తారు). మూడు బుర్రల కిన్నెర వాయిద్యాలు, గోండుల అందమైన సంగీత సాధనల 'కికిరీ'- ఇలా ఇంకాకొన్ని! వీటి అలంకరణలు, నిర్మాణ ప్రతిభలు చెప్పడానికి అక్షరాలు అందవు.

**ఆది చిత్రం:** ఇందులో పట సంస్కృతి ప్రధానం. ఇటు అటు



ఐదైదు చేతులతో, ఆయుధాలతో – త్రిశూలంతో ప్రధానంగా కత్తితో ఎర్రని కుంకుమ బొట్టుతో స్ఫుట నేత్రాలతో అమ్మవారున్న ఓ పటం చిత్ర సౌందర్యాన్ని చూపటంలో జానపద కళాకారుడి పనితనాన్ని వెలిగిస్తోంది. నకాషీ చిత్రకళాకారుల పటాలను పడిగెలను 25 సంవత్సరాల క్రితం తిరుమలరాయ బృందం ఒక ప్రదర్శన ద్వారా వెల్లడి చేసేవరకూ ఎక్కువ ప్రచారానికి రాలేదు. సాంస్కృతికపరమైన హక్కులు కుటుంబ పెద్దలకు ఎలా దఖలు పడినవీ, ఆ వైనాలు పట సంస్కృతి వల్ల తెలుస్తుంది. ఒక రకమైన 'మిరాసీ' హక్కులుగా తిరుమలరావు గారు చెబుతున్నారు. కాటంరాజుకథాగాన పటాన్ని చూస్తుంటే చిన్న స్థల పరిధిలో ఎన్ని కథా సందర్భాలు చిత్రించారు! ఇప్పటికీ వెలిగే ఆ రంగులు ఎలా చేశారో ఎలా వేశారో అని ఆశ్చర్యపోతాం. కళాత్మకమైన ఒక గుడార చిత్రం కూడా ఇందులో ఉంది. కోయ సమాజపు కళాకృతులు, పడిగెలు వారి సంస్కృతికి జెండాలై మెరిశాయి.

**గిరిజన లోహ కళాకృతులు:** ప్రాచీన మొహంజోదాదో



నాగరికతలోని కొన్ని నిర్మాణాలు(ఆకృతులు) గిరిజన సంస్కృతి, కళల్లో కనబడతాయి. కొమ్ములు, ప్రాచీన దేవతలు, క్రూరమృగాలు, మహిళా విగ్రహాలు వీటిలో భాగం. నగానట్రా, శరీర భంగిమలు, నాట్యమాడే బాలిక వంటివి ఎటువంటివి మొహంజోదారోలో దొరకాయో అటువంటివే ఈ గిరిజన ప్రాంతాల్లో దొరకడం ప్రాచీన కాల చరిత్ర స్వరూపాలకు ఆనవాళ్ళు. గోండీ డోక్రా విగ్రహాల్లో ఇవి మనకు దృశ్యమాన మయ్యాయి. లోహాలు భూమిలో నిద్రపోతుంటే భూమిపుత్రులు (గిరిజనులు) తమ ఎరుకతో వాటి నిద్రపోగొట్టి చైతన్య పరచి, ప్రాణం పోసి, విశేష చరిత్ర కథలు చెప్పే బొమ్మలుగా సృజనాత్మకంగా మలచడం.. నేలను కర్మభూమిగా కాక- కళా కార్మిక భూమిగా తయారు చేయడంలో భాగమేమో!

నాలుగు ప్రదర్శన శాలలు ఏక ప్రదర్శనశాల అయి- ఏక వ్యక్తి శక్తి సేకరణగా, చూపరులను ఎంత మందినో- గిరిజన ఆదివాసీల కళాసేవల వైపు మరల్చింది. తెలంగాణ గవర్నరు శ్రీమతి తమిళిసై, కేంద్రమంత్రి శ్రీ కిషన్‌రెడ్డి ప్రభృతుల్నీ, అధికార అనధికారుల్నీ, చరిత్ర ప్రేమికుల్నీ ఈ ప్రదర్శనలతో ఉబ్బితబ్బిబ్బులు చేసిన ఆచార్య జయధీర్ తిరుమలరావుతో ముచ్చటిస్తూ కొన్ని ప్రశ్నలూ వారి అనుభవపూర్వకమైన జవాబులూ ఇస్తున్నాను.

**ప్రశ్న: ఆదివాసీ, గిరిజన కళలు జానపదకళల క్రిందే వస్తాయంటారా? వాటికి వేరు వేరు భూమికలున్నాయంటారా?**

**జవాబు:** మన దేశంలో ఎకడమిక్స్‌లో సామాజిక శాస్త్రంలో అవగాహనలో గిరిజన వేరు; జనపదం వేరు. అభివృద్ధి చెందిన దేశాలలో వాటి మధ్య గీతవుండదు. కాబట్టి వీటిని రెండు పేర్లతో పిలవడం జరుగుతోంది. అయితే వాటిని ఓచోట ప్రదర్శించినపుడు



మాత్రం ఈ గీతని పాటించడం కష్టం.

**ప్రశ్న: ఈ ప్రదర్శనల్లో చాలా అరుదైనవీ, అపూర్వమైనవి, అత్యంత ప్రాచీనమైనవీ వున్నాయి. ఎన్నో సేకరించడమనే తపస్సులో మునిగిన మిమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసినవి, ఇష్టమైనవేమిటి?**

**జవాబు:** వస్తు కళాఖండాలకన్నా వాటిని చేసేనైపుణ్యం గొప్పది. నిజానికి అన్నీ నాకు నచ్చుతాయి. ప్రతి వస్తువూ గతం నుండి వర్తమానానికి ప్రవహిస్తుంది. ఆ ప్రవాహం నాకు మరీ ఇష్టం. 4,5 వేల సంవత్సరాల నుంచి హరప్పా సంధుల్లో కనిపించే సంకేతాలు, చిత్రాలూ ఇప్పటికీ వారు తమ కళా ఖండాలలో చిత్రించుకుంటారు. ఆ విషయం నన్ను మరీ అబ్బురపరచింది. వీటి తయారీ కోసం గోండు ఆదివాసీలకు 'డీజాలు' అనే గిరిజన ఉపతెగవుంది. వారే వాటిని సృష్టిస్తారు. లోహకళాకృతులు పండగలకీ పబ్బాలకీ కర్మకాండలో ఉపయోగించేవి అనేకం. గోండీ జాతి సంగీతం నాకు ఇష్టమేన కళారూపం. కాటమరాజుకథ చిత్రించిన అతిపెద్ద కళంకారీ పటం యిష్టం. చేర్యాల నకాషీ పటా , బొమ్మలూ కూడా నన్ను విస్మయానికి గురిచేస్తాయి. తెలుగు రాతలను, బ్రాహ్మీపూర్వ అక్షరాలను- భూమికల మీద చర్మంమీద, శిలలమీద, లోహలమీద చెక్కుకున్న రాతలు మరీ ఇష్టం.

**ప్రశ్న: మీ సేకరణల్లో అన్నీ మూల కళాఖండాలు ఆకృతులు ఉన్నయా? రెప్లికాస్ ఉన్నాయా?**

**జవాబు:** నా సేకరణలో ఎనభైశాతం మూలకళాఖండాలే. అవీ చేతితో చేసినవే. కానీ వాటి ప్రతులు అక్కడక్కడ వుండే వీలుంది. అయితే వీటిలో చాలా వరకూ ఒరిజినల్సు. 4,5 వాద్యాలు మాత్రం ప్రాచీన కళారూపాల్ని చూసి నేను వాటికి కొత్తగా తయారు చేయించాను. ఎందుకంటే అంతరించి పోయే వాటి రూపాలు చూపించాలనే ఆశతో వాటికి జీవం పోశాం.

**ప్రశ్న: ఆదివాసీ భాషలు, లిపుల గురించి మీ అభిప్రాయాలు?**

**జవాబు:** ప్రపంచంలో అత్యధిక భాషలూ, లిపులూ అతివేగంగా అంతరించిపోతున్నాయి. భాషావైవిద్యతలు సమసిపోతున్నాయి. ఇలాంటి కాలంలో గత దశాబ్దంలో గోండీలిపి రాత ప్రతులు లభించాయి. వాటిని ఆధారంగా చేసుకొని ఆ లిపిని శాస్త్రీయబద్ధంగా అక్కడి పండితులతో మాట్లాడి దానికి సాఫ్ట్‌వేరు తయారు చేయించాం. దానిని ప్రపంచలిపుల సరసన యూనీ కోడ్‌లో స్థానం కల్పించగలిగాం. పాఠ్యపుస్తకాలను తయారు చేశాం. ముగ్గురు మాత్రమే చదివే లిపిని మూడు వందలమంది చదివేలా చేశాం.

**ప్రశ్న: వర్తమాన ప్రజాస్వామిక రాజరికవ్యవస్థలో- ముఖ్యులైన ఏలిక దృష్టి పడితే గాని పనులవడం లేదు. ఈ ప్రదర్శనలపై అటువంటి ఔపయోగిక దృష్టి పడిందంటారా? శాశ్వత ప్రాతిపదికపై ఈ కళాకృతులను భద్రపరచాలనే మీ తపనకు దొరతనాల స్పందనలు, చొరవలు ఎలా ఉన్నాయి.**

**జవాబు:** మరో 4 రోజుల్లో మేము ఆర్టు గేలరీ నుంచి వస్తువులను తీసుకువెళ్ళాలి. అయితే ఇప్పటివరకూ శాశ్వత స్థానం అనేదే నిర్ధారణకాలేదు. ఆ రకంగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నట్లే.

ఆచార్య జయధీర్ తిరుమలరావు గారి అంతరంగాన్ని అర్థం చేసుకుని జాతి ప్రయోజనదాయకమైన శాశ్వత స్థితిగతుల్ని ఈ కళాకృతులు- ఆకృతులకు ఏర్పాటుచేయడం దొరతనాలకు, శక్తి మంతులకు కలుగుగాక!

---

## 21 వ పుట తరువాయి.....

జీవితంలో సంభవించే ప్రతి ఆనంద, విషాద సందర్భాన్ని బంజారలు వారి సంస్కృతికి ప్రతీకగా జరుపుకుంటారు. తీజ్, శీతభవాని వంటి పండుగలు నాగరిక సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంటాయి. నిరంతరం శ్రమించే బంజారలకు వారి ప్రదర్శన కళలు సేదతీర్చడానికి ఉపయోగపడతాయి. నృత్యం, దప్పుల సంగీతం, గేయాలు, రంగోళి, పచ్చబొట్లు, ఎంబ్రాయిడరీకళ మొదలైనవి వారి సంస్కృతికి మచ్చుతునకలు.

**ముగింపు:**

తెలుగు రాష్ట్రాలలోని గిరిజన తెగలలో ఎక్కువ జనాభా కలిగి ముందు వరుసలో ఉన్న లంబాడీలు భాషా, సంస్కృతిని కాపాడుకోవటంలో వెనుక వరుసలోకి వెళ్లిపోయినట్టుగా అనిపిస్తుంది. పీఠభూములలో తండాలు ఏర్పాటు చేసుకొని నివసించే వీరు, మిగిలిన గిరిజనుల్లా కాకుండా నాగరిక సమాజంతో వెంటనే కలిసిపోతున్నారు. ఈ నాగరిక సమాజంలో వారి జీవన పోరాటాలు కొనసాగిస్తూ వారి భాషా, సంస్కృతులను నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణాలు, నగరాలకు వలసలు వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. ఏ జాతి అయినా నాగరిక సమాజాలలో కలిసి జీవనాన్ని కొనసాగించినప్పుడే వారి భాషా, సంస్కృతి అభివృద్ధి చెందిన నాగరిక సమాజాల భాషా సంస్కృతుల ప్రభావంతో మార్పునకు గురికావడం, క్షీణించడం జరుగుతుంది, బంజార/ లంబాడీ / సుగాలీల విషయంలో కూడా అదే జరుగుతున్నది. నాగరిక సమాజంతో కలవకుండా ఇంకా తండాలలోనే జీవనాన్ని కొనసాగిస్తున్న బంజారలు / లంబాడీలు / సుగాలీలు మాత్రం వారి భాషా, సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటికైనా బంజారలు / లంబాడీలు / సుగాలీలు మేల్కొని వారి భాషా, సంస్కృతిని కాపాడుకుంటూ రాబోయే తరాల వారికి అందించటానికి కృషి చేయాలని కోరుకుంటున్నాను.

హంసావత్ నాగేంద్ర
రచయిత పిహెచ్.డి.(స్కాలర్)
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

డాక్టర్ షేక్ మహబూబ్ బాషా
డాక్టర్ మొహమ్మద్ కరీం

# ‘విశ్వమానవ ఏకత్వాన్ని సాధించే దిశగా చరిత్ర రచన సాగాలి’ – మౌలానా ఆజాద్



భారత స్వాతంత్ర్యోద్యమ అగ్రశ్రేణి నాయకుల్లో ప్రముఖులైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర భారత విద్యాశాఖామాత్యుని హోదాలో సుమారు పదకొండు సంవత్సరాలు విద్యా, సాంస్కృతిక రంగాలకు అమూల్యమైన సేవలందించారు. ఈ కాలంలో వివిధ సందర్భాలలో చరిత్ర రచన, బోధనలకు సంబంధించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను పాఠకులకు పరిచయం చెయ్యడమే- ఈ వ్యాసం ఉద్దేశం.

24.3.1951న ‘ఇండియన్ నేషనల్ కమీషన్ ఫర్ కోఆపరేషన్ విత్ యునెస్కో’ రెండో సమావేశంలో ప్రారంభోపన్యాసం చేశారు మౌలానా ఆజాద్. అన్ని సంఘర్షణలూ, యుద్ధాలూ మానవ మస్తిష్కంలోనే పుడతాయనీ కాబట్టి అక్కడే శాంతి బీజాలు నాటాలనే యునెస్కో నినాదాన్ని సరిగ్గా గుర్తు చేసిన ఆజాద్ మానవాళి సాంస్కృతిక ఐక్యతకై విద్యను ఒక ప్రబల సాధనంగా వినియోగించాలన్నారు. ఆధునిక జాతీయవాదమూ, రెండవ ప్రపంచయుద్ధం సృష్టించిన విధ్వంసం నేపథ్యంలో మాట్లాడిన మౌలానా ఆజాద్ నాడు ప్రపంచ మానవాళి కూరుకుపోయి వున్న సంక్లిష్ట పరిస్థితుల్ని సందర్భాన్నీ వివరించారు. ఆధునిక మానవులు జాతీయ ప్రత్యేకతలతో పెంచబడుతున్నారనీ, అటువంటి సందర్భంలో వారు ప్రపంచ పౌరులుగా తయారై ప్రపంచ ఐక్యతనూ, వసుధైక కుటుంబాన్ని సాధిస్తారని భావించలేమన్నారు. వారు కేవలం జాతి, వర్గ, జాతీయతల ప్రాతిపదికన ఆలోచించే విధంగా తీర్చిదిద్దబడుతున్న కారణంగా ఆయా సంకుచిత అస్తిత్వాలను అధిగమించలేక పోతున్నారన్నారు. కాబట్టి మనం ప్రపంచ ఐక్యతను సాధించాలంటే – ఒక వేళ అది సాధించబడని పక్షంలో మానవాళి భవిష్యత్తు అంధకారబంధురమౌతుందని భావిస్తే – భావితరాలను ప్రపంచ పౌరసత్వ దిశగా విద్యావంతులను చేయడానికి శతవిధాలా ప్రయత్నించాలన్నారు. చిన్నారులను బాల్యం నుండీ ఐక్యత, సౌభ్రాతృత్వం దిశగా ఆలోచించే విధంగా శిక్షణ ఇస్తే వారు పెద్దవారయ్యాక యిప్పుడున్న సంఘర్షణలు అనవసరమైనవిగానూ, అసత్యమైనవిగానూ భావిస్తారని విశ్వసించారు. (రవీంద్ర కుమార్ (సంపాదకుడు), ‘సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్, సంపుటం. 5, పు. 30-31)

దీనిని సాధించాలంటే మన పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ చరిత్రనూ, భూగోళశాస్త్రాన్నీ బోధించే విధానం పూర్తిగా మారాలని వాదించారు- మౌలానా ఆజాద్. ఇది జరగనంత వరకూ నిజమైన ఐక్యత సాధ్యం కాదనీ, ఐక్యత సాధ్యం కానంత వరకూ ప్రపంచ పౌరసత్వ భావన కలగానే మిగిలిపోతుందనీ హెచ్చరించారు. ప్రస్తుతం మనం చరిత్రనూ, భూగోళశాస్త్రాన్నీ బోధిస్తున్న తీరు ఐక్యతా లక్ష్యానికి విరుద్ధంగా ఉండడం మాత్రమే కాకుండా, వాస్తవ విరుద్ధంగా కూడా ఉంటోందని స్పష్టం చేశారు. ప్రకృతి సృష్టించిన ఈ భూమండలాన్ని మన సౌకర్యార్థం అనేక భాగాలుగా విభజించుకున్నామనీ, దాంతో సంతృప్తి చెందకుండా దానికి అనేక రకాలైన రంగులు పూసి ఆసియా, ఐరోపా, అమెరికా, ఆఫ్రికాలుగా విభజిస్తున్నామని అన్నారు. ఆజాద్ ప్రకారం మనం పిల్లలకు భూగోళశాస్త్రాన్ని బోధిస్తున్నప్పుడు వారు ఈ భూమిపై నివసించే మానవులుగా చెప్పకుండా వాళ్ళు ఢిల్లీ వాసులనీ, ఢిల్లీ భారతదేశంలో ఉందనీ, భారతదేశం ఆసియా ఖండంలో ఉందనీ, ఆసియా ఖండం పూర్వార్ధగోళంలో ఉందనీ చెబుతాం. ఇదంతా చెప్పిన తర్వాతనే వారు ఈ ప్రపంచంలో భాగమని చెబుతాం. ఇటువంటి శిక్షణ గ్రహించిన బాలుడు లేదా బాలిక తను ఒక ప్రత్యేక ప్రాంతానికి – అది ఢిల్లీ కావచ్చు, ప్యారిస్ కావచ్చు, పెకింగ్ కావచ్చు, న్యూయార్క్ కావచ్చు – చెందిన వారమని భావిస్తారనడంలో ఆశ్చర్యమేమున్నదని ఆజాద్ ప్రశ్నించారు. ఇలాంటి తర్ఫీదు పొందిన పిల్లలు మహా అయితే వాళ్ళ ప్రాంతీయ లేదా జాతీయ అస్తిత్వాలను అధిగమించి ఆసియావారుగానో, ఐరోపావారుగానో, ఆఫ్రికావారుగానో, అమెరికావారుగానో చెప్పుకోగలరుగాని తాము మొత్తం ప్రపంచ మానవాళిలో ఒక భాగమని భావించుకొనే ఆలోచన వాళ్ళకు కలగదని స్పష్టం చేశారు. (సం. 5, పు. 31)

అందుకే భూగోళశాస్త్రాన్ని బోధించే పద్ధతి మారాలని ఆశించారు ఆజాద్. పాఠశాల స్థాయి పిల్లలకోసం కొత్త ప్రపంచ పటాలను తయారుచేసి అందులో ప్రపంచాన్ని ఒకటిగా చూపించి, పిల్లలు మొట్టమొదటగా ప్రపంచ పౌరులని తెలియజెప్పాలన్నారు. ఆ తర్వాత ఏ విధంగా అయితే ఒక పట్టణం సౌకర్యార్థం వివిధ బ్లాకులుగా విభజించబడినప్పటికీ ఒకటిగా ఉంటుందో, అదే విధంగా ప్రపంచం కూడా ఆసియా, అమెరికా మొదలైన ఖండాలుగా విభజించబడినప్పటికీ అది ఒకటిగా ఉంటుందని బోధించాలి. అంతే కాకుండా, ఒకే పట్టణంలోని వివిధ బ్లాకులు వివిధ వీధులుగా ఎలా విభజించబడ్డాయో అదే విధంగా వివిధ ఖండాలు వివిధ దేశాలుగా విభజించబడినప్పటికీ అవి ఒకే ప్రపంచంలోని భాగాలుగా ఉంటాయని చెప్పాలన్నారు. ఈ విధంగా భూగోళశాస్త్రాన్ని చిన్న తరగతుల నుండీ బోధించడం వల్ల పిల్లల్లో తాము ఒకే ప్రపంచానికి చెందినవారమనే

భావన కలుగుతుందని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నానన్నారు. (సం. 5, పు. 31-32)

ఆజాద్ అభిప్రాయంలో సరిగా బోధించబడని చరిత్ర కూడా మానవాళి విభజనకు కారణమౌతున్నది. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న చరిత్ర పుస్తకాలు మానవులు వివిధ జాతులు, దేశాలకు సంబంధించిన వారుగా నొక్కి చెబుతున్నాయి. ఈ దేశాల చరిత్ర వాటి మధ్య జరిగిన సంఘర్షణలపై ఎక్కువగా దృష్టినిలిపి ఆయా దేశాలకూ, జాతులకూ చెందిన ప్రజల మధ్య సంబంధాలు శత్రు సంబంధాలుగానూ, విద్వేషపూరితమై ఉండినట్లుగానూ చిత్రీకరిస్తున్నాయి. మానవులు ఆదం-ఈవ్‌ల సంతానమని చెప్పిన బైబిల్ కథను ప్రజలు నమ్మడమే బాగుండిందని మౌలానా ఆజాద్ భావించారు. ఎందుకంటే జాతులు, దేశాలు ఏవైనప్పటికీ వారు ఒకే తల్లిదండ్రుల బిడ్డలమని నమ్మారు. ఒకే తల్లిదండ్రుల సంతానమన్న భావన తీవ్రమైన వ్యత్యాసాలూ, సంఘర్షణలున్న నేపథ్యంలో ఐక్యతను సాధించడానికి బాగా ఉపయోగపడింది. 19వ శతాబ్దంలో మన విజ్ఞానం పెరిగిన కొద్దీ ఈ మతవిశ్వాసాలను మనం ప్రశ్నించనారంభించి, ఒకే తల్లిదండ్రులన్న భావనను విడనాడి, మానవాళిని- కాకేషియన్లనీ, మంగోలియన్స్ అనీ, ఆర్యులనీ, సెమెటిక్స్ అనీ విభజించడంతోపాటు ఈ విభజనల్లోనే యింకా అనేక సూక్ష్మ విభజనలకు పాల్పడ్డామని వాపోయారు. ఆదం-ఈవ్‌ల కథ వాస్తవమైనదో కాదో తనకు తెలియదనీ, కానీ దాని సారాంశం మాత్రం వాస్తవికమైనదనీ, అది మానవజాతి ఒకే కుదురు నుంచి ప్రాదుర్భవించిందనే సత్యాన్ని నిరూపిస్తుందని ఖచ్చితంగా చెప్పారు. అందుకే ఏవిధంగా అయితే ప్రపంచ ఐక్యతను నిరూపించడానికి భూగోళశాస్త్ర బోధనా పద్ధతి మారాల్సి ఉందో-త అదే విధంగా మానవాళి ఏకత్వాన్ని సాధించడానికి చరిత్ర బోధనా పద్ధతి కూడా మారాల్సి ఉందని ఘంటాపథంగా తెలియజేశారు. (సం. 5, పు. 32)

ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతల మధ్యగానీ, వివిధ జాతుల, సంస్కృతుల మధ్యగానీ వ్యతిరేకతా, సంఘర్షణలున్నాయనే వాదనను మౌలానా ఆజాద్ అంగీకరించలేదు. వాస్తవాలను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్లనే ఇలాంటి వాదనలు ముందుకొస్తున్నాయన్నారు. క్రీస్తుపూర్వం పారశీకులు గ్రీకువారిమీద చేసిన దాడిని ప్రాచ్యం పాశ్చాత్యం మీద చేసిన దాడిగానూ, దానికి ప్రతీకారంగా అలెగ్జాండర్ నేతృత్వంలో పాశ్చాత్యం ప్రాచ్యం మీద దాడి చేసినట్లుగానూ చరిత్ర గ్రంథాలు తెలుపుతున్నాయనీ, కానీ వాస్తవంగా అది వ్యక్తులు యావత్ప్రపంచాన్ని జయించాలన్న కాంక్షతో చేసిన యుద్ధాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మనం అనవసరంగా పాశ్యాత్య - ప్రాచ్య దేశాల మధ్య 'శతాబ్దాల తరబడి సాగిన సంఘర్షణ' అనే పుక్కిటి పురాణాన్ని తయారు చేశామన్నారు. దీని ద్వారా చరిత్ర, భూగోళశాస్త్రాల బోధనా పద్ధతుల్ని మార్చనంతవరకూ మనిషి దృక్పథాన్ని మార్చలేమనే విషయం స్పష్టమౌతోందన్నారు.

కానీ యిది సులభసాధ్యమైన విషయం కాదనీ, దీనికి యెన్నో అడ్డంకులున్నాయనీ తెలిపారు. వాటిలో అత్యంత ప్రముఖమైనది సంకుచిత జాతీయవాదం. తన కాలంనాటికి జాతీయవాదం చాలా దుందుడుకుగా తయారైందనీ అది మానవుడి అభివృద్ధిని అడ్డుకుంటున్నదని వాపోయారు. దాని ప్రభావం ఎంత తీవ్రంగా విస్తరించిందంటే మనం ప్రపంచ ఐక్యతను ఎంతగా గుర్తించి దానిని కోరినప్పటికీ సంకుచిత జాతీయవాద పరిధిని అధిగమించలేకున్నాము. అయినప్పటికీ దీనిని అధిగమించకుంటే మానవాళి భవిష్యత్తు అంధకారబంధురమౌతుందని హెచ్చరించారు. (సం. 5, పు. 32-33) శామ్యూల్ పి. హంటిగ్టన్ ('The Clash of Civilisations') లాంటి వాళ్ళు నాగరికతల మధ్య ఘర్షణ అనివార్యమని వాదిస్తున్న ప్రస్తుత తరుణంలో మౌలానా అజాద్ వెలుబుచ్చిన ఈ అభిప్రాయాలు అత్యంత అమూల్యమైనవి.

1951 జూన్‌లో ప్యారిస్‌లో జరిగిన యునెస్కో సమావేశంలో ప్రసంగిస్తూ ఆధునిక కాలంలో మానవులు భౌతికంగా, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల పరంగా అత్యున్నత అభివృద్ధిని సాధించారనీ, కానీ ఈ అభివృద్ధి మనిషి 'నైతిక ప్రవర్తనలో మాత్రం కనిపించడం లేదని వాపోయిన మౌలానా ఆజాద్ ప్రపంచ మానవుల మధ్య 'మానసిక ఐక్యత' యేర్పడాలని బలంగా ఆకాంక్షించారు. (సం. 6, పు. 10). ఈ ఐక్యతను సాధించే ప్రయత్నంలో భాగంగా పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ చరిత్ర, భూగోళశాస్త్రాల బోధనా పద్ధతుల్ని మెరుగుపరిచేందుకై యునెస్కో చేపట్టిన చర్యల్ని ప్రశంసించారు. (యునెస్కో ఆధ్వర్యంలో ఒక ప్రపంచ మానవాళి చరిత్ర రూపుదిద్దుకుంటూండింది; ప్రపంచ మానవుల ఐక్యతను నొక్కిచెప్పడం దాని ప్రధాన లక్ష్యం. (సం. 5, పు. 32-33). పాఠశాలల్లో బోధించే చరిత్ర, భూగోళశాస్త్రాల బోధనా పద్ధతుల్ని సంస్కరించనంతవరకూ ప్రపంచంలో నిజంగా శాంతి అనేది ఉండదని గత ముప్ఫైయేళ్ళుగా తను చెబుతూనే వస్తున్నానన్నారు. ప్రస్తుత బోధనా పద్ధతి పిల్లలకు వారి వారి బేధాలనూ, సంఘర్షణలనూ చెప్పేదిగా ఉందనీ, చరిత్రంతా జాతీయవాద కీర్తనలతో నిండి ఉండడమే కాకుండా అతివాద జాతీయవాదాన్ని నూరిపోసేదిగా ఉందనీ సరిగ్గా గుర్తించారు. భూగోళశాస్త్ర బోధన ఐక్యతను తెలిపేదిగా కాకుండా భేదాలను చూపించేదిగా వుంది. అది అసహజంగా ప్రపంచాన్ని విభజించే సరిహద్దులను గీయడంతో ఆగకుండా ప్రతీ దేశం దానంతకదే ఒక ప్రత్యేకమైనదిగా చెబుతుంది. దీనితో పిల్లలు తమని తాము ప్రపంచంలోని యితరులతో భిన్నమైనవారుగా భావించుకుంటారు. భావితరాలకు ప్రపంచ ఐక్యత, ప్రపంచ పౌరసత్వాలలో శిక్షణ యివ్వకుండా వివిధ దేశాల మధ్య సత్సంబంధాలూ, సుహృద్భావ వాతావరణమూ ఎలా యేర్పడగలవని ఆజాద్ ప్రశ్నించారు. ప్రపంచ మానవుల ఏకత్వాన్ని చాటిచెప్పడానికి యునెస్కో ప్రపంచ నాగరికతా చరిత్రను తయారు చేస్తున్నందుకూ, చరిత్ర, భూగోళశాస్త్రాల పాఠ్యాంశాల్లో సంస్కరణలు తెస్తున్నందుకూ మౌలానా ఆజాద్ ఎంతగానో సంతోషించారు. (సం. 6, పు. 14)

ప్రపంచ చరిత్రతోపాటుగా భారతదేశ చరిత్రను విస్తృతంగా అధ్యయనం చేసిన మౌలానా ఆజాద్ "చరిత్ర లక్ష్యం గతానికి సంబంధించిన సత్యాన్ని వెలికితీయడం" అని బలంగా విశ్వసించారు. (సం. 3, పు. 266). 6.11.1948న కొత్త ఢిల్లీలో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్లో ప్రారంభోపన్యాసం చేస్తూ "మన గతానికి సంబంధించిన జ్ఞాపకాన్ని పునరాలోకించుకొనే అత్యంత అవసరం

స్వాతంత్ర్యానంతరం మనం సాగుతున్న ఈ సంధికాలంలో కన్నా మరెప్పుడూ లేదు" అని స్వాతంత్ర్యానంతర భారతంలో చారిత్రక జ్ఞానపు ప్రాధాన్యతను తెలియజేశారు. (సం.3, పు. 259). 16 జనవరి 1948న కొత్త ఢిల్లీలో జరిగిన 'ఆల్ ఇండియా ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్'లో విశ్వవిద్యాలయ స్థాయిలో రావాల్సిన సంస్కరణలను గూర్చి మాట్లాడుతూ 'జ్ఞానం విషయంలో సంకుచిత జాతీయవాదమ'నే ప్రశ్నే తలెత్తకూడదనీ, కానీ అదే సమయంలో దేశ చరిత్ర, సంస్కృతులకు సంబంధించి తప్పుడు దృక్పథం, అవగాహన లేకుండా ఉండేలా మనం చూడాలనీ, జాతీయ శీలమూ, వ్యక్తిత్వము, నాగరికతల్లోని అత్యున్నత ఆదర్శాలను ప్రోత్సహించాలనీ, కానీ దురదృష్టవశాత్తూ భారతదేశంలో యిది జరగడం లేదని వాపోయారు. (సం. 3, పు. 122)

11.3.1948న కేంద్ర శాసన సభలో మాట్లాడుతూ భారతదేశ చరిత్ర ప్రతి భారతీయుడికీ గర్వకారణమైన వారసత్వమన్న ఆజాద్ అంతవరకూ ఒక జాతీయ చరిత్రంటూ రాయబడని వాస్తవాన్ని తెలిపి భారతదేశ నాగరికత, సంస్కృతికి సంబంధించిన చరిత్ర ఎంత త్వరగా రచించబడితే అంత మంచిదన్నారు. (సం. 3, పు. 190-191). 16 జనవరి 1948న కొత్త ఢిల్లీలో జరిగిన 'ఆల్ ఇండియా ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్' లో మాట్లాడుతూ విన్సెంట్ స్మిత్ రాసేంత వరకూ ఇంగ్లీషులో సరియైన భారతదేశ చరిత్ర వెలువడలేదనీ, స్మిత్ చరిత్ర కూడా లోపభూయిష్టమైనదే కాకుండా అనేక విషయాల్లో కాలం చెల్లిందనీ తెలియజేశారు. మన విశ్వవిద్యాలయాల్లో ఉపయోగిస్తున్న చరిత్ర గ్రంథాలు అనేక లోపాలతోపాటు వక్రీకరణలు కూడా కలిగి ఉన్నాయన్నారు. అందుకే ప్రాథమిక స్థాయి నుండీ విశ్వవిద్యాలయ స్థాయి వరకు జరుగుతున్న చరిత్ర అధ్యయనాన్ని బాగుచేయడం కన్నా అత్యంత ముఖ్యమైనదేదీ ఈనాడు లేదనీ, ఈ పనిని విశ్వవిద్యాలయాలు చాలా తొందరగా చేయాలనీ ఆకాంక్షించారు.

భారతదేశ చరిత్రలో నిష్ణాతుడైన మౌలానా ఆజాద్ భారతదేశ చరిత్ర రచనలోని ఖాళీలను గూర్చి సూచించిన విషయాలు చారిత్రక పరిశోధనలకు దిశానిర్దేశం చేసేవిగా ఉండినాయి. చరిత్ర పూర్వయుగం నుండీ ఆధునిక భారతదేశ చరిత్ర దాకా చరిత్ర రచనలో అనేక ఖాళీలనూ, తప్పుడు అవగాహనలనూ గమనించారాయన వాటిని పూరించాల్సిన ఆవశ్యతను నొక్కి చెబుతూ పలు సలహాలనిచ్చారు.

28 డిసెంబరు 1948న 'ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమీషన్' రజతోత్సవ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ భారతదేశ ప్రాచీన చరిత్ర పూర్వయుగం నుండి ప్రారంభమవుతుందనీ, కానీ దానిని గూర్చి యింకా మనకు సరిగ్గా తెలియదనీ, సింధూనాగరికతకు దక్షిణ భారతదేశంతోనూ, మధ్య ప్రాచ్యంతోనూ ఉన్న సంబంధాలు స్పష్టంగా తెలియట్లేదనీ తెలిపారు. ప్రాచీన భారతదేశ చరిత్రకు సంబంధించిన అనేక చిక్కుముడులను విప్పిచెప్పడంలో సిరియా, ఈజిప్టు అధ్యయన శాస్త్రాలు (సిరియాలజీ, ఈజిప్టాలజీ) అందజేయగల తోడ్పాటును స్పష్టంగా గ్రహించిన ఆజాద్ వాటిని మనం పూర్తిగా వినియోగించుకోవాలని సలహాయిచ్చారు. మెసపొటేమియా, దాని చుట్టుపక్కల నాగరికతల నుండి బయల్పడిన సమాచారాన్ని భారతీయులు పూర్తిస్థాయిలో వినియోగించు కోలేకపోతున్న వైనాన్ని తెలియజేసి దానిని సరిదిద్దుకోవాలన్నారు. (సం. 3, పు. 267).

భారతదేశ చరిత్ర రచనలోని యింకో ఖాళీని గూర్చి తెల్పుతూ క్రీ.శ. 7-8 శతాబ్దాల నుండీ ఢిల్లీ సుల్తానుల పాలన ప్రారంభమయ్యే కాలం(13వ శతాబ్దం) వరకు గల కాలానికి సంబంధించిన చరిత్ర మనకు సరిగ్గా తెలియదని చెప్పారు. ఈ మధ్య కాలంలో మహమూద్ గజ్నవీ పశ్చిమోత్తర భారతంలో ఒక శక్తిగా ఎదిగాడనీ, కానీ ఆ కాలానికి సంబంధించిన సామాజిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించిన స్పష్టమైన అవగాహన మనకు లేదని స్పష్టపరిచారు. ఆ కాలానికి సంబంధించి పర్షియన్ భాషలో ఉన్న ఆకరాలన్నింటినీ యింత వరకూ ఉపయోగించుకోలేక పోయామన్నారు. ఈ కాలానికి సంబంధించి చరిత్ర రచనలో ఉన్న ఒక ప్రముఖ లోపాన్ని బయటపెడుతూ అది పూర్తిగా పర్షియన్ భాషలోని ఆకరాలమీదనే ఆధార పడుతున్నదనీ, అరబిక్ భాషలో ఉన్న ఆకరాలను నిర్లక్ష్యం చేస్తున్నదనీ తెల్పుతూ, ఆ భాషలో ఉన్న ఆకరాలను వాడుకోవడం ద్వారా ఆ కాలంనాటి భారతదేశ సాంఘిక, సాంస్కృతిక, వాణిజ్య, రాజకీయ పరిస్థితులను వెలికితీయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. (సం. 3, పు. 267-268)

మొఘలాయి సామ్రాజ్య క్షీణత, పతనాలకు సంబంధించి కూడా పూర్తిస్థాయిలో అధ్యయనాలు జరగలేదనీ, వాటి గూర్చి మనకు పూర్తిస్థాయి అవగాహన లేదని అన్నారు మౌలానా అజాద్. ఈ కాలాన్ని అధ్యయనం చేసిన ప్రముఖులైన చరిత్రకారులు దేశంలో లేకపోవడం గూర్చి ఆశ్చర్యపోయారు ఆజాద్. ఈ కాలాన్ని అధ్యయనం చేసిన పాశ్చాత్య చరిత్రకారుల రచనలు మిక్కిలి గందరగోళ పరిచేవిగా ఉన్నాయన్నారు. ఉదాహణకు వారు ఈ కాలాన్ని నిరంకుశమైనదిగానూ, అరాచకమైనదిగానూ ఒక వైపు వర్ణిస్తూనే యింకోవైపు కొంతమంది రాజుల్ని మంచి పరిపాలనా దక్షులుగా ప్రశంసించారన్నారు. ఒకవైపు ఆ కాలంలో అరాచకం విలయతాండవం చేసిందని ఈసడిస్తూనే యింకోవైపు ఆలివర్దిఖాన్, జాలిమ్ సింగ్, అహల్యాబాయి మొదలైన వారి పాలన యూరప్‌లోని పాలకులతో పోల్చదగిందని కీర్తించారన్నారు. ఒక వెపు హైదర్ అలీని నిరంకుశుడిగా నిందిస్తూనే యింకో వైపు అతన్ని ఉత్తమ పరిపాలనా దక్షుడిగానూ, అతని కాలంలో శాంతి వెల్లివిరిసినట్లూనూ రాశారన్నారు. ఆ కాలంలో ఆర్థిక కార్యకలాపాలు కూడా సాఫీగా సాగినట్లు ఒప్పుకొన్నారన్నారు. ఇలా పాశ్చాత్య చరిత్రకారుల రచనలు పరస్పర వైరుధ్యపూరితంగా సాగాయని స్పష్టం చేశారు ఆజాద్. అందుకే అనేక రకాలైన ఆధారాలు లభ్యమౌతున్నప్పటికీ ఈ కాలంనాటి చరిత్ర సరియైన అధ్యయనానికి నోచుకోలేదని నిష్కర్షగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. (సం.3, పు. 268)

భారతదేశానికి బ్రిటీషువారితో కల సంబంధానికి సంబంధించిన చరిత్రను పునర్మూల్యాంకనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు మౌలానా ఆజాద్. ఈ కాలానికి సంబంధించిన ఆధారాలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నప్పటికీ ఈ కాలానికి సంబంధించిన వివిధ అంశాలకు

సంబంధించి యిప్పటికీ ఒక నిష్పక్షపాతమైన అధ్యయనం జరగలేదన్నారు. బ్రిటీషు ప్రభుత్వానికి ఒత్తాసు పలికే చరిత్రకారులు బ్రిటీషువారి ప్రతి విధానాన్ని సమర్థించి దాన్ని ఒక స్వర్ణయుగంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారనీ, అలాగే భారత జాతీయవాద భావజాలంతో ప్రేరేపితులైన భారతీయ చరిత్రకారులు బ్రిటీషు విధానాలను పూర్తిగా నిందించి బ్రిటీషు ప్రభుత్వ పాలనా కాలాన్ని భారతదేశ చరిత్రలో ఒక చీకటి యుగంగా చిత్రీకరించారనీ, భారతదేశం బ్రిటీషు ప్రభుత్వ అధీనంలో ఉన్నంతకాలం ఒక నిష్పక్షపాత చరిత్ర రచనకు ఆస్కారం లేకుండా పోయిందనీ, ప్రస్తుతం భారతదేశం స్వతంత్ర దేశం కాబట్టి ఆవేశకావేశాలకూ, రాగద్వేషాలకూ ఆస్కారం లేని నిష్పక్షపాత, వస్తుగతమైన చరిత్రను రాసే సమయమాసన్నమైనదన్నారు. (సం. 3, పు. 268 & సం.6 పు. 206)

ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమీషన్ సమావేశానికి హాజరైన ప్రతినిధులనుద్దేశిస్తూ భారతదేశ చరిత్ర యావత్తూ రాయమనీ, అందులో మానవుల పరస్పర సహకారాన్నీ, సంయుక్త ప్రయత్నాల్నీ, నాగరికత, సంస్కృతి, కళలు, తత్వశాస్త్రం, మతం, మానవాళి అభివృద్ధిల గూర్చి నమోదు చేయమనీ కోరారు. ఇలా మానవ కార్యకలాపాల సమస్త పార్శ్వాలను వెలికి తీయడమే నిజమైన చరిత్ర అనీ, కేవలం యుద్ధాలు, సంఘర్షణ, రాజవంశాల చరిత్ర అసలు సిసలైన చరిత్ర కాజాలదనీ నిర్ద్వంద్వంగా ప్రకటించారు మౌలానా ఆజాద్. భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచనాశాస్త్రం అభివృద్ధి చెందని కాలంలో (మార్క్సిస్టు దృక్పథంతో డి.డి. కోశాంబి రాసిన రచనలు అప్పటికింకా వెలువడలేదు), 1970ల్లో కానీ అభివృద్ధి చెందని 'టోటల్ హిస్టరీ' భావనకి చాలా పూర్వమే చారిత్రక విధాత సంధ్యల్లో వెల్లివిరిసిన అసలు సిసలైన మానవ కథ వికసనాన్ని దాని అన్ని పార్శ్వాల్లో స్పృశించమని దిశానిర్దేశం చేసిన గొప్ప దార్శనికుడు మౌలానా ఆజాద్. (సం.3, పు. 270)

25.1.1955న మైసూరులో జరిగిన 'ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమీషన్' సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేసిన మౌలానా ఆజాద్ అందులో 1857 ''తిరుగుబాటు''కు సంబంధించి కూలంకషంగా చర్చించారు. స్థలాభారం కారణంగా మేము దానిని పూర్తిగా వివరించలేకపోతున్నాము. ఆజాద్ అభిప్రాయంలో అది కేవలం "సిపాయిల" తిరుగుబాటు కాదు సామాన్య ప్రజలు కూడా అందులో పాల్గొన్నారు. కానీ బ్రిటీషువారు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా దాన్ని కేవలం సిపాయిల తిరుగుబాటుగా మాత్రమే చిత్రీకరించారు.

ఇరవైయ్యవ శతాబ్ది ప్రారంభంలో కొంతమంది భారతీయులు 1857 ఉద్యమానికి సంబంధించిన చరిత్రలు రాశారనీ, కానీ వాటిని చరిత్రలనడానికి వీల్లేదనీ, అవి కేవలం రాజకీయ ప్రచారాలు మాత్రమేమననీ అభిప్రాయపడ్డారు మౌలానా ఆజాద్. (ఆజాద్ బహుశా వి.డి. సావర్కర్ మొదలైన వారి రచనల్ని ఉద్దేశించి ఇలా చెప్పారు.) వాళ్ళు 1857 ఉద్యమాన్ని భారత స్వాతంత్ర్య సమరంగానూ బ్రిటీషు వారికి వ్యతిరేకంగా చాలా ప్రణాళికతో భారతీయులు లేవదీసిన ఉద్యమంగానూ చిత్రీకరించ ప్రయత్నించారనీ, కానీ యిది అవాస్తవమనీ చెప్పారు. ఒక స్పష్టమైన ప్రణాళికంటూ ఏమీ ఉండింది కాదనీ, అది నాయకుల ప్రేరేపణవలన జరిగిన ఉద్యమం కాదనీ, వంద సంవత్సరాలు సాగిన ఈస్టిండియా కంపెనీ పాలన పట్ల అసంతుష్టులైన సామాన్య ప్రజలు ఒక్కసారిగా వెల్లువలా లేవదీసిన ఉద్యమమనీ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. (సం. 8, పు. 15-19)

చారిత్రక పరిశోధనకూ, భాషల అధ్యయానికీ మధ్య ఉన్న గాఢమైన సంబంధాన్ని చక్కగా గుర్తించారు మౌలానా ఆజాద్. 16 జనవరి 1948న కొత్త ఢిల్లీలో జరిగిన 'ఆల్ ఇండియా ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్' లో ప్రారంభోపన్యాసం చేస్తూ భారత దేశ చరిత్ర, సంస్కృతుల్ని అధ్యయనం చేయడానికీ, అర్థం చేసుకోవడానికీ ప్రాచ్య భాషల అధ్యయనం అత్యంతావశ్యకమని నొక్కి చెప్పారు.

కానీ భారతీయ విశ్వవిద్యాలయాల్లో సంస్కృతం, అరబిక్, పర్షియన్ మొదలైన భాషల అధ్యయనం పట్ల తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి కన్పిస్తోందని వాపోయారు. (సం. 3, పు. 123) భవిష్యత్తులో ఈ లోపాన్ని సవరించాలన్నారు.

చారిత్రిక పరిశోధనకు ఆకరాలనందించే జాతీయ అభిలేఖాగారాన్ని చాలా పటిష్టంగా అభివృద్ధి చేశారు మౌలానా అజాద్.

భారత జాతీయోద్యమంలో ఘనమైన పాత్ర పోషించినప్పటికీ ఆలోచనల దృష్ట్యా ఆజాద్ విశ్వనరుడు. అందుకే ప్రపంచ ఐక్యతనూ, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్నీ, ప్రపంచ మానవుల మధ్య మానసిక ఐకమత్యాన్ని బలంగా ఆకాంక్షించారు. ప్రాచ్య - పాశ్చాత్య అనే ద్వంద్వాన్ని ఖండించి, నాగరికతల మధ్య వ్యతిరేకత, ఘర్షణ అనే వాదనను తిరస్కరించారు. ఈ లక్ష్యసాధనకు చరిత్ర రచన, బోధనల్లో సమూలమైన మార్పులు జరగాలనీ, చరిత్ర రచన విశ్వమానవ ఏకత్వాన్ని సాధించే దిశగా సాగాలనీ వాంఛించారు. భారతదేశ చరిత్ర రచనలోని అనేక ఖాళీలను గుర్తించిన ఆజాద్ చారిత్రక పరిశోధనలకు దిశానిర్దేశం చేశారు. చరిత్ర అంటే కేవలం సంఘర్షణలూ, యుద్ధాలూ, రాజవంశాల చరిత్రా కాదనీ, మానవాళి సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక, కళారంగాలలో అంటే మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలో సాధించిన పురోభివృద్ధిని చెప్పేదే అసలు సిసలైన చరిత్ర అని భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచనాశాస్త్రం పురుడుపోసుకోకముందే చరిత్రకు కొత్త నిర్వచనం ఇచ్చారు. చారిత్రక పరిశోధనకూ, భాషల అధ్యయనానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించి భారతదేశ చరిత్రను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వివిధ ప్రాచ్య భాషల్ని అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. నిష్పాక్షికత, వస్తుగత దృష్టి చరిత్ర రచనకు గీటురాళ్ళని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. చరిత్ర అధ్యయనం, చారిత్రక పరిశోధనల ద్వారా సత్యాన్ని కనుగొనాలన్న సత్యాన్వేషకుడు- మౌలానా అబుల్ కలాం ఆజాద్.

డాక్టర్ షేఖ్ మహబూబ్ బాషా
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ 9160579705
డాక్టర్ మొహమ్మద్ కరీం
రిసర్చ్ అసిస్టెంట్, ఐ.క్యూ.ఏ.సీ.,
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ
హైదరాబాద్ 9440445098

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# తెలుగు రాష్ట్రాలలోని తూర్పుకనుమలలో గిరిజనుల సంప్రదాయాలు




మన దేశీ/గిరిజన సంస్కృతి జ్ఞానస్వరూపాన్ని ఆవిష్కరించడం, అధ్యయన పద్ధతులను అభివృద్ధి చేయడం సామాజిక స్పృహగల విమర్శలు, రచనలు చేయడం రచయితల బాధ్యత. 'రచనల వల్ల రచయితకు పేరు వస్తుందిగాని ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు' అంటారు కొడవటిగంటి కుటుంబరావు. కానీ రచయితలు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తారు. వారి మద్దతులేకపోతే చట్టాల అమలుకు తగిన వాతావరణం ఏర్పడదు. వాటి అమలు అరకొరగానే మిగిలిపోతుంది. కాబట్టి అకాడమీలు/రచయితల వేదికలు ఈ విషయాలు పరిణామాలపై అవగాహన పెంచడానికి కార్యశాలలు నిర్వహించాలి. నేటి జీవన ప్రమాణాల లెక్కలో గిరిజనులు వెనుకపడినా, జ్ఞానసంపదలో మార్గదర్శకులుగానే ఉన్నారు. జీవ, సాంఘిక శాస్త్రాలతోపాటు విద్యార్థులకు బోధించటానికి అనువుగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ ప్రధానోపాధ్యాయుల కరదీపిక ప్రచురించింది. ఆ ఒరవడిలో మన పదకోశాలను నవీకరించి, ప్రచారంలోకి తెచ్చి, చట్టాల అమలు సుగమం చేయాలి. పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలి....

**సా**హిత్య అకాడమి 1992లో ప్రచురించిన వ్యాస సంకలనం 'నేటివిజం', వలసపాలనలో విదేశీ విచారధార, దేశి సంప్రదాయాలను అణగదొక్కిందని, వాటిని పునరుజ్జీవితం చేయాలని పిలుపు నిచ్చింది. ఈ వలస చదువులను వదిలించుకోవాలని లాటిన్ అమెరికన్ దేశాలలో ఇవాన్ ఇల్లిచ్, పాలో ఫ్రియరి ఉద్యమించారు. చామ్స్కి ఈ ఉద్యమానికి మద్దతు నిచ్చారు.(ఆ దేశాల శాస్త్రవేత్తలతో చామ్స్కి ప్రసంగాల సంకలనం 'ఇండిజినస్ రెసిస్టన్స్' ఓరియంట్ బ్లాక్ స్వాన్ 2010లో ప్రచురించింది.) ఆయా తెగల జ్ఞానంలో క్రమాన్ని ఆవిష్కరిస్తూ లెవిస్ట్రాస్ వంటి మానవశాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ప్రపంచం దృష్టిని ఆకర్షించసాగాయి.

తెలుగువారు అందరికంటే ముందు 1960లోనే మాండలిక వృత్తి పదకోశాలు తయారు చేసుకున్నారు. జానపద వాఙ్మయం సేకరించారు. ఊర్ల పేర్లమీద పరిశోధనలు చేశారు. కానీ ప్రపంచీకరణ ప్రభావం వల్ల కావచ్చు ఆ కృషి కొనసాగించలేకపోయారు. భారతదేశం ఆసియాలో కాక యూరోపులో భాగంగా నెహ్రూ భావిస్తాడంటూ, ఇటువంటి అంతర్జాతీయ దృక్పధాలను, మావో పరిహసిస్తాడు. ఈ విషయాల మీద పనిచేసే మానవ శాస్త్రవేత్తలకు తగినంత భాషా, సాహిత్య జ్ఞానం లేదు. అలాగే జానపద విజ్ఞానం అధ్యయనం చేసేవారు విజ్ఞాన, మానవ శాస్త్రజ్ఞులను కలుపుకొని పోరు. చట్టాల అమలుకు తగ్గట్టుగా తమ పరిశోధనలను మలుచుకోవటానికి తగిన అనుభవం తక్కువ. జీవ వైవిధ్యం, సతత హరిత విప్లవం,సేంద్రియ వ్యవసాయం, సుస్థిర అభివృద్ధివైపు మళ్ళటానికి ఆరాటపడుతున్న ఈ సంధి దశలో తెలుగు భాషలో అందుకు తగిన పదసంపదను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చి మన జాతి ఉనికిని చాటుకోటంలో ఈ తరం వెనుకపడిపోకూడదు.

ప్రపంచీకరణలో ప్రాంతీయ వైవిధ్యాలున్నాయి. (అల్లోపతీ/హోమియోపతీ/ఆయుర్వేదం/ఆక్యుపంచర్; సౌరమానం/చాంద్రమానం; క్రీస్తు/హిజ్రీ/శాలివాహన శకాలు గడియలు/గంటలు పౌండ్లు/డాలర్లు) ఏ ప్రాంతం పెత్తనం చేస్తుంటే, వారి భాషకు/పరిభాషకు, ఆదరణ/గిరాకీ పెరుగుతుంది.అయితే దేశి భాషాభిమానులు తమ ప్రత్యేకత, విశేషతలను, వాటి ఔచిత్యాన్ని, అవసరాన్ని గుర్తుచేస్తుండాలి.లేకపోతే 'గుడ్డిగా శ్రమించే వర్గం, ఆ శ్రమను నిర్దేశించే వర్గం మాత్రమే మిగులుతాయి'(సైన్సు సాహిత్యం: ప్రజాసాహితి.ఫిబ్రవరి 2018)

జాతి అస్తిత్వంలో పరిసరం విడదీయ

లేనిది. మానవుడు శాస్త్రంద్వారా ప్రకృతిలోకి ప్రవేశిస్తాడు.ప్రకృతి కళద్వారా మానవునిలోకి ప్రవేశిస్తుంది.

తూర్పుకనుమలు, తూర్పుతీరం, రాయలసీమ, దక్కన్ పీఠభూమి-ఇవి స్థూలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాలు. ఒడిసా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలోకి విస్తరించిన తూర్పుకనుమలను 'మల, మాల్, మలియా, మలై, మలయ' పర్వతాలుగా పిలుస్తారు. గోదావరి విశాఖ జిల్లాలలో ఈ కనుమలను మన్నె కొట్టాలుగా, రాయలసీమలో మెట్టప్రాంతాలను బోయకొట్టాలుగా పిలిచేవారు, కొండలు కనుమలను నల్లమల, ఎర్రమల, వెలిగొండ, పాలకొండ, లంకమల, తిరుమలలుగా పిలుస్తారు. మన్నెపోళ్ళు-పల్లపోళ్ళు అని ఆయా జనాలను వారి ప్రత్యేకతలను, పద్ధతులను ఉత్తరాంధ్రంలో ఎంచుతుంటారు.

అధిక వర్షపాతం, మంచు, సారవంతమైన ఎర్రమట్టిగల విశాఖమన్యంలోని వేణం(కొండ వెన్ను), జవుకు, కొమ్ము, ఎగురు, దిగురు, ఉరుకు, పనుకు, లొద్ది, లోవ, గొంది, గండి, బయలు, జోరె(కాలువ) మొదలైన భూభాగాలలోని 'కారడవులు' మామిడి, నేరేడు, పనస, జీలుగు, బూరుగు, చింత మొదలైన మెత్తనికలపగల చెట్లతో నిండి వుంటాయి.'నీరు పడితే లోయ-ఎండిపోతే గొంది','ఉట్టితే(కల్లు ఇస్తుంటే) చెట్టు(జీలుగు)-లేకపోతే మొట్టు'వంటి వివరణలు వినిపిస్తుంటాయి..

పికిలిపిట్టవేనాలు, నెమలాట పనుకులు, పులిబరుకుడు మాను వంపులు, కణుజు నాకిన జాడలు. తుమ్మెదల బొక్కలు. పనసలోవలు, నేదుబొక్కలు, గుర(అడవి గేదె) మామిడులు, చింతగొందులు, నేరేడు వలసలు. చేవడి బసలు(జీలుగు కల్లు తాగే తావులు). కొర్రకొత్త (కొత్తగావచ్చిన కొర్ర పంట తినే చోటు)జరుపుకునే 'జాకరి మెట్ట'. ఆడవారితగవులు చేసే చోటు 'మగనాలి మెట్ట', ఇల్లు మెత్తుకోవడానికి, అలుకుకోవడానికి కావాల్సిన మట్టి దొరికే చోట్లు 'ఎర్రమట్టి గొయ్యి' 'సున్నపు గొంది'.తరచు వినవచ్చే తావులపేర్లివి.

అవకాశానికి తగినట్లుగా మలుచుకున్న పోడు, గరువు, దొడ్డి, జోరె పొలాలలో ఆహారపంటలతో పాటు, పసుపు, పిప్పలి, అల్లం, అనాసవంటి వాణిజ్య పంటలుకూడ పండిస్తారు. ఈ మన్యంలో సీలేరు ప్రాంతాన్ని 'జాడి దేశం-జలుబు దేశం'గా(ఝూడ్-చెట్టు-అడవి)గూడెం, చింతపల్లి మండలాలను 'చలి గూడెం-పులిగూడెం'గా, పసుపు పండే గంగరాజు మాడుగుల మండలాన్ని 'పసిబయలు'గా, ఈ మండలంలోనే కొండపట్టెన మినుములూరు వరకు విస్తరించిన ఆరుగ్రామాలను 'ఆరుళ్లె'గా పాడేరుమండలాన్ని 'దొంతికుండ దోరసి'(కుండమీద కుండగా ఆహార సమృద్ధి),ముంచెంగిపుట్టు, పెదబయలు మండలాలను కోదు తెగవారు 'కోట్ల'గా, హుకుంపేట, అరకులోయ మండలాలను 'బయలు' అని దిగువ ప్రాంతాలను 'గాళ్ళ' పిలుచుకుంటారు. సమతల ప్రదేశాలను బయలుగా చెప్పుకుంటారు. ఆట బయలు, వేట బయలు, గొట్నబయలు.

ఇటిం(పండుగ. ఏప్రిల్), బైశాగి, అవిటి(మే- అవిటికి వేస్తే ఆకైన నాటుతది), దూల అవిటి(జూన్-పిట్టపిల్ల ముసురు),పెద్ద అవిటి, బందపని, మునుకోలు(జూలై- మునుకోలుకు ముదుకులోతు కాలువలు), కన్నె( ఆగస్టు-కన్నె-కొండపిచ్చుక దిగే నెల, కదులు కాలవలు), దసరా( సెప్టెంబరు-ధనకాలు,ధన,ధన వర్షం చప్పుడు) ,సవితి (నవంబరు-సవితికి తప,తపలు) పలకం(డిసెంబరు-పలకానికి పంటలు), సంకురాత్రి(జనవరి- పంటలకు చివరి పండుగలు), శివరాత్రి(ఫెబ్రవరి-జాతరలు) పొగును(మార్చి-పొక్కు వర్షం);

ఈ నెలల పేర్లు, వాటిమీద నానుడులు, ఆయా ప్రాంతాల వాతావరణం, సంస్కృతితోపాటు మారుతుంటాయి.

కొండలనుండి ఉరవడిగా పారే 'జోరె'లతోమట్టి,రాళ్ళూ కొట్టుకుపోవడాన్ని 'ఉగంకొట్టడం'(ల్యాండ్ స్లయ్డ్)అంటారు. మద్ది మంచు(దసరా), గాందు(సవితి), కావిరి, ముడిమంచు(పలకం), బుగ్గిమంచు(సంకురాత్రి) కావిరి (పొగమంచు-మార్చి) ఇవి మంచుల్లో




కొన్ని రకాలు.

దక్కన్ పీఠభూమిని తొలుచుకుంటూ ప్రవహించే గోదావరిలోయలో నది ఒడ్డును కొమ్ము, కొండను గట్టు అంటారు. పాపికొండలు, ఉప్పనపల్లి, కూటూరు గట్లు, వాలి సుగ్రీవు కొండలు, పెద్దకొండ, దుమ్మకొండ, నాగులకొండలతో కిక్కిరిసిన ఈ అడవుల మధ్య చిన్న, చిన్న బయళ్ళను లంకలు(బొడ్లంక, కొడవటిలంక, నల్ల సామ లంక) అంటారు. వీటి మధ్య ప్రవహించే జలసంపదతో పరిసరాలన్నీ ధారకొండలు, ధారవాడలు, ధారగడ్డలు, గ్రామం మధ్యలో ఆటబస, పండుగ బస, గొట్టిబసలు.

దేశవిడి(జనవరి)-దేశవిడికి దేశమంతా పండుగ విడిపోతుంది(కొత్తపంటల పండుగలన్నీ చెల్లిపోయి, తినడం మీద నిషేధాలు తొలగిపోతాయి). బొడ్డం (ఫిబ్రవరి)ఆ చెట్టు(ఇండియన్ కోరల్ ట్రీ) పూలు పూసేనెల, కొత్తమాస(మార్చి)భూదేవి/విత్తనాల పండుగ, మామిడి కొత్త పండుగ(ఏప్రిల్), ఎర్రగాయ రొండి(మే) మామిడి కాయ ఎర్రబడే రోహిణినెల. ఈ నెలలో కాసే ఎండలను 'కనుసు మొరకల ఎండ'అంటారు.(కనుసు చెవులు ఎండిన ఆకులవలె ఉంటాయి). దూలవిటి/డికి (జూన్) మామిడిపండ్లు దులదుల రాలతాయి.పెద్దవిడికి(జూలై) మామిడి పేరు లేకుండా పోతుంది.

మునుకోలుకు(ఆగస్టు) ముద్ద(తొలిపంట సామ అందుతుంది).
కన్నె(సెప్టెంబరు)కన్నెపిట్ట దిగిందోయ్- పప్పులు జల్లాలె. (ఊడుపుల కాలం చెల్లింది, పప్పు పంటలు వేసే అదను మొదలైంది). దసరాకు(అక్టోబరు) 'కొత్తల(పంటల) పాతల మధ్య ఎడం-డాకు డాకు ఇబ్బందులు. పిట్టకు బొట్టకు దీము మెర్రని (ఎరదొరకని) కాలం'. చేలు పొట్ట వేస్తుంటాయి. తిండి దొరకదు. కానీ చేలు తిని బలిసిన 'దసరాకు చెవుల పోతులను(కుందేళ్ళను) కొరకవలె'నని అనుకుంటుంది బవరదు (గండుపిల్లి). ఈ కాలంలో కొవ్వెక్కిన అడవి పందుల 'బూరు తీస్తే బుక్కెడు కొవ్వు'. సవితి (నవంబరు-చల్దికూటికి బాల ఏడవని కాలం) పలకం (డిసెంబరు. జల్లునపంట) ఇవి ఆయా నెలలలో ఋతువులు.

ఇలా పక్క పక్కనేగల ఉత్తరాది తూర్పుకనుమలలోగల విశాఖ మన్యం, గోదావరి మన్యంలో కొన్ని పోలికలు, ప్రత్యేకతలు ఉన్నాయి. ఇక దక్షిణాన రాయలసీమలో ఈ కనుమలు, తక్కువ వర్షపాతం, రాతినేలలలో గడ్డి-గాదం మధ్య సరి, సెల, కురవ, కట్టువ, సారవ, బరకలలో పెరిగే ఏపె, బిల్లుడు, చంద్ర, ఇప్ప, చెట్ల 'చిట్టడవి'తో నిండి ఉంటాయి. రెండు తెలుగు రాష్ట్రాలలోగల నల్లమలలో మంతనాలమ్మ, వెలుగోటి, నంది, జ్యోతి, దాపల్లె, కాకుల కనుమలు ముఖ్యమైనవి. కనుమ/కురవ/బండ, కింద/మీద అంటుంటారు..'గుట్టలచేను కురవ-గుండెల్లో గస' అని నానుడి.

సరులలో,చెట్లలో,పుట్టబొక్కలలో రకరకాల తేనెటీగలు; పెర, తొడిది, కన్నెగుల్ల, జుంటి, మొసరు, పట్లు పెట్టుకుంటాయి. 'అడవిలో తీపి(రాతి) పగుళ్ళలో ఉంటుంది' అని నానుడి. చాగ, అల్లి, చింత మట్టలలో, పరికి, కోరిందకంపలలో, ఎలకనక్కరిపొదలలో అడవిజంతువులు కాపురంచేస్తాయి. సెల, గుండం, ఎత్తిపోతలు, బుగ్గ, దూకుడు, పడియలు, గోబెలు, పాతనీళ్ళు(గుండంలో,మడుగులో నిలవనీళ్ళు-పులులు వేసవిలో ఇక్కడ సేద దీరుతుంటాయి). ఇక్కడి నీటి వనరులు. ఇక్కడి ఆదిమ జాతులు ఆహారసేకరణ పశుపాలన మీద ఆధారపడి బతుకుతున్నాయి.

ఇక్కడ 'ఉసిల్లకు కానుగ చెట్టుకాసినప్పుడు కాళ్ళు వస్తాయి. రేల పూసినప్పుడు రెక్కలు వస్తాయి. ఏపె పూసినప్పుడు ఏగిబండలపై(పెనం) ఎగురుతాయి' తేనెటీగలకు 'కోరిందలు పూసేటప్పుడు కాటు తక్కువ-ఏపె పూసేటప్పుడు ఉట్టితట్టలే-ఎర్రబలుసు పగిలినప్పుడు కాటు ఎక్కువ'. ఇక్కడపెరిగే 'నెండ్రగడ్డిమీద అన్నిజంతువులు బలుస్తాయి. చీడ గడ్డిమీద ఉడుం బలుస్తది. ఏడు ముండ్ల గడ్డిమీద కనుసుపోతు బలుస్తది'.

పులి మా పెద్దకొడుకు(చిన్నవాళ్ళను ఏడిపిస్తాడు)రేచులు తమ్ముల్లు,జిత్తులమారి నక్కమూర్ఖుడు పంది,గుడ్డేలుగు మా బావలు. ఉడుము- బండ భీముడు ఇవి చెంచులు కలుపుకునే వరసలు.

ఇలా అటు తూర్పుకనుమలలో ఉత్తరాన ఉన్న 'కారడవులలో' దక్షిణాన ఉన్న 'చిట్టడవులలో' గల జంతువుల ఉనికిని 'కాకులుదూరని కారడవులు' (జెముడు కాకులు తప్ప ఊరకాకులు చేరవు),' పులులు దూరని పుల్లటడవులు(పుల్లలు కాలిపంజాలో గుచ్చుకుంటాయి). చీమలు దూరని చిట్టడవులు(పండ్ల తీపికి చేరే చీమలు ఆ చెట్లు అంతగా లేని చోటికి వెళ్ళవు). గద్దలు చేరని గిద్దుటడవులు (ఆకాశంలో తిరుగుతూ వేటాడే గద్దలు చెట్ల మధ్య వేటాడే గిద్దులు(గుడ్లగూబలు)ఉండే కారడవిలోకి దిగలేవు. గిద్దులు చేరని గద్దవేనాలు(గిద్దులు వేనంపైకి వెళ్ళలేవు) వంటి నానుడులు సూచిస్తాయి. చిత్తడి నేలలతో నిండిన కారడవులలో అడవి దున్నల, చిట్టడవుల్లో పులుల అభయారణ్యాలను ప్రభుత్వం గుర్తించింది.' పులికి మల అండి-మలకు పులి అండ'అని సామెత.

ఇటువంటి పరిసరాలలో సహవాసం చేస్తున్న సంస్కృతి ముద్రను పొదివికొన్న మన్నెపోల్ల పొడుపుకథలు అడవికి ఆటగాడు'(నెమలి)' చేనుకు చేటుగాడు'(కుందేలు)' కొండకు కోలగాడు (వేణంకొండల వెంట అరుచుకుంటూ పోయే ఈ 'వేనపుగొగ్గడి' అడవిజంతువుల నౌకరు) 'దారికి దడ్డడు' (దారివెంట నడిచే బలశాలి-పులి)

గిరిజనుల పక్షి దర్బారులో 'మేడమీద రాచపాప'(చిటారుకొమ్మల్లో ఉండే మైనా పిట్ట యువరాణి), గుంజి(గుడ్లగూబ) రాజు. బింగిరాజు(బట్టిపిట్ట) మంత్రి, నెమలి నర్తకి. తిత్రిక పిట్ట మంత్రగత్తె( ఈ పిట్టవేసే రెట్టలో గింజలు మొలిచి పెరిగిన చెట్లు, బదనికలు ఆశ్రయమిచ్చిన చెట్టుతో కొన్ని సహజీవనం చేస్తాయి.కొన్ని చంపుతాయి).

శాస్త్రం,కళ పరస్పరం పూరకాలు అంటాడు క్రిష్టఫర్ కాడ్వెల్. మెదడులో ఉండే రెండు భాగాలలో, ఒకటి గతి తార్కికతతో విశ్లేషిస్తుంటే, మరోభాగం భావుకతతో ముందుకు సాగుతుంది. ఈ భావుకత, సాగదీతలలో భ్రమ ప్రమాదాలను అందంగా ఆలంకారికులు ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకం, విరోధాభాసలుగా వర్గీకరించి, కవిసమయాలుగా చలామణి చేస్తుంటే; వీటిలో అసంబద్ధతలను మన న్యాయాలు, శాఖాచంక్రమణం, కప్పదాటు, బాదరాయణ సంబంధం, కాకతాళీయం, బీరకాయపీచు, ఎండమావి, మోకాలికి బట్టతలకు ముడివేయడంగా ఎండగడుతుంటాయి. పెద్దలు తగవులు తీర్చేటప్పుడు వీటిని ఉదహరిస్తూ వాదనలను గాడిలో పెడతారు. ఎదురు ప్రశ్నలు/శాస్త్రాలు వేసి దారికి తెస్తారు. బదనికలకు ఔషధ గుణాలు ఉండవచ్చు గాని, వాటితో చెడుపులు చిల్లంగులు చేస్తారనే తంతులనుబట్టి పెద్దలు తీర్పు ఇవ్వరు. వాటిని పండుగ తంతులకు, వ్యక్తిగత నమ్మకాలకే పరిమితం చేస్తారు.

గిరిజనప్రాంతంలో గ్రామసభలకు సంప్రదాయ పద్ధతిలో తగవులు తీర్చుకునే అధికారం చట్టం ఇస్తుంది. కాబట్టి 'సదసద్వివేక చతురత' గల ఇటువంటి తీర్పులను సేకరించి నమూనాలుగా పేర్కోవాలి.

(ఈవ్యాసంలో కొంత ప్రజాసాహితి జులై 2018 సంచికలో వచ్చింది.)

డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖరరావు
99496 05141

# భాషా ధ్వనులు - రోమన్ లిపి

**భావ** వ్యక్తీకరణ కోసం మానవుడు ఒక క్రమ పద్ధతిలో ఉపయోగించే ధ్వనుల సముదాయం భాష. భాషలు ఏర్పడ్డ తర్వాత కొన్ని వేల సంవత్సరాలకు లేఖనవిధానం వచ్చింది. మానవ పురోగమన దిశలో మనిషి రాయడం నేర్చుకోవడాన్ని గొప్ప పరిణామక్రమంగా భావించవచ్చు. రాత లేకపూర్వం మానవుడు తాను సంపాదించిన జ్ఞానాన్ని మౌఖికంగానే తరవాత తరాలవారికి అందించేవాడు. రాత మూలకంగా దూర శ్రవణం సాధ్యమయింది. "గొప్ప జ్ఞాపకశక్తి కన్న వెలిసిపోయిన సిరాచుక్క మిన్న" అన్నది చైనా సామెత. రాతను ఏ ఒక్కరూ కనిపెట్టలేదు. పూర్వులు వాడుతూ వచ్చిన వాటిని నేడు ఉపయోగించు కొంటున్నాం. భాషకూ లిపికీ సంబంధం లేదు. ఏ భాషనైనా ఏ లిపిలో నైనా రాయవచ్చు. ఒక భాషకి ఒక లిపి పారంపర్యంగా వాడుకలో స్థిరపడింది.

భాషలు వేరైనా మానవ ముఖయంత్రం(నోరు) ఒకే విధంగా వుంటుంది. నోటి నుండి ప్రయత్నపూర్వకంగా గాలిని విడిచిపెట్టేటప్పుడు నోటిలోని కండరాలు చెందే మార్పుననుసరించి ధ్వనులు వెలువడతాయి. అందుచేత భాషాశాస్త్రవేత్తలు ధ్వనుల ఉత్పత్తి స్థానాన్ననుసరించి ధ్వనులను వర్ణించి వాటికి అక్షర రూపం ఇచ్చారు. ఈ విధమైన భాషా ధ్వనుల వర్ణనను పాణిని అష్టాధ్యాయిలో వివరించాడు.

ఊపిరితిత్తుల నుంచి వెలువడే గాలి గొంతుకలోను, నోటిలోను పీడనకు గురికావడం వల్ల భాషాధ్వనులు పుడతాయి. స్వరపేటికలోని నాదతంత్రులు దగ్గరగా వచ్చి కంపించడం ద్వారా నాదధ్వనులు వెలువడతాయి. దూరంగా వుంటే శ్వాసధ్వనులు వెలువడతాయి. గొంతుముడి దగ్గర చెయ్యిపెట్టి 'క, ప,' పలకండి. తరువాత 'గ, బ' లు పలకండి. 'గ, బ' లు పలికేటప్పుడు కలిగే కంపనాన్ని మీరు గ్రహిస్తారు. 'క, ప,' లు శ్వాసాలు. 'గ, బ' లు నాదాలు.

ఊపిరితిత్తులనుంచి నోటిలోకి వచ్చిన గాలి నోటిలో ఏదో ఒక చోట నిరోధింపబడుతుంది. నోటి పైభాగంలోని ఏదో ఒక స్థానాన్ని నోటి క్రింది భాగంలోని ఏదో ఒక కదిలే అవయవం తాకడం వల్ల గాని, సమీపించడం వల్ల గాని గాలి నిరోధింపబడుతుంది. ఈ నిరోధం హల్లుల ఉచ్చారణలోనే వుంటుంది. నోటిలో కదలని భాగాన్ని **స్థానం** అంటారు. కదిలే అవయవాన్ని **కరణం** అంటారు.

గాలిని నోటినుంచి ఒక్కసారిగా వదలుతున్నామా, మెల్లమెల్లగా వదలుతున్నామా, నాలుక పక్కల నుంచి వదలుతున్నామా అని చెప్పడాన్ని **ప్రయత్నం** అంటారు. ప్రయత్న భేదాలు చాలా ఉన్నాయి. స్థాన కరణాల చేత గాలి కొంతసేపు పూర్తిగా నిరోధింపబడి, ఆ తరవాత వదలడం ఒక ప్రయత్నం. ఈ విధంగా పుట్టే ధ్వని **స్పర్శం**. స్థాన కరణాల చేత గాలి కొంతసేపు నిరోధింపబడి ఆ తరవాత మెల్లమెల్లగా వదలడం ఒక ప్రయత్నం. ఈ విధంగా పుట్టే ధ్వని **ఊష్మం**. విడిచిన గాలిని నోటినుంచి, ముక్కునుంచి వెలువడే ధ్వని **అనునాసికం**. ఇంకా అనేక భేదాలున్నాయి. నోటిలోని వివిధ భాగాలను కావలసిన రీతిగా పనిచేయించడం ద్వారా భాషాధ్వనులను ఉత్పత్తిచేయవచ్చు. **అభ్యాసం ద్వారా ఎవరైనా ఏ భాషాధ్వనినైనా పలకగలరు.**

**భాషా శాస్త్రవేత్తలు ధ్వనులను వర్ణించే విధం.**

**అచ్చులు:-** నోటికుహరం నుండి చెప్పుకోదగ్గ ఆటంకం లేకుండా వెలువడే గాలి వలన అచ్చు ధ్వనులు వినిపిస్తాయి. ఇవి సాధారణంగా నాదాలు. అచ్చుల అంతర్విభజన చెయ్యడానికి ఈ క్రింది విషయాలు తోడ్పడతాయి.

1. నాలుక ఎత్తునుబట్టి తెలుగులో అచ్చులు ఉన్నతాలు, మధ్యమాలు, నిమ్నాలు. అని 3 విధాలు. ఇ, ఈ, ఉ, ఊ, లు ఉన్నతాలు. ఎ, ఏ, ఒ, ఓ, లు మధ్యమాలు. అ, ఆ, లు నిమ్నాలు. భాషా శాస్త్రవేత్తలు అచ్చులను ఇంకా సూక్ష్మంగా ఉన్నతాలు, ఈషదున్నతాలు, మధ్యమాలు, నిమ్నతరమధ్యమాలు, ఈషన్నిమ్నాలు, నిమ్నాలు అని 6 విధాలుగా విభజించారు.

2. నాలుక ముందు, మధ్య, వెనుక భాగాలను బట్టి తెలుగులో అచ్చులు 3 విధాలు. 1. ఇ, ఈ, ఎ, ఏ, లు అగ్రాచ్చులు. వీటి ఉచ్చారణలో నాలుక ముందుభాగం పైకి లేచి వుంటుంది. 2. ఉ, ఊ, ఒ, ఓ, లు పశ్చిమాచ్చులు. వీటి ఉచ్చారణలో నాలుక వెనుకకు లాగబడి వుంటుంది. 3. అ, ఆ, లు కేంద్రాచ్చులు (మధ్య). వీటి ఉచ్చారణలో నాలుక ముందుకు సాగక, వెనుకకు లాగబడక తటస్థంగా (మధ్యస్థంగా) వుంటుంది.

ఇవన్నీ హ్రస్వాచ్చులు. వీటి సంఖ్య 6 × 3 = 18. హ్రస్వాచ్చులకు మాత్రమే ఐ. పి. ఎ. సంకేతాలు వుంటాయి. దీర్ఘాలను విశేష చిహ్నాల ద్వారా తెలియజేస్తారు.

3. అచ్చుల ఉచ్చారణలో పెదవులు గుండ్రంగా వున్నాయా, సాగి ఉన్నాయా అని మళ్ళీ రెండు విధాలుగా విభజించవచ్చు. తమిళులు "మీరు" (miiru) అన్న తెలుగు మాటలోని చివరి 'ఉ' కారాన్ని పెదవులు సాగదీసి పలుకుతారు. ఈ మాటను భాషా శాస్త్రవేత్తలు miirU అని రాస్తారు. తెలుగు ఉచ్చారణలో పెదవులు గుండ్రంగా వుంటాయి. అలాగే అచ్చులు అనునాసికాలా, కావా అంటూ విభజించవచ్చు. హిందీలోని 'కహా=చెప్పెను, కహాఁ=ఎక్కడ' అన్న పదాలలో రెండవ పదంలోని చివరి 'ఆ' అనునాశికం.

**హల్లులు:-** 1.స్థాన 2.కరణ 3.ప్రయత్నం భేదాలననుసరించి భాషాశాస్త్రజ్ఞులు హల్లులను వర్గీకరించారు. మళ్ళీ వీనిలో కొన్ని శ్వాసాలు, కొన్ని నాదాలు, ఈ విధంగా హల్లు ధ్వనులు 60 కి పైగా ఉన్నాయని భాషాశాస్త్రజ్ఞులు గుర్తించారు. ఏ ఒక్క భాషలోనూ ఇన్ని ధ్వనులు వుండవు. ఒక్కొక్క భాషలో పరిమిత సంఖ్యలోనే హల్లులు ఉంటాయి. (భారతీయ భాషలలో కొన్ని ధ్వనులు అల్ప

ప్రాణాలు కొన్ని మహా ప్రాణాలు).

**తెలుగులోని కొన్ని హల్లుల వర్ణన చూడండి..**

ట్-1. స్థానం- మూర్ధం. (నోటి పైభాగం) 2.కరణం- పైకి లేచిన నాలుక కొన. 3. ప్రయత్నం- స్పర్శం. 4.శ్వాసం. 5.అల్పప్రాణం.

త్-1. స్థానం- పై దంతాల వెనుక భాగం. 2.కరణం- నాలుక చివర. 3. ప్రయత్నం- స్పర్శం. 4.శ్వాసం. 5.అల్పప్రాణం.

థ్-1. స్థానం- పై దంతాల వెనుక భాగం. 2.కరణం- నాలుక చివర. 3.ప్రయత్నం- స్పర్శం. 4.శ్వాసం. 5.మహాప్రాణం.

ద్-1. స్థానం- పై దంతాల వెనుక భాగం. 2.కరణం- నాలుక చివర. 3.ప్రయత్నం- స్పర్శం. 4.నాదం. 5.అల్పప్రాణం.

ప్-1 .స్థానం- పై పెదవి. 2.కరణం- క్రింది పెదవి. 3.ప్రయత్నం- స్పర్శం. 4.శ్వాసం. 5.అల్పప్రాణం.

మ్-1 .స్థానం- పై పెదవి. 2.కరణం- క్రింది పెదవి. 3.ప్రయత్నం- స్పర్శం. 4.నాదం. 5.అనునాసికం.

స్-1. స్థానం- పై దంతాల వెనుక భాగం. 2.కరణం- నాలుక చివర. 3.ప్రయత్నం- ఊష్మం. 4. శ్వాసం.

ఈ భాషా ధ్వనులను లేఖనంలో చూపించాలి. **ఏ భాషకైనా లిపి అసమగ్రమైనది. కొన్ని ధ్వనులకి ప్రత్యేకమైన లిపి లేకపోవడం, ఒక ధ్వని రెండుమూడు రకాలుగా సూచింపబడడం, రెండుమూడు ధ్వనులకు ఒకే అక్షర సంకేతం వాడడం, పదాలలో ధ్వనిలేని అక్షరాలుండడం వంటి అనేక లోపాలున్నాయి.** ఈ లోపాలు ఇంగ్లీషు చదువుకొన్నవారికి బాగా తెలుసు.

లిపిలోని ఈ లోపాలను నివారించడంకోసం 1885లో ఫ్రాన్సులో కొద్దిమంది అధ్యాపకులతో అంతర్జాతీయ ధ్వని సంస్థ (International Phonetic Association) ఏర్పడింది. ఈ సంస్థవారు అన్ని భాషలకూ అన్వయించే విధంగా ఒక లిపిని తయారు చేశారు. ఈ లిపిని అంతర్జాతీయ ధ్వనిలిపి (International Phonetic Alphabet) ఐ. పి. ఎ. అంటారు. ఈ లిపి స్థాన, కరణ, ప్రయత్నాలనాధారం చేసుకొని నోటినుండి వెలువడే ధ్వనులను వర్ణించే విధంగా ఉంటుంది.

ఐ. పి. ఎ. రూపొందించడంలో భాషా శాస్త్రజ్ఞులు పాటించిన నియమాలు. 1.ఒక్కొక్క ధ్వనికి ఒక్కొక్క చిహ్నమే వాడాలి. 2.సాధ్యమైనంత వరకు కొత్త చిహ్నాల్ని కల్పించకుండా యూరోపియన్ భాషలకున్న లిపినే వాడాలి. 3.ఐ. పి. ఎ. చిహ్నాలు రాతకు, ముద్రణకు, టైపు చేయుటకు వీలుగా వుండాలి. 4.ధ్వని సంకేతాల సంఖ్య పరిమితంగా వుండాలి. 5.దీర్ఘం, మహాప్రాణం, అనునాసికం మొదలైన వాటికి ఉప చిహ్నాలు వాడవచ్చు.

ఐరోపాలోని చాలా భాషలకు రోమన్ లిపి ఆధారం. ఇంగ్లీషుకు సొంత లిపి లేదు. రోమన్ లిపిని వాడుకొంటున్నారు. భాషాశాస్త్రవేత్తలు ఐ. పి. ఎ. లో రాయడానికి రోమన్ వర్ణమాలలో లేని ధ్వనులను సూచించడానికి గ్రీకు అక్షరాలు స్వీకరించారు. కొన్ని సందర్భాలలో అక్షరానికి ఒక గుర్తు చేర్చడమో లేదా రెండక్షరాలు కలపడమో లేక పెద్దక్షరాన్ని (capatal letter) వాడడమో చేశారు. దీర్ఘానికి రెండు చుక్కలు (:) గాని అక్షరం పైన గీత గాని వాడతారు. మహాప్రాణాలు (ఒత్తక్షరాలు) రాయడానికి హల్లు పక్క h చేర్చడం రివాజు. ధ్వన్యాత్మక లిపిలో వాక్యారంభంలోను, పేరులకు పెద్ద అక్షరాలు (capatal letter) వాడనక్కర లేదు, **ఒక ధ్వనికి ఏ రకం సంకేతం వాడినా అదే నియతంగా వాడడమూ, ఈ సంకేతం ఈ ధ్వనికి సూచకం అని మొదట్లో నిర్వచించడం అవసరం.**

ఐ. పి. ఎ. లోని అక్షరాలు ధ్వని సంకేతాలు కాబట్టి ఎక్కువ అక్షరాలు వాడుకలో ఉన్న భాష యొక్క లిపి ఎక్కువ భాషలు రాయడానికి ఉపయోగపడుతుంది. తెలుగు లిపి చాలా వరకు ధ్వని విధేయంగా వుంటుంది. అంతేగాక దేవనాగరి లిపిలో లేని అక్షరాలు గూడ తెలుగులిపిలో వున్నాయి. కొత్తగా రెండు, మూడు అక్షరాలు సృష్టించుకొంటే ఈ లిపిలో ఏ భాషనైనా రాసుకోవచ్చు. మనది అక్షర లిపి అంటే హల్లు ఎప్పుడూ ఒక అచ్చుతో కూడివుంటుంది. (క = క్+అ., కా = క్+ఆ., కై = క్+ఐ. క్క = క్+క్+అ). అక్షరం కింద అక్షరం రాసే గుణింత విధానం విశ్లేషణకు అసౌకర్యం. తెలుగు లిపి అక్షర లిపి కాకుండా రోమన్ లిపి వలె ధ్వనిలిపి ఐతే విశ్లేషణకు వీలుగా వుంటుంది.

**తెలుగు భాషను రోమన్ లిపిలో రాసుకోవడం**

నేడు చాలా మంది తెలుగువారు తెలుగు భాషను ఇంగ్లీషు(రోమన్) లిపిలో రాస్తూ సందేశాలు పంపిస్తుంటారు. వారి లేఖన విధానంలోని కొన్ని లోపాలు: 1.ఒక ధ్వని రెండు మూడు రకాలుగా సూచింపబడడం, 2.రెండు మూడు ధ్వనులకు ఒకే అక్షర సంకేతం వాడడం, 3.అనవసరమైన అక్షరాలు రాయడం 4. పెద్దక్షరాలు (capatal letter) రాయడం వంటి అనేక లోపాలున్నాయి. మనవారు ఆంగ్లేయుల లేఖన విధానాన్ని అనుసరించడం వలన కొన్ని తప్పులు జరిగాయి అని చెప్పవచ్చు.

ఇంగ్లీషులోని cut(కట్) లోని 'క్' ధ్వని వేరు, king (కింగ్) లోని 'క్' ధ్వని వేరు, అందుచేత ఆంగ్లేయులు 'కలకత్తా' ను Culcutta అనీ 'కడప' ను Cuddapah అని రాశారు. childలోని మొదటి రెండక్షరాలు ఇంగ్లీషు భాషలో 'చ'(దంత్యం) ధ్వనిని పలుకుతాయి. మనం 'చంద్ర' ను Chandra అని రాస్తున్నాం. moon లోని మధ్య నున్న రెండు అక్షరాలు ఇంగ్లీషు భాషలో 'ఊ' ధ్వనిని పలుకుతాయి. దీనిని మనం అనుసరించాం. 'మూర్తి' ని Moorti అని రాస్తున్నాం. ఇప్పుడు ఆ సంప్రదాయపు లేఖనాన్ని సరి దిద్దుకొంటూ. 'కొల్(కల)కత్త'ను Ko(a)lkatha అనీ, 'కడప'ను Kadapa అని రాస్తున్నాం .

రాతలోని మరొక లోపం - ఒకే ధ్వనికి అనేక రకాల స్పెలింగులు. ఉదాహరణకు - Murty, Murti, Moorty, Moorti. Appayya, Appaiah. Rao, Raw, Row, Rav. అని రాస్తున్నాం .

Moorti మూర్తి ఐతే, Moohana మూహన కావాలి కదా? Moohana మోహన ఐతే Moorti మోర్తి కావాలి కదా?

ఇంగ్లీషులోని ten అన్న పదాన్ని మనం 'టెన్' అని ఉచ్చరించడం వలన 'ట్' ను th గా రాస్తున్నాం. 'త్' ను th గా రాస్తున్నాం. ఈ కారణంగా 'అమృతను' 'Amritha' గా రాస్తున్నాం. మరి 'కథ'ను

ఎలా రాయాలి? 'తాత'ను ఎలా రాయాలి? 'ఋ' అన్న అక్షరం పదాదిలోనే వుంటుంది. 'ఋషి'. దీని దీర్ఘం లేదు. 'ఋ' వత్రసుడిగా పదాల మధ్య వుంటుంది. దీనికి i గాని, u గాని వాడుకోవచ్చు. 'ఋ' ని R తో సూచించడం వుంది. 'ఋగ్వేదమ్'ను Rgveedam అని రాయడం వుంది.

**సందేహాలు రాని రాత కావాలి. రాత నియమబద్ధంగా వుండాలి. రాసేవాడూ చదివేవాడూ ఒకే నియతి కలిగి వుండాలి.**

రోమన్ లిపిలో తెలుగు భాషను రాసేవారు చాలా మంది ఉన్నారు. వీరు 1.తమ సెల్ లో తెలుగు కీ బోర్డు లేనివారు 2.తెలుగు భాష మాట్లాడడం వచ్చి చదవడం రాయడం రాని మరి కొందరు. వీరు ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను ఉన్నవారు. వీరు సాంప్రదాయకంగా వస్తున్న లేఖన విధాన్ననుసరించి రాస్తుంటారు. ఇంకా, 3.తెలుగు భాష మాట్లాడడం రాకపోయినా వేదికలమీద ఉపన్యాసాలిచ్చేవారు, తెలుగువారు కాని సినీనటులు, సినీ గాయకులు, తెలుగు చదవడం రాయడం రాని మరి కొందరు. ఇటువంటివారి సౌకర్యార్థం కొన్ని సూచనలను చేస్తున్నాను.

తెలుగు అచ్చులు :- అ-a, ఇ-i, ఉ-u, ఎ-e, ఒ-o. ఇవి 5 హ్రస్వాచ్చులు.

దీర్ఘాలను రెండు చుక్కలు (:) లేదా పై గీత ద్వారా గాని సూచిస్తారు. కాని రెండు హ్రస్వాచ్చులను ఒకదాని పక్క ఒకటి రాయడం గూడ వుంది. ఇది ఆచరణయోగ్యం . ఆ - aa, ఈ –ii, ఊ–uu, ఓ–oo. ఇవి 5 దీర్ఘాచ్చులు.

ఐ ఔ అక్షరాలను సంధ్యచ్చులంటారు. వీటిని 'అయ్' అవ్ ' అని రాస్తే సరిపోతుంది. చాలా మంది రచయితలు 'అయ్ తే, అవ్ను' అని రాస్తున్నారు. ఐ–ai, ఔ–au. ఇవి 2.

**తెలుగు హల్లులు** :- హల్లుల విషయానికి వస్తే 'ఙ, ఞ' లు సంయుక్తాలలో మాత్రమే దర్శనమిస్తాయి. 'గంగా తరంగాల సారంగ రాగాలు' లో 'గ' ముందున్న ధ్వని 'ఙ్'. 'మంజరి' లో 'జ' ముందున్న ధ్వని 'ఞ్'. ఈ ధ్వనులు సున్న ద్వారా సూచిస్తున్నాం. సున్న ఉపయోగించడం వల్ల రాత సులభం అవుతుంది. 'సున్న' కు ధ్వని లేదు. తన తరవాత వచ్చే ధ్వని కారణంగా సున్న సమీకరణం చెంది అనునాశికంగా మారుతుంది. పంది, కండ, అంబరం వంటి పదాలను పది, కణ్డ, అమ్బరమ్ అని రాయొచ్చు. 'ఙ' ధ్వని 'వాఙ్మయము' వంటి పదాలలో వినిపిస్తుంది. 'వాక్ + మయము' అన్న రెండు మాటలు తొందరగా పలకడం వల్ల (సంధి) 'క' కారం తరవాత వచ్చే 'మ' అనే అనునాసికం కారణంగా సమీకరణం జరిగి 'ఙ్' అనే ధ్వనిగా మారుతుంది. తెలుగు భాషలో పదాంతంలోని 'మ' కారాన్ని సున్నగా రాస్తున్నాం. 'రామమ్' ను 'రామం' అని రాస్తున్నాం.

శ ష స ల విషయంలో నేటి వాడుకనే అనుసరించడం జరిగింది. ష్ రాయడానికి వాడుకలో వున్న విధంగా 2 అక్షరాలు 'Sh' వాడడం జరిగింది. ఇంగ్లీషులోని 'ఫ' ధ్వని రాయడానికి 'f' వాడుకోవచ్చు.

**సాధారణ కీ బోర్డులో తెలుగు అక్షరాలను రోమను లిపిలో ఈ విధంగా రాసుకోవచ్చు.** ఇంగ్లీషు స్పెలింగ్ రానివారు కూడ ఇంగ్లీషు రాసుకోవచ్చు.

**అచ్చులు:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అ = a | ఆ = aa | ఇ = i | ఈ = ii | ఉ = u | ఊ = uu |
| ఎ = e | ఏ = ee | ఐ = ai | ఒ = 0 | ఓ = 00 | ఔ = au |

**హల్లులు:**

| | | | | |
|---|---|---|---|---|
| క్ = k | ఖ్ = kh | గ్ = g | ఘ్ = gh | ఙ్ = ng |
| క = ka | ఖ = kha | గ = ga | ఘ = gha | ఙ = nga |
| చ్ = c | ఛ్ = ch | జ్ = j | ఝ్ = jh | ఞ్ = ny |
| చ = ca | ఛ = cha | జ = ja | ఝ = jha | ఞ = nya |
| ట్ = T | ఠ్ = Th | డ్ = D | ఢ్ = Dh | ణ్ = N |
| ట = Ta | ఠ = Tha | డ = Da | ఢ = Dha | ణ = Na |
| త్ = t | థ్ = th | ద్ = d | ధ్ = dh | న్ = n |
| త = ta | థ = tha | ద = da | ధ = dha | న = na |
| ప్ = p | ఫ్ = ph | బ్ = b | భ్ = bh | మ్ = m |
| ప = pa | ఫ = pha | బ = ba | భ = bha | మ = ma |
| య్ = y | ర్ = r | ల్ = l | వ్ = v | శ్ = S |
| | ష్ = sh | స్ = S | హ్ = H | ళ్ = L |
| య = ya | ర = ra | ల = la | వ = va | శ = Sa |
| | ష = sha | స = sa | హ = Ha | ళ = La |

**రోమను లిపిలో తెలుగు భాష**

**ఆ నాడు** aa naaDu. ఈ నాడు ii naaDu .ఏ నాడు ee naaDu. అంజలి anjali.

పెళ్ళి కాని పిల్లలు peLLi kaani pillalu. రోషనార rooshanaara.

బఠాణి శనగలు baThaaNi Sanagalu. బఠాణీ సెనగలు baThaaNii senagalu.

జ్ఞానమ్ (జ్ఞానం) gnyaanam. అజ్ఞానమ్ (అజ్ఞానం) agnyaanam. అంబరమ్ (అంబరం) ambaram.

ధాన్యము dhaanyamu. ధాన్యం dhaanyam. పంతం pantam. పాఠం paa Tham.

సువాసన suvaasana. శంఖం sankham చందనం candanam

సంసారం samsaaram, ఓ oo, చదరంగం cadarangam.

అంతఃపురం antaHpuramu అంతఃపురమ్(అంతఃపురం) antaHpuram

వాహ్ vaaH. కాఫీ kaafii వెరీ గుడ్ verii guD

ధన్యవాదాలు dhanayavaadaalu

డాక్టర్‌రావ్.బి.ఎస్సీ daakTarraav.bi.yassi

**బడి, గుడి, ఏలుబడి... ప్రజల భాషలోనే**

వంగ-తెలుగు
అనుబంధం

యం. సాహితి

# నాకు అర్థమైన రవీంద్రుడు

**వంగదేశానికి తెలుగువారికి మధ్య అనుబంధం ఎక్కువ. క్రీ.శ. 1911 వరకు బ్రిటిష్ ఇండియాకి కలకత్తా రాజధాని. ఆంధ్ర ప్రాంతపు జమీందారులు, సంస్థానాధీశులు బ్రిటిష్ వారి ప్రాపకం కోసం, తమ పనుల నిమిత్తం తరచూ కలకత్తాను సందర్శిస్తుండేవారు. దానితో వంగ సంస్కృతి తెలుగు మాగాణాల్లో నారు పోసుకుంది. వంగదేశపు చరిత్ర సంస్కృతి అడుగుపొరలలో ఉన్నదంతా తెలుగు సంస్కృతే అని నిష్పక్షపాత బెంగాలీ చరిత్రకారులు అంటారట. బెంగాలీ కట్టుబొట్టూ, లాల్చీలు, వల్లెవాటులు మధ్యతరగతి, సంపన్నగృహాలలోకి చొరబడ్డాయి. వంగసాహిత్యం తెలుగులోకి డిటెక్టివ్ పుస్తకాలతో సహా బేళ్లు బేళ్లుగా దిగుమతి అయ్యింది. గీతాంజలితో పోల్చదగిన 'ఏకాంతసేవ' వంటి లలితభావ గేయమంజరిని అల్లిన వేంకట పార్వతీశ్వర కవుల వంటివారే మాయావి, రహస్య శోధనము వంటి వంగ 'డిటెక్టివ్' పుస్తకాలను పదులకొద్దీ అనువదించారు. ఒకదశలో తెలుగు సాహిత్యమంటే బంగాళా అనువాద సాహిత్యమేమో అని భ్రమపడేంతగా హోరుగా ఈ అనువాదం జరిగింది.**

అటువంటప్పుడు రవీంద్రునికి తెలుగువారు లొంగిపోకుండా ఉంటారా?

రవీంద్రుని కంటే ముందే ఠాగోర్ కుటుంబానికి తెలుగువారికి స్నేహం ఎప్పుడో ఏర్పడి ఉంది. అనకాపల్లి జమీందారు 'మహారాజా', 'సర్' గొడే నారాయణ గజపతిరావు బహద్దర్ వారికి (1828-1903), రవీంద్రుని తండ్రి 'మహర్షి' దేవేంద్రనాథ ఠాగోర్ మిత్రత్వం ఉంది. (ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణ – తూమాటి దొణప్ప – పుట 146). నారాయణగజపతిరావు కలకత్తా సందర్శించినప్పుడు ఠాగోర్‌ల దేవిడీలోనో, కేశవచంద్రసేన్ గారింట్లోనే అతిథిగా ఉండేవాడు.

ఆంధ్ర సంస్థానాధిపతులు పెక్కురికి రవీంద్రుడు అంటే మిక్కిలి గౌరవం. అందులోనూ విజయనగరం మహారాణీ సాహేబా విద్యావతీదేవి, పిఠాపురం మహారాజా రావు సూర్యారావు మరీ ముఖ్యులు. రవీంద్రుని గీతాంజలికి నోబెల్ బహుమతి ప్రకటించకముందే భారతీయ భాషలలో మొదటి అనువాదం తెలుగులో పిఠాపురం నుండే వెలువడింది. అనువాదకర్త పిఠాపుర సంస్థానోద్యోగి అయిన ఆదిపూడి సోమనాథరావు. సూర్యారావుగారికి రవీంద్రుడంటే మహాభక్తి. ఆయన సిఫారసు చేయగా కలకత్తా సిటీ కాలేజ్ నిర్మాణానికి పెద్ద మొత్తంలో విరాళమిచ్చారు సూర్యారావు.

1919లో మొదటిసారిగా ఆంధ్రదేశంలో పర్యటించారు రవీంద్రుడు. అప్పుడే చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఆయన తన ప్రసిద్ధ గీతం 'జనగణమన'కి రాగవరుస కట్టారు (28.02.1919). అక్కడి విద్యార్థులతో కలసి పాడారు. ఆంగ్ల అనువాదమూ చేశారు.

తరువాత 1934లో బొబ్బిలి జమీందారు ఉమ్మడి మదరాసు రాష్ట్ర ప్రీమియర్ అయిన రావు శ్వేతాచలపతి రంగారావు ఆహ్వానం



విక్రమదేవవర్మ, విశ్వకవి, సర్వేపల్లి రాధాకృష్ణయ్య

మీద మళ్లీ ఆంధ్రప్రాంత పర్యటన చేశారు రవీంద్రుడు. ఈ పర్యటనలోనే ఆయన అంతకుముందే పరిచితులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణయ్య పండితుడిని, జయపూర్ (ఒడిషా) మహారాజా విక్రమదేవవర్మని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కలిశారు. బహుశా భారతీయ కవులలో పురాతనులలో కాళిదాసుతో సమానంగా, నవీనులలో రవీంద్రనాథ్ ఠాగోర్ భారతీయ సాహితీ ప్రియులను అలరించాడు. కాళిదాసుని, రవీంద్రుని అనువదించుకొని తనవారిగా చేసుకోని భారతీయ భాష లేదు.

సాహిత్యంలో నోబెల్ పురస్కారాన్ని స్వీకరించిన మొట్టమొదటి ఆసియావాసి రవీంద్రనాథ్ ఠాగోర్. ప్రపంచ సాహితీ పురవీధుల్లో తల ఎత్తుకుని సగౌరవంగా తిరిగిన గీతాంజలి విరిసింది మన భరతఖండంలోనే. గీతాంజలి అంత గొప్పదా? నోబెల్ పురస్కారం వచ్చిందని గీతాంజలి గొప్పదైందా? కాదు, గీతాంజలికి నోబెల్ పురస్కారం వచ్చిందని అది గొప్పది కాలేదు. గీతాంజలి గొప్పదైనందువల్ల నోబెల్ పురస్కారం వచ్చింది. అందులోని సాహిత్య సౌరభానికి తోడు జీవనసాధన వల్లే గీతాంజలి గొప్పదైనది. యుగయుగాలుగా విశ్వమానవుని మధురసాధన గీతాంజలిలో భాషారూపాన్ని దాల్చింది. ప్రపంచంలోని అందాలూ, ప్రేమలూ, సౌఖ్యాలూ అన్నీ ఈశ్వరచ్ఛాయలు. ఆయన వాటి వల్లనే మనల్ని ఆకర్షిస్తాడు.

కానీ తీరా ఈశ్వరుడ్ని తెలుసుకోవాలంటే ఈ అందాలే, ఈ ఆకర్షణలే మానవుని పురోగమనానికి అభ్యంతరాలౌతాయి. అదే మాయ. ఈ విషయమే తెలియజేస్తాడు మనకి రవీంద్రుడు. అందుకే గీతాంజలి గొప్పకావ్యం అయ్యింది.

రవీంద్రుడు 1861 మే 7న కలకత్తాలో జన్మించాడు. సాహిత్యానికి, బహుభాషా పాండిత్యానికీ, లలితకళలకూ, ఆధ్యాత్మిక చింతనకీ ఆలవాలమైన ఠాగోర్ కుటుంబంలో పుట్టిన రవీంద్రుడు

ఎనిమిదేళ్ళ వయసులో ఒక ఫ్రెంచ్ కవితని అనువాదం చేశాడు. పన్నెండవ ఏట ఒక నాటకాన్ని రచించాడు. పదహారు సంవత్సరాల వయసుకే కవిగా, విమర్శకుడిగా పేరుగాంచాడు. సాహితీ ప్రక్రియలన్నిటిలోనూ నిష్ణాతుడనిపించుకున్నాడు. రవీంద్రుడు ప్రకృతి ప్రేమికుడు. బాహ్య సౌందర్యాన్ని కూడా దర్శించి ఆరాధించగలిగిన కళాపిపాసి, తత్వవేత్త అయిన రవీంద్రుడు నిరంతర స్వాప్నికుడు కూడా.

కాల దేశ అవధులు దాటి, రవీంద్రుని కీర్తి అనంతంగా వ్యాపింపజేసినది ఆయన కవితా ప్రతిభ అయితే, బహుముఖమైన ఆయన ప్రతిభ ఒక కవిత్వంలోనే కాక, అన్ని రకాల సాహిత్య ప్రక్రియలలోనూ తన అస్తిత్వాన్ని రుజువు చేసుకుంది. నాటకాలు, నాటికలు, వ్యాసాలు, నవలలు, కథానికలు ఒక్కటేమిటి, రవీంద్రుడు ప్రయత్నించని సాహిత్యరూపమే లేదు. ఆయన నాటకాలూ, నాటికలూ చదువుతున్నప్పుడు అవి చాలా వరకు సంభాషణ రూపంలో ఉన్న కవిత్వమే అనిపిస్తుంది. రవీంద్రుడు నిత్యస్వాప్నికుడు అన్న మాట వాస్తవమే కానీ, ఉట్టి కలలుకనే కవి మాత్రం కాదని, ఆయన తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చాలా సూక్ష్మంగా అవగాహన చేసుకున్నాడని గీతాంజలి మరియు రవీంద్రుడు రాసిన కథలు చదవడం ద్వారా మనకి అర్థం అవుతుంది.

రవీంద్రుని రచనల్లో అత్యంత విశిష్టమైన కావ్యం గీతాంజలి. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన రచన. మానవత్వంలో దివ్యత్వాన్ని దర్శించి రచించిన గీతాంజలి కావ్యానికి సమ్మోహితులు కానివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. గీతాంజలి కావ్యానికి రవీంద్రుడు స్వయంగా చేసిన ఆంగ్ల అనువాదానికి 1913లో నోబెల్ పురస్కారం లభించింది. ఈ కావ్యం అన్ని జాతీయ భాషల్లోకి, అనేక అంతర్జాతీయ భాషల్లోకి అనువాదం అయ్యింది. కొన్ని విషయాలు అర్థం కావాలంటే బుద్ధికన్నా మనసు కావాలి. కొద్దో గొప్పో భావుకత ఉండాలి. అన్నిటికన్నా మించి మనల్ని మనం మర్చిపోయిన ప్రపంచంలోకి వెళ్ళగలగాలి. అలాంటి ఓ అద్భుత కావ్యం గీతాంజలి.

తరగతి గదిలో అర్థం తెలియకుండానే "Where the mind is without fear" అని బట్టీపట్టి వల్లించిన కాలం నుండి అర్థం తెలుసుకుని ఆ గాఢతకు ఆశ్చర్యపోతూ ఆ సమున్నతమైన సంస్కారాల సంచలనాన్ని చదివినప్పుడల్లా అనుభవించిన జ్ఞాపకాలన్నీ, ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఒళ్ళు విదిల్చుకుని ముందుకొచ్చాయి. కవి భావుకుడైతే, భావుకుడు తాత్వికుడైతే, తాత్వికుడు, దార్శనికుడైతే అతడే రవీంద్రుడు అని ఈ కవితను అర్థం చేసుకున్నాక తెల్సింది. రవీంద్రుని హృదయస్పందనలు జలపాతాలై జారి, సెలయేరులై వారి, వయ్యారంగా నాట్యమాడిన కవితా కన్యక నర్తనలే గీతాంజలి అని అవగతం అయ్యాక ఒళ్ళు ఉప్పొంగింది. సర్వంలో తననీ, తనలో సర్వాన్ని దర్శించే యోగిపుంగవుల్లోను; సూర్యచంద్రులను తన కళ్ళుగా చేసుకుని, లోకాన్నంతటినీ ఆర్తిగా దర్శించగా హృదయ బృందావనంలో విరగబూసిన రంగు రంగుల పుష్పాలే ఈ కవీంద్రుని గీతాంజలి.

ఒకరి జ్ఞానాన్ని ఇంకొకరికి ఇవ్వడం కొంతవరకూ సాధ్యం కానీ, ఒకరి అనుభవాన్ని ఇంకొకరికి తెలియజేయడం చాలా అసాధ్యం; అనుభవాల్ని చూసి, విని నేర్చుకునేవారు ఉంటే తప్ప. ఎందుకంటే ఈ గీతాంజలిలో ఠాగోర్ యొక్క విరహంతో నిండిన మనస్సు కనిపించింది. అయితే జీవితమంతా బాధ ఆవరించినా తన వ్యధని తొలగించమని అడుగడు ఈ రసికుడైన భక్తుడు. ఎంత వేదనలో నుంచైనా సరే తనని ప్రేమార్హుడ్ని చెయ్యమని ప్రార్థిస్తాడు.

"ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో" అనే కవితని చిన్నప్పుడు ఎన్నిసార్లు చదివినా ఆ కమనీయ భాషాసౌందర్యం వెనుక దాగిన కవి భావం నాకు అంత తేలికగా అర్థం అవ్వలేదు. నాకు స్పష్టంగా అవగాహనకందలేదు. కానీ ఎందరో మేధావులు, సాహితీవేత్తలు, విద్వాంసులు గొప్పగా ప్రశంసించి అందులోని మార్మికతకు అచ్చెరువొంది కొంగర జగ్గయ్య, గుడిపాటి వెంకటచలం, వంటి మహానుభావులు చదివి అనువదించి ఆనందించిన గీతాంజలిని, అందులోని భావసౌరభాన్ని నేనూ తప్పక ఆస్వాదించాలనిపించింది. ఆ విషయమై నాలో కవితా ప్రపంచంలో నోబెల్ పురస్కారాన్ని పొందిన గీతాంజలిలోని భావగాంభీర్యాన్ని తప్పక అవగాహన చేసుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఆ తీవ్రత నేను మరలా మరలా ఈ కవితను నిశితంగా పఠించి, పరిశీలించడానికి దోహదం చేసింది. నా డిగ్రీ ఆరవ సెమిస్టరు చదువుతున్నప్పుడు "రవీంద్రుని ఆత్మ గీతాంజలి" పై థీసిస్ చేయడానికి ప్రేరేపించింది. అలా పరిశీలనాత్మకంగా కవి భావాన్ని నా శక్తి మేర ఆస్వాదించగా రవీంద్రుని అంజలి కొంతమేరకు అర్థం అయినట్లు అనిపించింది.

రాజా రామ్మోహన్‌రాయ్ దేవుని గురించి "దేవునికి కూడా స్వాతంత్ర్యం లేదు. ఇప్పుడు కావాలనుకున్నా నచ్చినట్లు తను చేసి వెనక్కు విరమించుకుని తప్పించుకోలేడు" అని చెప్పిన ఈ విషయం ఎక్కడో చదివాను. ఠాగోర్ తన గీతాంజలిలో ఈ ఆలోచనకి రూపాన్నిచ్చాడు. రాయ్ చెప్పిన ఈ వాక్యాన్ని నేను గీతాంజలితో ఎందుకు పోల్చుకున్నానంటే "దేవుడు కూడా తన పనిలో బందీయే" అని అంటాడు ఠాగోర్. ఒక కాలంలో జీవించిన స్వేచ్ఛా సమాజం లాంటి విలువైన మాటలతో ఆదర్శాన్ని ఊరించి దానికి పదాల్తో ప్రాణం పోసి ప్రతిపాదించడం బహుశా కవిత మానవాళికి అందించిన అత్యున్నత భావజాలం అని నేననుకుంటాను.

నిరాశ, నిస్పృహలను దూరం చేసే గీతాంజలి ఒక సందేశం. అతి సరళమైన పదాల్లో వ్యక్తం అయిన ఈ అనువాదపు భావం విశ్వకవి రవీంద్రుని కలం నుండి వెలువడిన గీతాంజలి కావ్యంలోనిది. రవీంద్రుని గురించి చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞాశాలి అనే పదం చాలా చిన్నది. మూర్తీభవించిన భారతీయ సంస్కృతి అంటే కొంత వరకూ సరిపోతుంది. విశ్వమానవతకు నిలువుటద్దం గీతాంజలి. బెంగాలి రచనలతో పాటు ఆంగ్లభాషలోనూ పట్టు సాధించిన రవీంద్రుడు కాళిదాసు, షేక్స్‌పియర్ రచనలను ఎక్కువగా ఇష్టపడేవాడు..

రవీంద్రుడు గొప్ప రచయితగా, సంగీతవేత్తగా, చిత్రకారుడిగా, విద్యావేత్తగా వీటన్నిటికీ మించి గొప్ప మానవతావాదిగా నిలిచాడు. దశాబ్దాలు గడుస్తున్నా రవీంద్రుడు అందించిన సాహిత్యపు

పరిమళంలో ఈ విశ్వం ఇప్పటికీ తేలియాడుతూనే ఉంది. అందుకే కాగితం మీద రాత రాసి ఉంటే అవి కేవలం అక్షరాలు. అదే రాత రవీంద్రుని కలం నుండి జాలువారితే అవి అగ్నిజ్వాలలు. స్వతంత్రోద్యమంలో రవీంద్రుడు కలంతో కదం తొక్కాడు. శ్రీశ్రీ అన్నట్టు విశ్వమానవసృష్టి కోసం అశ్రువొక్కటి ధారపోసారు. గీతాంజలిలో ప్రస్తావించినట్టు స్వేచ్ఛా స్వర్గంలోకి నా దేశాన్ని నడిపించమని ఎలుగెత్తి చాటారు. అందుకే ఆయన విశ్వకవి.

**రవీంద్రుడు ఓ కవి, నాటక రచయిత, ప్రయోక్త, నటుడు, విద్యావేత్త, ప్రపంచయాత్రికుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, చిత్రకారుడు, సాహిత్య పిపాసి. వీటన్నిటికీ మించి ప్రపంచాన్నంతా తన జాలి, దయ, కరుణ, ఆర్ద్రత, మంచితనం, ప్రేమ, స్నేహం, త్యాగం వంటి మానవత్వపు విలువలతో ప్రభావితం చేసిన మానవతామూర్తి మన రవీంద్రుడు. ఆ కాంతివంతమైన మేధస్సు మన దేశకీర్తికీ మానవతా ప్రపంచానికి మార్గదర్శిగా ఎప్పటికీ నిలుస్తుంది.**

రవీంద్రుడు లేకపోతే ''ఈ సూర్యోదయాలు, సూర్యాస్తమయాలూ, ఈ గాలి, నీరు, కాంతి, భూమి, ఆకాశం, అడవి ఇంత విలువైన వరాలని నన్నెవరు నమ్మించగలిగేవారు. ఈ అర్ధరాత్రి నక్షత్రాల మిస్టరీ నాకెవరు చెప్పగలిగేవారు?" అని అన్నారు చలం. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి స్పృశించని కళారూపంలేదేమో అని అనిపిస్తుంది నాకీ వాక్యం చదివాక. ఇది ఆయన అనేక రచనల్లో, కథల్లో, నవలల్లో, నవలికల్లో, స్పష్టంగా విశేషంగా దర్శనమిస్తుంది.

ప్రభాత సమయాల్లో ఉదయించే సూర్యుడు, ఆహారం కోసం గగనసీమలో బయలుదేరిన పక్షుల గుంపు, మిట్టమధ్యాహ్నం ఆకాశంలో గరుడుడి శాంతి తపస్సు, సాయంసంధ్య, గోధూళివేళలు, ప్రవహించే జలపాతాలు, నదీనదాలు మొదలుకొని పిల్ల పంటకాలువలు, సాయంత్రం పొలాలపై నుండి వీటి చల్లని పైరగాలి, పుడమి తల్లి ప్రసవ వేదనతో బయటకు వచ్చే పచ్చదనపు మొక్కలు, అడవులు మొదలుకొని ఇంటి పెరడులోంచి వచ్చే పూల పరిమళాలు, కుండపోతగా మొదలుకొని ఇంటి తాటాకుచూరు నుండి వచ్చె చిరుజల్లుల సౌందర్యం, ఒక్క మాటతో కరుణకు, ఆర్ద్రతకు, మానవ హృదయం స్పందించినంత కాలం ఠాగోర్ సాహిత్యం అమరమే.

ఇది రవీంద్రుని జీవితంలో జరిగిన ఓ సంఘటన. ఆయన తన ఇల్లులాంటి చిన్నబోటులో నెలల తరబడి నదిపై గడిపేవారు. చుట్టూ దట్టమైన అరణ్యం. గొప్ప నిశ్శబ్దం. సాటిలేని ఏకాంతం. ఒక పున్నమి రాత్రి ఆయన సౌందర్య తత్వశాస్త్రానికి అపురూపమైన ఆవిష్కారాన్ని అందించబోతున్నారు. అర్ధరాత్రి దాకా మనసులో ఎంతో మథనపడ్డారు, చర్చించుకున్నారు. పుస్తకం మూసి దీపం ఆర్పేసారు, పడుకోవడానికి సిద్ధపడ్డారు. అంతలో ఓ అద్భుతం జరిగింది. ఆయన ఎప్పుడైతే దీపం ఆర్పేసారో, ఆ చిన్న ఇంటిలాంటి బోటు కిటికీలోంచి, తలుపు సందుల్లోంచి సన్నని వెన్నెల వచ్చి నృత్యం చేయసాగింది. మెరుపులు బోటుని నింపాయి. రవీంద్రుడు క్షణకాలం నిశ్శబ్దంగా ఉన్నారు. అది ఒక పవిత్ర అనుభవం అని రవీంద్రుడు తన డైరీలో రాసుకున్నారు.

ఆయన తలుపు తీసుకుని బయటకి వచ్చాడు. చంద్రుడు అసాధారణ సౌందర్యంతో మెరిసిపోతున్నాడు. ఆ నిశ్శబ్దరాత్రిలో, ఆ నిశ్శబ్ద వృక్షాల నడుమ నది నిర్మలంగా ప్రవహిస్తోంది. ఎలాంటి శబ్దం లేదు. మరుసటి రోజు ఉదయాన్నే తన డైరీలో రవీంద్రుడు "సౌందర్యం నా చుట్టూ అల్లుకుని ఉంది. కాని చిన్న కొవ్వొత్తి ఆ సౌందర్యం నా కంట పడకుండా అడ్డుకుంది" అని రాసాడు. "నిర్వాణం అనే పదానికి సరైన అర్థం అదే. నీ అహం అనే చిన్ని దీపకాంతి, నీ మనస్సుకు సంబంధించిన నేను అనే ధనం, అనంత విశ్వాన్ని నీ దరి చేరనీయకుండా అడ్డుకుంటుంది. ఆ విశ్వపు పోకడలని నీలోకి రానివ్వదు. నీలో ఉన్న లోపం అనే దీపాన్ని ఆర్పి సమస్త విశ్వాన్నీ నీలోకి రానివ్వడమే నిర్వాణం. నీ సమస్త అస్తిత్వాన్ని విశ్వం చుట్టుముట్టడమే నిర్వాణం. ఇక్కడ నువ్వు ఏదీ కోల్పోవు. నువ్వు మొదటిసారి నీ అనంత విస్తార సౌందర్యాన్ని, మంచితనాన్ని, సత్యాన్ని, గొప్ప విలువైన వాటిని దర్శిస్తావు." కొద్ది వాక్యాలలో ఎంతో తత్వం బోధించాడు విశ్వకవి.

పడవ నడిపే బెస్తా, పొలము దున్నే రైతూ వంటి పామరులు మొదలు వ్యుత్పన్నమతులైన పండితుల వరకూ ఆయన కావ్యాలకు పరవశులు కాని వారు లేరు. ఆ పాటకు అనుగుణంగా పసిపిల్లలు నాట్యమాడతారు. ప్రేమికులు వారి ఏకాంతంలో గుర్తు చేసుకుంటారు. వయసుమళ్ళిన వారు ఆత్మ సంయమనం కోసం నెమరువేసుకుంటారు. గీతాంజలి నోబెల్ బహుమతి అర్జించుకోవడం వంగ సాహిత్యానికీ దాంతో పాటు భారతీయ సాహిత్యానికి ఎంతో ప్రతిష్ఠ. గీతాంజలి నోబెల్ పురస్కారం పొందకపోతే విశ్వ సాహిత్యంలో ఉన్నత స్థానం పొందగలిగేది కాదేమో అన్న సందేహం కొంతవరకు మాత్రమే నిజం. నోబెల్ పురస్కారం లేకుండా కూడా అది విశ్వమానవ హృదయాన్ని ఆకర్షించేదే. కారణం, గీతాంజలి విశ్వమానవుని హృదయోద్గారి కనుక, **ప్రపంచ సాహిత్య లోకానికి భారతీయ సాహిత్యపు విలువలను రుచి చూపించింది రవీంద్రుడే. తాను పెంపొందించిన విశ్వమానవ సోదరభావం వల్ల వారి కీర్తి భారతదేశపు ఎల్లలు దాటింది. లోకహితుడిగా, లోకమిత్రునిగా, లోకగురువుగా శాశ్వతంగా నిలచేలా చేసింది. రవీంద్రుని ప్రతిభాపాటవాలు వర్ణించడానికి సాహిత్యపు భాషను మించి భాష మరొకటి ఉండాలేమో!**


రచయిత్రి డిగ్రీ చివరి ఏడాది విద్యార్థిని.
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గుంటూరు.


**ఆధారగ్రంథాలు:**


◆ Rabindranath Tagore's 150th Birth Anniversary Commemoration Volume. ◆ In cultural series Gandhi, Tagore and Nehru Contribution and Thoughts. ◆ Universal love and World Unity. ◆ Rabindranath Tagore Gitanjali. ◆ Gitanjali by Dr.Bhargavi. ◆ Illustrated Biography of Rabindranath Tagore. ◆ Gitanjali as a poem of Universal love. ◆ నివేదన, సంపాదకుడు మోదుగుల రవికృష్ణ, 2014.

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-10

# నా కొండపోచమ్మ - కొండపాక యాత్ర

ఎప్పట్నించో అనుకుంటున్న కొమరవెల్లి కెళ్తున్నానన్న ఆనందం ఆనాటి ముందు రోజు నన్ను విందారగింపజేసింది. మరోసారి పాత కరీంనగర్ జిల్లాలో అడుగుపెడుతున్నందుకు మరింత సంతోషంగా ఉంది. గమ్మత్తేమిటంటే ప్రజ్ఞాపూర్‌లో ఉన్న పర్యాటక అభివృద్ధి సంస్థ హరిత హోటల్‌ను చూడటానికి వెళదామనుకొన్న నాకు రామోజు హరగోపాల్ గారి నేతృత్వంలోని కొత్త తెలంగాణా చరిత్ర బృందం సిద్ధిపేట సభ్యులు అహోబిలం కరుణాకర్ గారు అనుకోకుండా ఫోన్ చేసి, కొండపోచమ్మ గుట్టకెదురుగా ఒక జైన విగ్రహం ఉంది. మీరు చూస్తే బాగుంటుందన్నారు. అంతేకాదు మిమ్మల్ని తుర్కపల్లిలో మహ్మద్ నసీరుద్దీన్ కారులో ఎక్కించుకుతీసుకొస్తాడని కూడా చెప్పటంతో మనసు నిమ్మళమై, ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూస్తూండగానే రాత్రి పక్కకు జరిగింది.

తుర్కపల్లిలో నసీరుద్దీన్ కలసి, కారులో ఎక్కించుకొన్నారు. ప్రయాణం సాగుతోంది. రోడ్డుకు అటు ఉన్న గుట్టలు ఆది మానవుని అడుగుజాడలు మైలురాళ్లలా కదిలిపోతున్నాయి. అంతలోనే ప్రజ్ఞాపూరొచ్చింది. కుడివైపుగా కొంతదూరం పోయింతర్వాత జగదల్‌పూర్, దాటంగానే మునుపటి గద్వేల్ నియోజకవర్గంలోని గొల్లపల్లి బోర్డును చూస్తూన్న నాకు పక్కనే కంచెలో నిలువెత్తు భైరవవిగ్రహం, దాని పక్కన ఒక నాగదేవత శిల్పాలు కనిపించాయి. కారాపి, ఆ విగ్రహాలపైనున్న ముళ్లను తొలగించి చూడగా, కాకతీయ అనంతర కాలపు భైరవ విగ్రహం, ఏమంత పనితనంలేనిదిగా అనిపించింది. అయినా ఆరొందలేళ్ల శిల్పాన్ని కాపాడుకోవాలని ఆ పక్కపొలంలోని రైతులకు చెప్పి, మళ్లీ బయలుదేరాం!

ముందుకుపోతుంటే, మునుపటి పత్రభూములన్నీ పచ్చటి పొలాలుగా కనబడుతుంటే బంగారు తెలంగాణ కల నిజమౌతుందనిపించింది. ప్రయాణం అలాగే కొనసాగుతోంది. కొండలు, గుట్టలు, కొత్తగా తవ్విన లోతైన కాలువలు, అక్కడక్కడా నీటిమడుగులు. అంతలో రానే వచ్చింది. కనిపించేదే కొండపోచమ్మ అని నసీరుద్దీన్ చెప్పారు. కొండ గుట్టనున్న ఆలయంలోని ఒక జైన విగ్రహమే కొండపోచమ్మగా పూజలందుకోంటుందని చెప్పారు కొంతమంది పరిశోధక యువకులు. పోచమ్మ గుడివైపు ఎదురుగా అటుఇటూ ఒక కిలో మీటరు పొడవునా కొలువు తీరిన అంగళ్లు! కాఫీ హోటళ్లు, కూల్‌డ్రింక్ షాపులు, వాటిల్లో బీరు బరండీ(బ్రాందీ) బాటిళ్లు!! అమ్మవారిని దర్శించుకొన్న స్త్రీలు పొంగళ్ళు, వంటలు చేస్తుంటే మగమహారాజులు చెట్ల కింద విందారగిస్తూ మద్యం సేవిస్తూ ఉల్లాసంగా కాలంగడుపుతున్నారు. ఇంతలో సిద్ధిపేట నుంచి మిత్రులు అహోబిలం కరుణాకర్, సామలేటి మహేష్, కిరణ్‌గార్లు మోటార్ బైకులపై రానేవచ్చారు. అందరం కొండపోచమ్మ ఎదురుగా చాయ్‌తాగి గుడికి ఎదురుగా ఒక గుట్టకు చేరాం. దట్టంగా పొదలు, ఏపుగా ఉన్న చెట్లు.. మాకు మెట్లే కనిపించలేదు. కష్టపడి పైకి చేరుకున్న మాకు పద్మాసనంలో ధ్యాన ముద్రలో ఉన్న మహావీరుని మొండి విగ్రహం కనిపించింది. తల కోసం చుట్టూవెతికాం, లాభం లేదు. కానీ మధ్య యుగాల జైనబసదుల ఆనవాళ్లు వాటిని కట్టడానికి వాడిన ఇటుకరాళ్లు, అక్కడ కూడా ఆలయ విడిభాగాలు, ఒక బావి, మండప శిధిలాలు కనిపించి- మా బృందానికి కనువిందు చేశాయి. ఆచార్య జయధీర్ తిరుమలరావుగారన్నట్లు ఆ శిధిలాల్లో సౌందర్యం కనిపించింది. తదేకంగా చూస్తున్న మాకు, సామలేటి మహేష్ కేక వినిపించింది. ముళ్లకంచెలో, చింతచెట్టు కింద మరో జైనవిగ్రహ శకలం ఉందన్నాడు. అందరం అటు వెళ్లాం. పడిపోయిన ఒక స్తంభం, దానిమీద ఒక జైన విగ్రహం, ఎలాగో ముళ్లకంచె దాటి దగ్గరికెళ్లాం. ఆ శిలాస్తంభంపైన నాలుగువైపులా, నలుగురు జైన తీర్థంకరులు, వారు ఆదినాథ, నేమినాథ, పార్శ్వనాథ, మహావీరులు, అందరూ నగ్నంగా, పద్మాసనంపై కూర్చొని ధ్యానమగ్నులై నిమిళిత నేత్రాలతో ఉన్నారు. ఒకప్పుడు కళకళలాడిన జైన బసదిలోని ఈ విగ్రహాలు ఛిన్నమై బిక్కుబిక్కుమంటూ వెలవెలబోతున్నాయి. అందరం బాధపడ్డాం. క్రీ.శ. 9-10 శతాబ్దాల్లో రాష్ట్రకూటులు వేములవాడ చోళుక్యుల కాలంనాటి ఈ చారిత్రక స్థలాన్ని, జైనబసది కట్టడాల్ని, శిల్పాల్ని పరిరక్షించాలని స్థానికులకూ, సర్పంచికీ విజ్ఞప్తి కంటే ఏమీ చెయలేక పోయాం! అయినా ఆ విగ్రహాలను గుర్తించామన్న అహోబిలం కరుణాకర్, సామలేటి మహేష్, నసీరుద్దీన్, కిరణ్ ఇంకా మాతో పాటువచ్చిన స్థానిక యువకుల కళ్ళలో ఆశల వెలుగుల్ని చూశాను. మళ్లీ బైకులపై కొండపోచమ్మ దగ్గరకొచ్చాం. అందరం కొమరవెల్లి వెళ్దామని బయలుదేరాం.



నేను కరీంనగర్‌కు పోయేటప్పుడల్లా కొమరవెల్లికెళ్లే బోర్డు కనిపించేది. చూడాలన్న తపన పడేవాడిని కానీ కుదరలేదు. పోతూంటే, ఒక శిధిల ఆలయం మా ప్రయాణానికి అడ్డుకట్టవేసింది. కారు దిగి ఆలయప్రాంగణంలో శిధిల మండపాలు, కొద్దిగా వంగినా ఠీవి తప్పని ధ్వజస్థంభం, కూరుకుపోయిన శిల్పాలు, మండపం ఒక వైపు సింధూరంలో నిండిన భక్తాంజనేయ శిల్పం, ద్వారబంధాలపై జయ, విజయ శిల్పాలు, ఆ ఆలయంలో క్రీ.శ. 9వ శతాబ్దానికి చెందిన ఒకమండపం

క్రీ.శ. 18వ శతాబ్దంలో జీర్ణోద్ధరణలో ప్రాచీనతను కోల్పోయింది. అది, కొమరవెల్లి మండలం, అయినాపూర్ గ్రామం. చుట్టుపక్కల వాళ్లను పిలిచి, వారికి ఆలయ చరిత్రను చెప్పి కాపాడుకోవాలని బతిమిలాడి మళ్లీ బయలుదేరాం.



కొమరెల్లి, కొమరవెల్లి. కొమరన్న పేరిట శివుడు కొలువుదీరిన ఆలయం. అస్తవ్యస్తనిర్మాణాలు, ఇబ్బడిముబ్బడి క్యూలైన్లు, ఇష్టం వచ్చిన రంగులు, అన్నీ కలిపి వారసత్వాన్ని వరస తప్పించాయి. తెలంగాణ ప్రజల మనసుల్లో మల్లన్న పెనవేసుకొని ఇప్పటికీ ప్రజాదరణ గల దేవాలయంగా గుర్తింపు పొందింది. లేనిదల్లా చారిత్రక స్పృహ, వారసత్వ పరిరక్షణ. ఎక్కడ చూచినా ప్లాస్టిక్ ఆట వస్తువులతో నిండిన అంగళ్లు, మన హస్తకళలు మాత్రం లేవు!

ఆలయం చూద్దామన్న అందరినీ, అక్కడున్న చారిత్రక ఆనవాళ్ల దగ్గరకి



తీసుకెళ్లారు ఆహోబిలం కరుణాకర్. ఒక కొండ చరియపై చెక్కిన నిలువెత్తు పార్శ్వనాధుని విగ్రహం ఆకట్టుకుంది. కాయోత్సర్గాసనంలో, నగ్నంగా, నిలబడిన పార్శ్వనాధుని తలపైన నాగరాజు, ఆ విగ్రహం క్రీ.శ. 9–10 శతాబ్దాల నాటిదని చెబుతున్నాయి. ఆ తరువాత వేములవాడ చాళుక్యుల కాలపు రాతిరథం చక్రాలు, వాటిపైన ఆధునీకరించిన సిమెంటు రథం ప్రాచీనత పక్కదారి బట్టిన వైనాన్ని తెలియ జేస్తున్నాయి. కొమరెల్లి మల్లన్న ఆలయగోపురం మాత్రం బంగారు ఛాయలో, కొండగుట్టల మధ్య వెలిగిపోతోంది. దేవాలయం అధికారులకు బెత్తంపుచ్చుకొని ఆలయ నిర్వహణ ఎలా ఉండాలో, ప్రాచీన విగ్రహాలు, కట్టడాలను ఎలా కాపాడుకోవాలో పాఠం చెప్పాలనిపించింది. నా పిచ్చిగాని, ఎవరు వింటారు!

ఆకలి మామూలే! పక్కనున్న ఒక హోటల్లో స్థానిక నాస్తా ఏమైనా దొరుకుతుందేమోనని వాకబు చేశాం. ఎక్కడ చూచినా, ఇడ్లీ, దోశ, పూరీలే, కనీసం ఉగ్గాని దొరుకుతుందేమోనని అడిగాం, లేదన్నారు. సరేనని మేమే బొరుగులు తెప్పించి, ఉగ్గాని చేయించుకొని ఉల్లి ముక్కలు, నిమ్మరసం కలిపి తింటుంటే, ఆ రుచే వేరు.

కొమరవెల్లి నుండి బయల్దేరి రెండు కిలోమీటర్లు దాటేప్పుడు పొలాల్లో పొడవాటి రంగుల తోక ఉన్న నెమళ్లు కనిపించి కవ్వించాయి.ఆగుదామనుకొన్నా, చాలా చూడాల్సినవి ఉన్నాయని, బైకులపైన కొనసాగాం. హైదరాబాద్–సిద్ధిపేట హైవే దాటాం. అప్పుడు గుర్తొచ్చింది. ఒకసారి, అహోబిలం కరుణాకర్, సామలేటి మహేష్, హరగోపాల్ గారు కొండపాకలో ఏరిన పూసలు, సేకరించిన తొలియుగపు మట్టి పాత్రలు, బొమ్మల గురించి రాయగా చదివినవి మదిలో మెరిసి, కొండపాకకు మళ్లించాయి. అందరమూ, పొలాల్లో కాలుమోపి కళ్లతో నేలంతా జల్లెడబట్టగా ఎన్ని పూసలో ! రంగు రంగు పూసలు! రకరకాల మట్టి పాత్రలు! అనేక రంగుల డిజైన్ల పింగాణీ పూతగల మట్టిపెంకులు! వంగి, వంగి వాటిని చూస్తున్న మాకు నడుంనొప్పిని తెప్పించినా, మనసు నుంచి తప్పించాయి. కొండపాకలో ఉన్న కాకతీయుల కాలపు ఆలయంలో ఒక దాన్ని స్థానికులే బాగుచేసుకొన్నారు. మరోదాన్ని పురావస్తు శాఖ ఊడదీసికట్టినా గత వైభవాన్ని అందించలేక మళ్లీ శిథిలాల్లానే కనబడేలా చేసిందే అన్న బాధకలిగింది, కాకతీయుల ఆలయం బయట పడి ఉన్న నల్ల శానపు నంది, శాసన శకలం, శివలింగం, కొత్త ఆలయం మెట్ల ముందు సప్త మాతల శిలాఫలకం, ఎడమవైపున స్థానికులు భద్రపరిచిన శాసన స్తంభం, అన్నీ చూచి, బయటకొచ్చిన మాకు పునర్నిర్మించిన గుడి, అలనాపాలనా నేటికీ నిర్లక్ష్యపు నీడల ఛాయలో అంటకాగుతుందేనన్న నిస్పృహ ఆవరించింది. అక్కడున్న శాసనాలు క్రిందబడి శ్వాస ఆడక ఇబ్బంది పడుతున్నాయి. కొండమీద శివాలయం పక్కన గుండు మీదున్న కళ్యాణీ చాళుక్య త్రిభువన మల్లదేవుని భార్య లక్ష్మీదేవి శాసనాన్ని శివాలయంలో 130 మంది ఎక్కటీలు(సైనికులు) వేయించిన కాకతీయ రుద్రదేవుని కాలపు(క్రీ.శ 1194) శాసనాన్ని, అదే అలయంలో మరో వంద మంది ఎక్కటీలు వేయించిన కాకతీయ గణపతిదేవుని కాలంనాటి(క్రీ.శ 1225) శాసనాన్ని చదివి, కొండపాక గ్రామం సైనికుల గ్రామంగా ఉండేదని తెలుసుకొన్నాను.

మళ్లీ ప్రయాణమై, దుద్దెడ చేరుకొన్నాం. అదృష్టవశాత్తు ఆలయం తలుపులు తెరచి ఉన్నాయి. శివాలయం లోనికెళ్లగానే, ఎడమవైపు అరుగుమీద ఒక జైన విగ్రహం నల్లరంగు పులుముకొని ఒక పక్కగా ఉంది. పక్కనుంది అనే కంటే పక్కన పెట్టారనాలి. ఆలయ గోడలు, స్తంభాలు, ద్వారశాఖలు, సప్తమాతలు శిల్పాలకు సున్నాన్ని దిట్టంగా కొట్టడంతో ఆ శిల్పాలు చారిత్రక ప్రాముఖ్యతను కోల్పోయాయి.

ఒకసారి ఆలయం చుట్టూ తిరిగాం. ప్రాకారం ఒకటో రెండో సార్లు జీర్ణోద్ధరణకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. బయటికొచ్చాం. రెండంతస్తుల ప్రవేశమండప స్థంభాలకు రంగేయటం మమ్మల్ని కుంగదీసింది. మధ్యయుగాల నాటి ఆ రెండంతస్తుల



మండపం ఆనుకొని ఇరువైపుల ఒక అధునాతన అద్దాల మేడను జోడించి, ఆలయ అధికారులు చేతులు దులుపుకోవటం, వారసత్వ ప్రేమికులుగా మేము నోరు వెళ్లబెట్టుకొన్నాం. చెట్టు కింద చాళుక్య శివలింగం, కాకతీయ నాగశిల్పం, కోనేరు గోడకు ఆనించిన చాముండి, భద్రకాళీ, అద్భుత శిల్పకళానైపుణ్యం గల చెన్నకేశవ వేణుగోపాల అర్ధస్వస్తిక విగ్రహాలు నిర్లక్ష్యానికి నిలువుటద్దాలు. చుట్టూ గడ్డీగాదం, పైనుంచి కాకిరెట్టలు, నోరు లేదు గాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఆ విగ్రహాలు ఎంతగా మొత్తుకొనేవో ! అక్కడే అల్లంతదూరంలో మౌనముద్రలో ఉన్న కాకతీయ ప్రతాపరుద్రుని కాలపు (క్రీ.శ.1296) శాసనాన్ని స్పృశించి, పరవశించిపోయాను. పోనుంగోపుర వరాధీశ్వరుడైన నాచయరెడ్డి గారి కొడుకు, కాకెత రాజ్యస్థాపనాచార్య మాదియరెడ్డి వారు దుద్దెడ స్వయంభూ దేవరకు ఆ వూరి అడ్డేవీట్ట, పెంట సుంకాలను మల్లించిన విషయాలను తెలుసుకొన్నాను. కారెక్కి, సిద్ధిపేటకు చేరుకున్నాం.

అహోబిలం కరుణాకర్ గారింట్లో భోజనాలు. ఆయన శ్రీమతి, పిల్లలు ఆతిథ్యానికి అర్థం చెప్పి, ఆదరణకు మారుపేరనిపించారు. కరుణాకర్ చుట్టుపక్క గ్రామాల నుంచి సేకరించిన కొత్త రాతియుగపు గొడ్డళ్లు, ఇనుప యుగపు నలుపు-ఎరుపు మట్టిపాత్రలు, చారిత్రక తొలి యుగపు మట్టిబొమ్మలు, కుండపెంకులు, మట్టిపూసలు, ఒకటేమిటి, ఆదిమ మానవుని అడుగుజాడల్ని అదిమిపట్టుకొన్న ఆనవాళ్లను ఒడిసిపట్టుకొని చరిత్రను కాపాడుతున్న తీరు ఆశ్చర్యం కలిగించింది.

అరటి ఆకుల్ని పరచి, చేమ ఆకుల్లో శనగపిండితో తయారు చేయించిన ఒక వంటకాన్ని వడ్డించారు. ఇది నాకు కొత్తయినా, ఆయుర్వేద ఆహారం కావటాన, ఔషధ గుణాలుండటాన, చాలా రుచిగా అనిపించింది. తక్కాళి పులుసు, టమాట పప్పు, కంద, దోస, సొరకాయ దప్పళం, కందినూక పచ్చడి, తెలంగాణ వడియాలు, ఊరమిరపకాయలు, ఆవకాయ, కమ్మని వాసన వెదజల్లుతున్న ఆవు నెయ్యి, పాయసం, మజ్జిగ చారు, రైతా, బగారా అన్నం, తెల్ల అన్నం, పప్పుల పొడి, దొండకాయ వేపుడు, తీరాంధ్రను మరిపించేట్లు మరగబెట్టిన పాలతో తయారైన పెరుగు, దానిలోకి నంజుకోవటానికి వంకాయ వరుగులు ఇలా అన్నిటినీ కొసరి కొసరి వడ్డించిన అన్నం తిన్న నేను సామలేటి మహేష్, చేయి అందిస్తేగానీ పైకి లేవలేక పోయాను. ఎవరో చెబితే విన్న 'భుక్తాయాసమన్న' మాట నిజమేననిపించింది.

కరుణాకర్‌గారింట పక్కనున్న ఆలయంలో, భైరవశిల్పాలు, పీఠం పైన తేళ్ల బొమ్మల్ని చూశాం. కళ్యాణ చాళుక్యుల కాలపు భైరవ శిల్పాలు రెండూ, గమ్మత్తైన జటాజూటాలను కలిగి ఉన్నాయి. అక్కడనుంచి, సిద్ధిపేటలోని పురాతన భోగేశ్వర స్వామి ఆలయ శిధిలాలను, శిధిల మండపంలోనే కబుర్లు చెప్పుకొంటున్న యువకులు, బయటివరుస రాళ్లు పడిపోయిన శివాలయం, పక్కనే కాకతీయుల కాలపు దీపపుస్తంభం, భైరవ, చెన్నకేశవ, సప్తమాతలు, శివలింగం, నంది వరసగా పాతిన నాగదేవత, మహిషమర్దని శిల్పాలు, ఆలనా పాలనా లేక ఆదుకోనే వారికోసం ఎదురు చూస్తున్నాయి. నేనూ, నసీరుద్దీన్, మళ్లీ నిట్టూర్పులు విడిచి, సిద్ధిపేట విడిచి వరదరాజపురం చేరుకొన్నాం. అక్కడ సువిశాల రంగనాయక దేవాలయాన్ని, ఆలయం ముందు మండపాలు ఆనుకొని కట్టిన నివాసగృహాలు మధ్య యుగ అనంతరం కాలపు ఆలయనిర్మాణరీతికి అచ్చెరువొందాం. ఇప్పటి ఆలయాలు, మండపాలు, దీపస్తంభాలు, శిలలు, శిల్పాలు, శాసనాలు, అవి పడుతున్న పాట్లను చూచి, ఈ శిధిలాలను పదిలపరిచే నాధుడే లేడా అని వగచి కాసేపు చెట్టు కింద జారబడ్డాను. సార్..... క్రీ.పూ. 1000 సం॥ల నాటి ఇనుపయుగపు నిలువురాయి(మెన్‌హిర్)ని చూపిస్తానన్న నసీరుద్దీను మాటలు, నా మనసులో ఆనందపు బాటలు వేశాయి. వెంటనే లేచి, మూడు కిలోమీటర్లు దూరంలో, వెంకటాపూర్ శివారులో చిన్న గుట్టపైకి వెళ్లాం. అక్కడున్న ఇనుప యుగపు సమాధులు, వాటి చుట్టూ పాతిన గుండురాళ్లు, బాగా వంగిపోయిన నిలువురాతిని పరిశీలిస్తున్నాం. ఇంతలో ఇద్దరు రైతులు వచ్చి, మేం నిధుల వేటగాళ్లమన్న అనుమానంతో యక్ష ప్రశ్నల్ని సంధించారు. వారికి మా గురించి చెప్పి, మళ్లీ బయల్దేరాం. ఉద్దమర్రిలోని అక్కన్న-మాదన్న దేవాలయం చూశాం. హిందూ దేవాలయమేగాని, ముస్లిం వాస్తురీతులు



కనబడుతున్నాయి. తరువాత నాగిశెట్టిపల్లి శివారులోని కేశారం పొలాల్లో ఉన్న ఇనుపయుగపు సమాధుల్ని, రామాలయం, కోనేరు, పాతదేవాలయాలను చూస్తుండగా సూర్యుడు కనుమరుగయ్యాడు. నసీరుద్దీన్ ఇక ఇవాల్టికి చాలన్నాడు. కారు జోరందుకుంది. వాన ఊపందుకొంది. ఒక అరగంటలో తుర్కపల్లి అడ్డరోడ్డులో



టీ తాగి, నసీరుద్దీన్ ఇచ్చిన వీడుకోలుతో నేను హైదరాబాదుకు బయలుదేరాను. మళ్లీ అవేగుళ్లు, అవే శిల్పాలు, శాసనాలు చుట్టుముట్టి ప్రశ్నిస్తున్నాయి. సమాధానాల కోసం వెతుకుతూ, వెతుకుతూ ఇంటికి చేరకున్నా.

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# తెలుగు నవల తడబాట్లు

**చాలా** భాషల సాహిత్యాల్లోలాగే తెలుగులోనూ నవల కథానికకు పెద్దన్నగానే పుట్టింది. తెలుగు కథ 1910 ప్రాంతాల్లో పుట్టిందనుకుంటే తెలుగునవల మాత్రం 1872 నాటికే పుట్టిందని తెలుస్తోంది. కథ, నవల అనే రెండు ప్రక్రియల ప్రయాణం సోదర ప్రక్రియల్లా అన్ని భాషల సాహిత్యాల్లోనూ సాగుతూవుంది. కథ, పాత్రచిత్రణ, కథనం, శిల్పం వంటి కొన్ని అంశాలు రెండింటిలోనూ దాదాపు. వొకే రకంగా వున్నప్పటికీ, వాటికి దేనికి దానిదైన ప్రత్యేక విలక్షణలూ వుండటంతో వేర్వేరు ప్రక్రియల్లాగే పరిగణనలూ, ప్రాచుర్యాలూ వున్నాయి. దాదాపుగా అందరు కథకులూ కొన్ని నవలలైనా రాశారు. అలాగే ప్రసిద్ధ నవలాకారులు కూడా కొన్ని కథలయినా రాశారు.

అమెరికా, యింగ్లాండు వంటి విదేశాల్లోనే గాకుండా భారతీయ భాషలైన హిందీ, తమిళమూ, మలయాళమూ, కన్నడాల్లో రెండు ప్రక్రియలకూ యెప్పుడూ దాదాపుగా వొకే రకమైన ప్రాచుర్యం వుంటోంది. అయితే తెలుగులో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితి కొనసాగడమే విచిత్రమైన విషయం.

కథలకూ, నవలలకూ, ప్రపంచ భాషలన్నిటిలోనూ యెప్పుడూ పత్రికలే ఆలంబనగా వుంటున్నాయి. అయితే చాలా భాషల్లో యే పత్రికలోనూ సీరియల్‌గా రాకుండా, వొకేసారి పుస్తకంగా వస్తున్న నవలలూ చాలావుంటున్నాయి. వాటిని బాగా చదివే పాఠకులూ, వెంటవెంటనే పునర్ముద్రణలు వస్తున్న నవలలూ చాలా పెద్ద సంఖ్యలోనే వుండడం గమనించవచ్చు. యింగ్లీషులో యిలా పుస్తకరూపంలోనే ముద్రణవుతున్న నవలలే యెక్కువగా వున్నాయి. భారతీయ భాషలైన హిందీ, తమిళమూ, కన్నడమూ, మలయాళాల్లో సైతం యిలా సీరియల్ రూపంలో రాకుండా నేరుగా నవలల్ని ప్రచురించడం విరివిగాసాగుతోంది. తెలుగులో నవలా పత్రియకున్న అవకాశాలూ, ప్రాచుర్యాలూ గతుకుల బాటలోనే సాగుతోంది. అందుకు యిప్పుడు నవలా రచనలకేర్పడిన గడ్డు పరిస్థితే తార్కాణం.

"తెలుగు నవల వీరేశలింగంపంతులు గారు రాజశేఖర చరిత్ర రాసిన నాటినుంచీ వంకర తిరుగుళ్ళు పోతూవుంది" – యీ మాట అన్నది పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు. ప్రపంచ చరిత్రనే తారుమారు చేసిన రెండవ ప్రపంచ యుద్ధ ప్రభావం తెలుగు నవలపైన కొద్దిగానైనా లేదనీ, అప్పటికి గొప్ప నవలా రచయితలుగా పేరు తెచ్చుకున్న వాళ్ళు కొంతమంది "గతకాలమే మేలు వచ్చు కాలము కంటెన్" అనే పద్ధతుల్లో మొహం తిప్పేసుకునే నవలలు రాశారనీ ఆయన వాపోతాడు. కానీ తరువాతి కాలంలో ప్రతిభావంతులైన నవలా రచయితలు ప్రయోగాత్మకంగానూ, విశ్లేషణాత్మకంగానూ, చారిత్రిక స్పృహ తోనూ, అభ్యుదయదృక్పథంతోనూ మంచి నవలలు రాశారు. స్వాతంత్ర్యానంతర కాలంలో పత్రికల రాకతో నవలా రచనకు గొప్ప ఆలంబన దొరికింది. 'భారతి' మాసపత్రిక కూడా సీరియల్ నవలల్ని ప్రచురించడం మొదలుపెట్టింది.

యీ సీరియల్ నవల అనే యింగ్లీషుమాటకు తమిళులు 'తొడర్‌కథై' అనే తమిళమాటను సృష్టించుకున్నారు. తెలుగు వాళ్ళు సశేషనవల అనే మాటను కొంతకాలం పాటు వాడారు కానీ దానికి ప్రాచుర్యం రాలేదు. నవలను హిందీ వాళ్ళు "వుపన్యాస్" అనీ, కన్నడం వాళ్ళు "కాదంబరి" అనీ పిలుస్తున్నారు. తెలుగు వాళ్ళు "నావల్" అనే యింగ్లీషు మాటను 'నవల'గా మార్చుకోడం బాగా కుదిరింది. తెలుగులో నవలకు కొత్త అనే అర్థం మాత్రమేగాకుండా స్త్రీ అనే అర్థం కూడా వుండడం ఆ మాటకు అదనపు ఆకర్షణ గానే వుంది.

మా చిన్నతనంలో, అంటే 1960–1975 మధ్య ప్రాంతాల్లో తెలుగులో నవలలకున్న ప్రాచుర్యం మరే యితర ప్రక్రియకూ వుండేదికాదు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వంటి ప్రాచుర్యముండే వార పత్రికలు సీరియల్ నవలల వల్లనే పాఠకలోకానికి సన్నిహితమయ్యాయని చరిత్ర చెప్తోంది. ఆయా పత్రికలు తరుచుగా జరిపిన నవలల పోటీలు చాలా ప్రాచుర్యమున్న నవలల్ని తీసుకొచ్చాయి. చాలామంది ప్రతిభావంతులైన నవలా రచయితలు నవలలు రాసినా, ఆ కాలంలో స్త్రీలు రాసిన నవలలు బాగా ప్రాచుర్యాన్ని పొందాయి. ఆంధ్రప్రభలో వారం వారం బాపుగారి అందమైన బొమ్మలతో సీరియల్ నవలలు వెలువడిన కాలం తెలుగు నవలలకు ప్రాచుర్యరీత్యా చూసినప్పుడు స్వర్ణ యుగమనిపించసాగింది.

సరిగ్గా 1970 ప్రాంతాల్లో 'ఎమెస్కో పాకెట్ బుక్స్' అనే పేరుతో ఆ సంస్థ నెలనెలా నాలుగు పుస్తకాల్ని ప్రచురించడం ప్రారంభించింది. ఆ పుస్తకాలలో తొంభై శాతానికి పైగా నవలలే వుండేవి. నవలా రచయిత్రుల నవలలతో చాలా సినిమాలకు కథల్ని సరపరా చేశాయి. రచయిత్రుల నవలలతో బాటూ కొంతమంది సంపాదకులు తరువాతి కాలంలో గొప్పవని పేరుతెచ్చుకున్న ''క్లాసిక్స్'' ను గూడా ప్రచురించగలిగారు.

1985 ప్రాంతాలకొచ్చేసరికి పాశ్చాత్య దేశాల్లో "పల్ప్" పేరిట ప్రచురించబడి, నవలను గొప్ప కాలక్షేపంగా మాత్రమే తయారుచేసిన రచనల ప్రభావం తెలుగునవలపై పడింది. ఆ వ్యాపార నవలల సంస్కృతి పెరుగుతూ వచ్చింది. యింతలో అంతర్జాలమూ, దూరదర్శన్, మొబైల్‌ఫోనుల దాడి మొదలయ్యింది. పాఠకులు తగ్గిపోయారు. పత్రికలు మూతబడ్డాయి. యీ విపత్కరమైన పరిస్థితిని కొంతవరకూ కథానిక తట్టుకుని నిలబడగలిగింది. కానీ **2000ల తర్వాత తెలుగు నవల మాత్రం పెద్ద సంక్షోభంలో పడింది. అందుకే నవలలు రాయగలిగిన రచయితలు కూడా మౌనంగా వుండిపోయారు.** ఆ గడ్డుకాలంలో కూడా కొన్ని దినపత్రికలు,

వారపత్రికలూ, మరికొన్ని మాసపత్రికలూ నవలల్ని సీరియళ్లుగా ప్రచురించాయి. కొన్ని పత్రికలు ప్రతినెలా నవలికల్ని తీసుకొచ్చాయి. కొన్ని మాసపత్రికలు నవలల పోటీల్ని కూడా నిర్వహించాయి. అయితే వాటిలో సాహిత్యస్థాయిని అందుకున్నవి చాలాతక్కువ. అంతేకాకుండా ఆ గడబిడలో వచ్చిన కొన్ని మంచి నవలల్ని పట్టించుకునే విమర్శకులు కూడా లేకపోయారు.

**గత యిరవై సంవత్సరాలుగా నవలల్ని సరిగ్గా పరిచయంచేసి, విమర్శించే విమర్శకులు కూడా బాగా తగ్గిపోవడం గమనించవచ్చు. నవలాపక్రియకే గాకుండా స్థూలంగా సాహిత్య విమర్శకులు బాగా తగ్గిపోవడం యిప్పుడు తెలుగుసాహిత్యం యెదుర్కొంటున్న పెద్ద సమస్య.** సాహిత్య విమర్శకు సరైన వేదికలు లేకపోవడం కూడా అందుకు పెద్ద కారణమైకూర్చుంది. వొకప్పుడు పత్రికలు గ్రంథవిమర్శల్ని సాధికారంగా నిర్వహించేవి. భారతి, ఆంధ్రప్రభ అంధ్రపత్రిక, యిండియాటుడే పత్రికల్లో మరీ సమగ్రంగా కాకపోయినా, చిత్తశుద్ధితో చదివి, సాకలంగా రాసే విమర్శలు వచ్చేవి. యిప్పుడు గ్రంథ పరిచయాలు మొక్కుబడిగా మాత్రమే జరుగుతున్నాయి. దినపత్రికల్లో వారానికొకసారి ప్రచురించే సాహిత్య శీర్షికలు గూడా క్రమంగా పలచబడుతున్నాయి. పాఠకుడికీ, పుస్తకానికీ మధ్య సంధానకర్తలుగా వుండాల్సిన పత్రికలూ, విమర్శకులూ తగ్గిపోవడం అందరూ గమనిస్తూనే వున్నారు.

అయితే మన పక్కనేవున్న తమిళనాడు, కర్ణాటక, మలమాళభాషల్లో, యీ పరిస్థితిలేదు. యిప్పటికీ యీమూడు భాషల్లోనూ వార, మాసపత్రికలు బాగా వస్తున్నాయి. పాఠకులు కొని చదువుతున్నారు. అక్కడ సీరియల్ నవలలేగాకుండా నేరుగా పుస్తకాలుగా వస్తున్న నవలలూ విరివిగా వుంటున్నాయి. మలయాళంలో ప్రాచుర్యముండే మంచినవలలకు యెప్పటి కప్పుడు పునర్ముద్రణలు వస్తూనేవున్నాయి. కన్నడంలో కొందరు గొప్పనవలా రచయితల నవలలు కనీసమంటే పది ముద్రణలయినా వస్తున్నాయి. ముప్పయి నలభై ముద్రణలున్న నవలలెన్నో వున్నాయి. మరి **తెలుగులో మాత్రమే పత్రికలన్నీ యెందుకు మూతబడ్డాయి? తెలుగులో ప్రసిద్ధ రచయితల గొప్ప పుస్తకాలు సైతం వేయి కాపీలయినా యెందుకు అమ్ముడుపోవడం లేదు?** యీ ప్రశ్నలకు నాకు దొరుకుతున్న సమాధానాలు రెండున్నాయి. వొకటి:- తెలుగువాళ్ళు మిగిలిన యీ మూడు భాషల వాళ్ళకంటే అయిదారు రెట్లు యెక్కువ మంది వున్నారు. రెండు: తెలుగువాళ్ళు సంస్కృతీ, సాహిత్యమూ పట్టని వ్యాపారజాతి అని నిరూపించుకున్నారు.

యిది కోపంతోనూ, విమర్శగాను, చెప్తున్న మాటకాదు. బాధతోనూ, విరక్తితోనూ అంటున్న మాట! **తెలుగువాళ్ళ సాంస్కృతిక సాహిత్య పరిణితికి యిప్పుడు నవల పెద్ద కొలబద్దగా మాత్రం తయారయింది.**

అయితే యింతటి చీకటిలోనూ నవల యిప్పుడున్నంత మాత్రం గానయినా నిలబడగలగడానికి కృషి చేస్తున్న అమెరికాలోని తానా, ఆటా సంస్థల కృషిని యిప్పుడు ప్రత్యేకంగా పేర్కొనవలసివుంది. అప్పుడప్పుడూ ఆగుతూ, మళ్లీ కొనసాగిస్తున్న నవలా పోటీలను యిప్పుడు తానా రెండేళ్ళకొకసారీ, యీ పనిని ఆది కూడా యిప్పుడు యేడాది విడచీ యేడాదీ నిర్వహించడంతో సంవత్సరానికొక పోటీ వుంటోంది. ఆయా పోటీల్లో బహుమతులు పొందిన నవలలకు వొకరకమైన ప్రత్యేక పరిగణన వుంటుంది. వాటికి కొంత గణనీయమైన పాఠకులూ వుంటున్నారు.

యీ పోటీలకు ప్రతిసారీ దగ్గర దగ్గర వంద నవలలు వస్తున్నాయి. అంటే ప్రచురణకు సరైన వేదికలు లేకపోయినా, పోటీలు మాత్రమే ఆధారమైనా, అంతమంది రచయితలు రాస్తూ వుండడం సామాన్యమైన విషయంగాదు. ఆ వొకటి రెండు నవలలు మాత్రం ప్రచురించబడతాయి. మిగిలిన నవలలకు వెలుగుచూసే అవకాశం మృగ్యమై పోతోంది. యిదొక విషాదం.

పోటీకొచ్చిన నవలల్లో కనీసం ప్రచురణార్హమైన నవలలెన్ని వస్తున్నాయన్నది మరోముఖ్యమైన ప్రశ్న. కొన్ని పోటీల్లో చివరికి వొకటో రెండో కనీసం ప్రచురణార్హమైన నవల దొరుకుతుందా లేదా అని న్యాయనిర్ణేతలు కంగారు పడవలసిన పరిస్థితి యేర్పడుతోంది. నవలా రచనను వొక సాధనగా, సవాలుగా స్వీకంచిన రచయితల సంఖ్య బాగా తగ్గిపోవడం ప్రమాద సంకేతాన్ని ముందుకు తెస్తోంది. యేదో వొక పోటీ ప్రకటన రాగానే, గుమాస్తాల్లా, యాంత్రికంగా వారం పదిరోజుల్లో నవలనే వండి పోటీకి పంపే నవలా రచయితలే యెక్కువగా కనబడుతున్నారు.

నవలా రచన వొక పెద్ద స్టీమర్ని తయారుచేసి సముద్రయానం చేయడంలాంటిదని లాటిన్ అమెరిక్ విమర్శకుడొకాయన చెప్తాడు. టాల్‌స్టాయ్ "వార్ అండ్ పీస్", "అన్నాకెరీనా" నవలల్ని రాయడానికి మూడు నుంచీ అయిదు సంవత్సరాల దాకా తీసుకున్నాడు. డాస్టోవిస్కీ "బ్రదర్ కరమజోవ్" రాయడానికి రెండేళ్లపైగా పట్టింది. "డేవిడ్ కాపర్ ఫీల్డ్" మూడేళ్ళు రాశాక, ఆ నవల రాయడం ముగిశాక, రేపటి నుంచీ యెవరితో బతకాలి నేను అని చార్లెస్ డికెన్స్ బాధలో మునిగిపోయాడు. తెలుగులో కూడా గొప్ప నవలల్ని రాయడానికి చాలా సంవత్సరాలే పట్టాయి.

నవలా రచనకు వొక ప్రణాళిక, దాని ఆవిష్కరణకు సాధనా, ప్రయోగశీలతా చాలా అవసరం. ప్రతి నవలా రచయితా గొప్ప పాఠకుడైవుండాలి. యిప్పుడు ప్రపంచమంతా వొక గ్రామంలా మారిపోవడంతో యే మారు మూల దేశంలో గొప్ప నవల వెలువడినా అది యింగ్లీషు అనువాదంతో అందరికీ చేరువవుతొంది. ప్రతీ నెలా వొక పెద్ద ప్రపంచాన్ని సమగ్రంగా ఆవిష్కరించేలా రూపొందుతోంది. అటువంటి నవలా రచనకు సమగ్రమైన దృష్టీ, సమకాలీన సాహిత్య పరిచయం, ప్రయోగాల్ని సవాలుగా స్వీకరించే ఆత్మవిశ్వాసం, చాలా కాలం పాటు సాధన చేయగలిగే స్థితప్రజ్ఞతా చాలా అవసరం.

కథానిక కంటే నవలలో రచయిత వ్యక్తిత్వం స్పష్టంగా ఆవరించి వుంటుంది. నవలా రచన అన్నది రచయిత తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునే క్రమంలోనే పుడుతుంది. అందుకే నవలలో అందరికంటే యెక్కువగా ఆకర్షణీయంగా అవిష్కరించబడే పాత్ర

**కవిత**

## వలువలు

నిస్సిగ్గుగ నేనిప్పుడు నగ్న రూపాన్ని
వలువలు ఒలచబడ్డ దిగంబర నిశాచరాన్ని
విలువలు మరచిన దళారుల దొమ్మీలో
అత్యాచారం కాబడ్డ అమాయకాన్ని!

పరాయి దుస్తులనే తృణించిన తాతల వాసన
తలపు పగిలి ఇంకిన ఆనవాలు ఇంకా లేదు
దొరతనాన్ని తరిమేసి విప్పారి నిల్చున్న గుండె
ఒరిగిన చిరునామా ఏదీ ఇంకా చిత్రికపట్టలేదు
ప్రపంచ గోళంపై ఎగిరిన పతాక
ఇంకా రంగువెలియనూలేదు.
ఏ దురుద్దేశపు కౌగిలిలో మురిసి
నిన్ను నువ్వు మరిచేవో గానీ
అర్ధాక్షరమాలతో నా నగ్నత్వాన్ని
తరాజులో ఉంచలేవు
సవతి ప్రేమతో నా దేహాన్ని
బంగారంలో ముంచలేవు
నీవో, మరొకరో
ఎంగిలిపడ్డ మెతుకులకై మోకరిల్లవచ్చు
నీలో మరొకడు కొత్త పల్లవులు
పరధ్యానంలో పారేసుకోవచ్చు

నేను మాత్రం
అమ్మపాలతో ఉవ్వెత్తున ఎగసిన తారాజువ్వని
అమ్మ ఒడిలో ఊసు పోసుకున్న ఉషోదయ చారికను
అమ్మ నుడిలో నడత నేర్చిన నవమానవుడను

భజనదాసుల మోసపు పూతలతో
తనువు మరచిన తిరోగమన సిద్ధాంతకర్తా
కనులకు చెవులుంటే తేరిపారా చూసుకో
పగిలిపోతున్న నీ మూలాల గుండె మూల్గులు
నీ చెవులకు కళ్ళుంటే చూసి అలవై ఎగసిపడు
ఆ అడుగుజాడల ఆడంబరాలు
విశ్వ సమ్మోహన శక్తిమతి నా నుడి జడి
విశాల మేథోసంపత్తి కృతి నా భాషామతి
సెలయేటి సొబగు.. ఓ ఎంకి వలపు
అవధుల్లేని అవధానం. అనంత పద్యప్రాకారం

పంచవర్ష ప్రణాళికలో నరనరుడినీ దేబిరించి
పాలించే నీ రాజకీయానికి అక్కరకు రానిది
పాలుకుడిచే వాడికెందుకురా ఆ పరాయి భాష!

కూర్చున్న కొమ్మని నరికేవాడి
కన్నుల్లో పొడుచుకునే వాడి
అమ్మ రొమ్ము గుద్దేవాడి
వారసత్వ లక్షణాలు పోత పోసుకున్న
ఓ అపరమేథావీ.. !!

నా దారిలో విసిరిన ముళ్ళన్నీ ఏరేయ్!
నా తొలి పలుకుల అక్షర వలువలు నాకొదిలేయ్!!

కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్
98484 28978

నవలా రచయితదే అయివుంటుంది. జీవితంలోంకి వస్తువును యెన్నుకోవడంలోను యెన్నుకున్న వస్తువును సరైన పద్ధతిలో తీర్చిదిద్దుకోవడంలోనూ, తీర్చిదిద్దుకున్న కథను నవలగా విస్తరించడంలోనూ రచయితదైన వ్యక్తిత్వం ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

అయితే **యే భాషలోనయినా కాలానికి నిలబడే సత్తావుండే నవలలు అరుదుగానే వస్తాయి. పత్రికలు తామరతంపరగా సీరియళ్లుగా ప్రచురించినా, పెద్ద సంస్థలు చాలా పెద్ద మొత్తాల్లో బహుమతుల్ని ప్రకటించినా గొప్పనవలలు పుట్టుకురావు. యిదొక పెద్ద సాధన. ఆ సాధనకు పత్రికలూ, బహుమతులూ దోహదం చేస్తాయి.**

ఆటా, తానా సంస్థల వల్ల సంవత్సరానికి మూడు నాలుగు నవలల కంటే యెక్కువగా ప్రచురణలు రాలేవు. యిలా ప్రోత్సహించే సంస్థలూ విరివిగా వుండాలి. పాఠకులు పఠనంలో వుండే గొప్పతనాన్ని తెలుసుకోవాలి చదవడం కంటే మించిన అనందం మరేయితర మాధ్యమంలోనూ వుండదని గ్రహించాలి. **నవలా రచయితలు రచనను మరింత సాధికారమైన సాధనంగా గుర్తించాలి.**

భారతీయ భాషల్లోనే గాకుండా విదేశాల్లోకూడా నవలలు సినిమాలకు గొప్ప వస్తువును సమకూరుస్తున్నాయి. మిగిలిన వాళ్ళతో పోలిస్తే తెలుగులోనే గొప్ప కథలనూ, నవలలనూ సినిమావాళ్ళు తక్కువగా పట్టించుకుంటున్నారు. తెలుగు సినిమా మిగిలిన భారతీయ భాషల సినిమాల్లా గాకుండా పెద్ద వ్యాపారంగా మాత్రమే రాణిస్తోంది. అందుకే తెలుగు సినిమా మూసలోంచి బయట పడనేలేదు. కన్నడంలోని ప్రసిద్ధ నవలలన్నీ సినిమాలయ్యాయి.

గొప్ప నవలల్ని వొక సారిగా కాకుండా చాలా సార్లు సినిమాలుగా తీయడం గూడా పాశ్చాత్య ప్రపంచంలో జరిగింది. వొక సాహిత్య ప్రక్రియగా నవల సినిమాకంటే యెంత బలమైన ప్రక్రియో అందువల్ల తెలిసోస్తుంది.

వెనక్కి తిరిగి చూసినప్పుడు తెలుగులో ప్రపంచస్థాయికి చేరే నవలలు నాలుగైదయినా వున్నందుకు మనం సంతోషించాలి. తెలుగు నవల యెక్కవలసిన శిఖరాలూ, పొందవలసిన ప్రాచుర్యాలూ చాలావున్నాయి. యీ సంక్లిష్టమైన పరిస్థితిలోంచీ బయటపడి ముందుకు సాగడానికి పాఠకులూ, పత్రికలూ, సంస్థలూ, రచయితలూ చేయవలసిన పని యెంతో వుంది. యీ సంధి కాలంలో మనం ఆత్మవిమర్శ చేసుకోవల్సిన అవసరం చాలావుంది.

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209



**6**

**ధ**ర్మపురిలా కాలేజికి చేరినంక ఒగనాడు గవర్నమెంటు లైబ్రరీకి పోతిని. పెద్ద చదువులు చదివేకి ఆంధ్రానింకా వచ్చిండే కొందరు చిన్నోళ్లు అబిటికే ఆడ నిలిచిండారు. వాళ్లని చూసి లైబ్రేరియన్ "మీరు ఆంధ్రానా" అనె.

వాళ్లు "యా" అనిరి.

"తెలుగుబుక్కులు ఆపక్క వుండాయి పోండా" అని తమిళంలా చెప్పె.

"మాకు తెలుగుబుక్కులు వద్దు. ఇంగ్లీషుబుక్కులు కావాల"అని అడిగిరి.

ఆయప్ప వాళ్లని అదో మాదిరిగా చూస్తా "ఈపక్క పోండా" అనె.

వీళ్లెవరప్పా సరైన తిక్కలు పట్టిన తెలుగు వాళ్లున్నట్లుండారు. అనుకొంటా నేను పోయి తెలుగుబుక్కులు చదవతా వుండా.

"ఏ వూరప్పా నీది.. ఆంధ్రానా?" ఒగ ముసలప్ప అడిగె.

"ఓసూరు తాతా" అంటిని. అంతే ఆ ముసలప్ప నేను లైబ్రరీలా బుక్కు సదవేగంటా అదే వుండి, నేను ఇవతలకి వచ్చినంక తను వచ్చె.

"ఇంట్లో అబ్బా అమ్మా బాగుండారాప్పా, ఏం పేరు నీది?" అనె. నేను చెప్పితిని. ఇట్లా మాట్లాడతా పక్కలా వుండే పార్కులాకి పోతిమి.

"అవును ఈ లైబ్రరీకి తెలుగుబుక్కులు ఎట్ల వచ్చె తాతా" అంటిని.

"ఇంగ్లీషువాని కాలములా కట్టిన లైబ్రరీ ఇది. ఆ కాలములా మా తాతముత్తాతలంతా చదివింది తెలుగే. నా కాలానికి వచ్చే తలికి తమిళం చదవాల్సి వచ్చె. ఆ లైబ్రరీ గోడలాని రాయిపైన తెలుగులా దాని పుట్టుపూర్వోత్తరాలు రాసిండారు. కావాలంటే నువ్వే చదువు" అనిరి తాత.

"ఆ కాలములా తెలుగు అంతగా వుంటే ఇబుడు ఏమాయె? తెలుగుజనం ఏమయిరి? ఈడ ఎవరూ తెలుగు మాట్లాడే లేదు" అడిగితిని.

"దానికి చానా కారణాలు వుండాయి. మద్రాస్ స్టేట్ వుండే తబుడు ఎవరికీ ఏ బాదా వుండలే. ఎవరి బాస వాళ్లు మాట్లాడతా, చదవతా వుండిరి. తెలుగు వాళ్లు మాకు వేరే రాష్ట్రము కావాలని పోరాడి, చిక్కిందే తెలుగురాజ్యము అనుకొని హాయిగా వుండేసిరి. కాని ఇక్కడ తమిళవాళ్లనింకా అబుడే గలాటాలు సురువాయె. తమిళ సర్కారు కూడా ఇక్కడ వుండిన తెలుగుస్కూళ్లని మూసె. ఇదేమని అడిగినోళ్లని, "మీకు ఆంధ్రా వచ్చేసె కదా ఈడేం పని ఆడికి పోండి. వందేరియే వెళియపో" (వలస వచ్చినవాడా వెళ్లిపో) అంటా కొన్ని తమిళపార్టీలు గలాటాలు సురువు చేసె. దాంట్లో ఒగ పార్టీ నాయకుడైతే ఎబుడూ ఇక్కడి తెలుగువాళ్లని తిట్టేదే పనిగా పెట్టుకొనె. ఈనడుమ అయితే ఇక్కడి తెలుగువాళ్లు ఉగాది పండగ చేయకూడదు, తమిళనాడులా వుండే వాళ్లంతా తమిళమే మాట్లాడాలా అని కూతలు కూస్తా వుండాడు. ఈడ పుట్టి ఈడ పెరిగిన వాళ్లము ఏడికి పోయేకి అవుతుంది. మా బాద ఎవరికి చెప్పాలనో ఏమి చేయాలనో తెలీక తమిళము చదివేకి మాట్లాడేకి సురువు చేస్తిమి. ఇబుడు ఇండ్లలా మాత్రము తెలుగు మాట్లాడతాము. అయితే మీ ఓసూరోళ్లు అట్ల కాదు, మాకు తెలుగే కావాలని, మేము తెలుగే చదవతామని గలాటాలు చేసిరి. ఎందరో జైళ్లకి పోయిరి. ఇబుటికీ తెలుగు కోసరము పోరాడతా వుండారు. తమిళనాడులాని తెలుగువాళ్లకి గుండెకాయ అట్లప్పా మీరు" తాత చెప్పతా వుండాడు.

ఓసూరులా వుండే తెలుగు వాళ్లది ఒగ బాద, ఈడుండే తెలుగు వాళ్లది ఇంగో బాద, అనుకొంటా ఆడనింకా లేసి రూంకి పోతిని.

కాలేజికి పోయిన వారం బాగానే వుండె. ఆ మీట మా సీనియర్లు ర్యాగింగ్ స్టాట్ చేసిరి.

మా క్లాసువాళ్లని ఆడిపిచ్చి పాడిపిచ్చి నాతావుకు వచ్చిరి.

నేను తెలుగువాడని తెలుసుకొని ఒగడు నా తావుకి వచ్చి "ఓసూరు కర్నాటక బార్డర్‌లా వుంది, ఉంటే ఆడ కన్నడంవాళ్లు వుండాలే కాని తెలుగువాళ్లు మీరెట్ల వస్తిరి" అని తమిళంలా అనె.

"ఓసూరులానే కాదు తమిళనాడంతా తెలుగువాళ్లు వుండారు" నేను అంటిని.

"అట్లనా నాకు తెలీదురా రా.. రా.." అంటా నా చేతికి అగ్గి పెట్టె ఇచ్చి రూమంతా కొలీమనిరి. నేను అగ్గిపుల్ల తీసుకొని రూంని

కొలస్తా పోతా వుండా.

"బాగా కొలీరా గొల్టి" (తెలుగువారిని తమిళులు తిట్టే తిట్టు ఇది) అనె ఒగడు. "వందేరియే" అని ఇంగొాడు ఏదో చెప్పేకి వచ్చె. అంతలానే నేను అగ్గిపెట్టి తీసుకొని వాని మూతి పైన ఒగటి ఇస్తిని.

నేనట్లా చేసేతలికి వాళ్లంతా షాకైపోయిరి. అట్లే తేరుకొని ఒగడు నన్ను తన్నేకి వచ్చె. అంతలానే నా రూంమేట్ ఒగడు వాణ్ని అడ్డమేసె.

నిన్ను అట్ల చేస్తాం, ఇట్ల చేస్తాం అంటా వాగిరి. నేనూ తమిళంలా, తెలుగులా నోటికొచ్చింది అనేస్తిని.

రెండోనాడు కాలేజికి పోతానే "వందేరి" అని ఒగడు పిలిస్తే, ఇంగొాగడు "గొల్టి" అని గేలిచేసేది సురువు చేసిరి.

నాకు రేగిపోయె. నాకు ఈ కాలేజీ వొద్దు చదువూ వొద్దు అని ఆడనింకా రూంకి వస్తిని.

బేజారుగా వుందని టీ తాగుదామని అంగడి తావున టీ తాగతా వుండా. బుజంపైన ఎవురో చెయ్యి వేసిరి. తల పైకెత్తి చూస్తిని. మొన్న లైబ్రరీలా కనిపించిన తాత.

"ఇందప్పా ఒగబుడు మీ ఓసూరోళ్లు నడపతా వుండిన పత్రికలు ఇవి" అంటా రెండు తెలుగుపత్రికలు నాకిచ్చిరి.

నేను ఆత్రముగా తీసుకొని చూస్తిని.

రత్నగిరి పత్రిక ఏప్రిల్-మే-1928. సంపాదకులు కన్నెల్లి మునిరెడ్డి, పత్రికా కార్యాలయము కాళినాయకనపల్లి, కెలమంగలము పోష్టు, శేలం జిల్లా. పత్రిక పైన పేర్లు మెరస్తా కనిపిచ్చె.

ఇంగ రెండోపత్రిక "ప్రజారంజిని" జనవరి 1965. ఎడిటర్ ఎన్.వెంకటస్వామి రెడ్డి, బెంగళూరు అని వుంది.

ఈ రెండు పత్రికల్ని చూసి నాకు చానా కుశాలాయె.

ఓసూరు వాణి అనే తెలుగుపత్రిక ఈనడమ వస్తా వుంది తాతా. దీన్ని మాచనాయకనపల్లి మునిస్వామి అనే ఆయన నడపతా వుండారు అంటిని.

ఇట్ల రవంతసేపు మాట్లాడుకొన్నెంక నా బాదనంతా తాత తావ చెప్పితిని.

"నువ్వు రేపు మీ ఇంట్లోవాళ్లని ఇద్దర్ని రమ్మను. నేను వాళ్ల పని చెప్పతా" అని పోయే తాత.

నేను ఇంట్లోవాళ్లని కాకుండా వీదిలావాళ్లని పిలిస్తిని. అంటే నా సావాసగాళ్లని.

తాత ఒగ గంధ్రకోతి మొకము వాన్ని నాకు చూపిచ్చి "వీన్ని మీవాళ్ల కూడా పిలుచుకొని కాలేజికి పో" అనె.

నేను అట్లే చేస్తిని.

మా సీనియర్లంతా కాలేజీ గ్రౌండ్‌లా అరట్లు కొడతా వుండారు.

గంధ్రకోతి మొకమోడు ముందర నడస్తా వుంటే వాని వెనక నేను, నా వెనక నా సావాసగాళ్లు వస్తా వుండారు.

నన్ను చూస్తానే తిడతారు, గేలి చేస్తారు, వాళ్లందరి తోలు ఈ పొద్దు తీసేయాలని నేను వాళ్ల దగ్గరికి పోతిని.

నన్ను చూస్తానే వాళ్ల మొకాలు గంధ్రకోతి మొకాలు మాదిరిగా అయిపోయె. నాకు అచ్చెరము అయ్యె.

ఇదేమని నేను ఒగొాగరి మొకాలు చూస్తిని.

వాళ్లంతా గంధ్రకోతి మొకమోన్ని చూస్తా వుండారు.

"ఓహ్! ఇదా అసలు సమాచారము" అని నాకు అబుడు అర్థము ఆయె.

"నిన్ని తిట్టింది ఎవురు, తన్నేకి వచ్చింది ఎవురు" అని నా సావాసగాడు అడిగె.

వీడు నా సావాసగాడే కానీ నాయట్లా వాళ్లని ఒగేకిత నలుగుర్ని ఎత్తి పారేస్తాడు. అట్లా దేహము వానిది.

నేను చూపించింది తడువు వాళ్లని గుద్దతా, చిక్కినోళ్ల చెండాట, ఉద్లు చెండాట ఆడతా వుండాడు.

వాళ్ల జతగాన్ని నా సావాసగాడు అట్ల ఆట ఆడి ఉతకతా వుంటే కూడా వాళ్ల చూపు గంధ్రకోతి మొకము వాని పైనే వుంది.

"ఇంగ మేము వాని తంటకి పోయేదు మమ్మల్ని విడునా" అని మా సీనియర్లంతా గంధ్రకోతి మొకమువాని కాళ్లమింద పడిరి.

అబుడు వాడు నా పక్క చూసి, "ఇంగమీట వాళ్లు నీ తంటకి వచ్చెలే. నువ్వేమి దిగులు పడొద్దు, ఈ పొద్దునింకానే కాలేజికి పో" అని పోయె.

ఆపొద్దు మాపుసారి తాతని కలసి కాలేజీలా నడసింది చెప్పితిని. 'కోతులని తరమాలంటే గంధ్రకోతి రావాలప్పా" అంటా నగి నగి పెట్టె తాత.

ఆపొద్దునింకా నేనూ తాతా అబుడబుడు కలుసుకొనేది మాట్లాడేది చేస్తావుంటిమి. కొన్నాళ్లకి మంచి సావాసగాళ్లైతిమి.

పొద్దప్పుడు బూమమ్మకి ఎండని ఇచ్చేదే కాదు, అబుడబుడు మండిస్తాడు. ఇదే చేసిండాడు ఈపొద్దు. నేలంతా నెరలు (పగుళ్లు) వచ్చి గాలి ఉడుకైపోయింది. నాకు చానా ఉడుకు (వేడి) అంటే అయ్యెలే. పార్కుకు పోతే రవంత చల్లగా వుంటుందని ఆడికి పోతిని. అబిటికే తాత ఆడ కూకొని వుండాడు. ఇద్దరం చానా చానా మాట్లాడితిమి. అట్ల మాటలు మాట్లాడతా తాత "సిగరేటు ఉందాప్పా" అని నన్ను అడిగె.

"నీ పాసుకూల నువ్వు సరైన, ముసలినాయాలు వున్నెట్ల వుండావు. నీ కండ్లకి నేను సిగరేటు తాగేవాని మాద్రిగా కనిపిస్తానా" గాబరిగా అంటిని.

"అహహా! ఏమంటివిరా, ఎట్లా మాటంటివిరా ఓసూరోడా, నన్ని ఇంగమీట ముసలినాయాల అనే పిలు" అంటా నగతా వుండాడు.

"నువ్వు పెద్దోడివి, నేను గాబరిలా అట్లనేస్తిని, నేను తాత అని పిలస్తాను" అంటిని.

"పోని ముసలి అనికానీ ముసలోడా అనికానీ పిలువురా" అంటా బేళాడే (బ్రతిమిలాడె).

ఆ పొద్దునింకా "ఏం ముసలి?" అంటా నేను. "చెప్పరా ఓసూరోడా" అంటా తాత. బలేగా జత అయితిమి.

కాలేజికి వారం దినాలు బిడువు ఇచ్చిండారు. వూరికి పోదామని అన్నీ సర్దుకొంటా వుండా, అంతలానే ముసలి ఫోన్ చేసి ఏడుండావు అని అడిగే రూంలా వుండాను అంట్ని. ఆడే వుండు వస్తా అని ఫోను పెట్టేసె.

రవంత సేపటికి రూం తావుకి వచ్చి, "నేను ఒగ పనిమీద మద్రాసుకి పోతా వుండా, నువ్వు రారా పోదాము" చేర్‌పైన కూకొంటా అనె.

"నువ్వు పెండ్లిపెటాకులు లేనోడివి. గాలిపటము మాదిరి

తరువాయి 49వ పుటలో....

ఆత్మకథ

కన్నడ మూలం: డా.చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

4

### కంటతడి పెట్టిన నాన్న

నాకు అప్పుడు ఇరవై ఏళ్ళు.

అప్పటికే కళాప్రదర్శనలో ప్రవేశం ఉంది.

కళను శ్రద్ధగా అభ్యసించాను.

చిన్నచిన్న పాత్రలను చేశాను.

సుమారు రెండేళ్ళ ఆట అనుభవమూ ఉంది.

అయితే నాన్న దృష్టిలో నేనింకా ఆట ప్రదర్శించే సామర్థ్యం ఉన్న కళాకారుడిని కాను.

ఆ కారణంగా పెద్దపెద్ద పాత్రలను చేయటానికి అవకాశం కల్పించలేదు.

అది నాకు చాలా బాధ కలిగించింది. అయినా నాన్న మీద ఒక్కసారి కూడా కోపం తెచ్చుకోలేదు. ఎందుకంటే ప్రతిభావంతులైన కళాకారులు మా మేళంలో ఉండేవారు. అంతేకాకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఊళ్ళోనూ గొంబెగౌడ ప్రదర్శన బాగాలేదని పేరు తెచ్చుకోవటానికి నాన్న సిద్ధంగా ఉండలేదు. అందువల్ల నాకు ప్రముఖ పాత్రను ఇవ్వడానికి వెనుకాడేవారు. అయితే ఈ రోజు కాకపోయినా ఏనాటికైనా ప్రముఖ పాత్రను చేసే అవకాశం తప్పకుండా దొరుకుతుందనే నమ్మకంతో నాకుంది. అందుకు ఇంకా కష్టపడాలని అర్థమైంది. అయితే చిన్నవయసుకదా, తొందరపడేవాడిని. పైగా వేడిరక్తం యువకుడిని.

ఆ సమయంలో గదగ్ కె.ఇ.బి. వాళ్ళు ఆటప్రదర్శనకు 'ఇళెవు' ఇచ్చారు. దూరంలో ఉన్న ఊరికి వెళ్ళి ఆట ప్రదర్శించడానికి సంతోషంగా మేళం సభ్యులు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం భోజనానికి చద్దికట్టుకుని ఎద్దుల బండిలో బయలుదేరాం. ఆ రోజుల్లో ఆట ప్రదర్శనకు దూరం ఊరికి వెళ్ళడమంటే చాలా ఉత్సాహంతో ఎగిరి గంతులేసేవాళ్ళం. ఈ రోజు బయటి దేశాలకు వెళ్ళివచ్చినా అంత సంతోషం కలగదు. దూరంలోని ఊరికి ఆట కోసం వెళ్ళే సందర్భంలో ఆటకు రెండ రోజుల ముందు ప్రాక్టీస్ చేసేవాళ్ళం. అలా అన్ని విధాలుగా సిద్ధం చేసుకుని బయలుదేరాం.

ఆ రోజు మా అన్నయ్య వీరన్న 'నాకు ధారవాడలో కీర్తన కార్యక్రమం ఉంది' అని చెప్పి హుబ్బళ్ళిలో బండిదిగి వెళ్ళిపోయాడు.

హుబ్బళ్ళి మఠం కార్యక్రమం అంటే అతను తప్పకుండా వెళ్ళేవాడు. ఎట్టి పరిస్థితుల్లో మానేవాడు కాదు.

హుబ్బళ్ళి మఠం స్వాములకూ, అన్నయ్యకూ ఆత్మీయ సంబంధం ఉండేది.

ఈ గురుశిష్యుల సంబంధం మఠానికీ, మా వంశానికీ తాతయ్య కాలం నుంచీ ఉన్నప్పటికీ అప్పుడున్న శ్రీశివయోగి స్వామిగారితో, అన్నయ్య ఎక్కువ సంపర్కాన్ని పెట్టుకున్నారు. మఠం సేవ అంటే అతనికి చాలా ఇష్టం. (ఈ విషయం చెబుతున్నప్పుడు దేవరహుబ్బళ్ళి శ్రీ నాగభూషణ శివయోగుల చరితామృతం-లే:శాంతలా యద్రామి,సం:1988, కృతిలో వీరన్న గౌడ గురించి రాసిన కొన్ని వివరాలను రామనగౌడ చదివారు)

'దేవరహుబ్బళ్ళి మఠం కట్టడం పని జరుగుతోంది. వీరన్నగౌడ తనంతట తాను సేవను కల్పించుకుని రావటం చూసి శివయోగులు హర్షితులయ్యారు. దేవరహుబ్బళ్ళిలోని కంబార జానక్క, అంతరవళ్ళి వీరన్నగౌడ ఇద్దరూ కలిసి గానుగ తిప్పుతున్నారు. చేతుల్లో బొబ్బలు ఏర్పడ్డాయి. అవి పగిలి నీళ్ళు కారుతున్నప్పటికీ వీరన్నగౌడ ఆ సేవ నుంచి వెనక్కు తగ్గలేదు. చేతులు మొద్దుబారిపోయాయి. వీళ్ళు గచ్చు తిప్పుతున్న చోటుకు దగ్గర్లోనే చెట్టునీడలో కూర్చున్న శివయోగులు మృదువుగా మాట్లాడుతున్నారు. వారు మాటల్లోనే తేనెను, తీయటి ఫలాన్ని కలిపి తినిపిస్తున్నట్టుగా ఉంది. ఆయన మాటలతో వారి ఆయాసాన్ని పోగొడుతున్నారు....' ( పుట 386)

'మఠంలో పురాణ ప్రవచనలు చేసేవాడతను. అనేక మహిమలు చూపిన వివరాలు ఉన్నాయి. ఒకరోజు గానుగ తిప్పటం ముగించిన తరువాత సాయంకాలం పక్కీరప్ప, వీరన్నగౌడలు మఠం నుంచి బయటకి వెళుతున్నారు.. అక్కడే శివయోగులు కూర్చుని ఉన్నారు. మామిడి చెట్టకింద వీరన్నగౌడ నడుస్తున్నాడు. ఆకుల కింద సరసరమని వెళుతున్న భయంకర సర్పాన్ని గమనించకుండా దాని అడుగు వేశాడు. అది కోపంతో కాటువేసి సరసరమని వెళ్ళిపోయింది. పాము వెళ్ళిపోవటం చూస్తూ నిలుచున్న పక్కీరప్ప నోట మాటరాక తడబడుతూ శివయోగుల దగ్గరికి పరుగెత్తి, 'అయ్యా గౌడను పాము కరిచింది' అన్నాడు. ఆ మాట వినగానే దిగ్గున లేచిన శివయోగులు వీరన్న దగ్గరికి వచ్చారు. అప్పటికే గౌడకు విషం ఎక్కసాగింది...' పుట: 386) అలాంటి సందర్భంలోనూ వీరన్న గౌడ నాకు చీమ కుట్టింది అని చెప్పి సమాధానపరిచారు. అప్పుడు గౌడ జున్ను తెప్పించుకుని తిన్నారు. ఆయనకు ఏమీ కాలేదు. అలాంటి అనేక మహిమలు చేసేవారు. ఈ విషయం తెలిసి కొందరు కొందరు ఇప్పటికీ మా వంశన్ని 'మహాత్ముల వంశం' అని అంటారు.

ఆ రోజు అన్నయ్య ఎద్దుల బండించి నుంచి దిగి వెళ్ళినందుకు



నాన్న కోగించుకున్నారు.

పనికిరానివాడని తిట్టారు.

విపరీతంగా కోపం వచ్చినపుడు మాత్రం అలా తిట్టేవారు.

'ఇతను ఇలా మధ్యదారిలో దిగిపోతే, పాత్రధారులకు చేతికి బొమ్మలు అందించేవారు ఎవరు? తీసుకునేవారు ఎవరు?' అని గొణుక్కోవటం ప్రారంభించారు.

అలా ఎందుకంటున్నారంటే ఆటను ప్రదర్శించేటప్పుడు పాత్రధారుల చేతికి పాత్రకు సందర్భానికి తగిన బొమ్మలు ఒకరు అందించాలి. అలాగే వారి చేతినుంచి బొమ్మలను జాగ్రత్తగా ఇప్పించుకోవాలి. రెండు పనులు ఒకేసారి జరగాలి. ఆ సమయంలో పొరబాటున బొమ్మలకు ఉన్నదారాలు ముడిపడితే ఆటకు చాలా ఇబ్బంది కలుగుతుంది. అంతేకాదు ఆట ప్రదర్శించేవాడి చేతులకు బొమ్మలు ఇవ్వటం, వారి చేతుల నుంచి బొమ్మలను తీసుకోవటం ఆలస్యమైతే ఆటను చూస్తున్న ప్రేక్షకులకు అసహనం కలుగుతుంది.

ఈ పని కోసమే నాన్న తమతోపాటు ఒకరిద్దరిని పిల్చుకుని వెళ్ళేవారు. నేను కూడా అలాంటి పనులు చేశాను. అయితే ఆ రోజు ఎవరినీ తీసుకుని రాలేదు. కారణం– చాలా దూరపు ఊరు. అదీ ఒక్క రోజు కార్యక్రమం. ఆ కారణంగా అదనంగా మనుషులు ఎందుకని పిల్చుకుని రాలేదు. అందువల్లనే ఆయనకు కోపం వచ్చింది.

అప్పటికీ నేను ఆ ఆటలో పాల్గొంటానని చెప్పనే లేదు.

అయితే అవకాశం కలిసి వస్తుందనే నమ్మకం ఉంది.

అయినా అర్జునుడిలాంటి ముఖ్యమైన పాత్రను ఇస్తారా అని అనుకున్నాను.

అయితే ఆ రోజుటి కళా ప్రదర్శనలో నాకు అలాంటి బాధ్యతను అప్పగిస్తారని అనుకోలేదు.

ఎందుకంటే ఆ రోజు మేళంలో ఉన్నవారి సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా 'అభిమన్యు కాళగ' (అభిమన్యుడి యుద్ధం) ఆడాలని అనుకున్నాం.

ఆట ఇంకా మొదలుకాలేదు.

అప్పుడే వర్షం కురవసాగింది.

ఆట ఆగిపోవచ్చనే భయం వేసింది.

నా కోరిక ఆ వర్షపు నీటిలో కొట్టుకుని పోతుందేమోనని అనుకున్నాను.

భగవంతుడి దయవల్ల అలా జరగలేదు.

వాళ్ళు కరెంట్ జనం. అంటే అప్పటికే ఆ ఊళ్ళకు కరెంటు సౌకర్యం ఉందన్నమాట. ఆధునికత అడుగు పెట్టిన ఊరు.

అప్పటికప్పుడు ఎక్కడి నుంచో ఒక పెద్ద టార్పాల్ తెప్పించారు.

ఇనుప స్తంభాలను తెప్పించి వాటిని నిలిపి, టార్పాల్ సహాయంతో పెద్ద టెంటు వేశారు.

వేదిక సిద్ధమైంది.

ఇదంతా ఎంత బాగా చేశారంటే మూడు రోజులు ఆగకుండా

వర్షం కురిసినా టెంటు లోపలికి ఒక్క చుక్క నీళ్ళు పడదని అనిపించింది. అప్పుడు అక్కడే ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లేచి, “దయచేసి ఎవరూ వెళ్ళకడి. ఇది అపురూపమైన కొయ్యబొమ్మల ఆట. ఇలాంటి ఆటను మీరు చూడాల్సిందే” అని అన్నారు.

మాకు ఇలాంటి అవగాహన కలిగించే వ్యక్తులు కావాలి.

అక్కడి అధికారుల ప్రోత్సాహాన్ని, వేదికను చూసిన మాలో ఒక విధమైన ఉత్సాహం, ఉల్లాసం వచ్చాయి.

ఆ ఉత్సాహంతో ఆటను ప్రదర్శిస్తూ పోయాం.

ద్రోణాచార్యుల బొమ్మను మా నాన్న తీసుకున్నారు.

నాకు అర్జునుడి బొమ్మను ఇచ్చారు.

కౌరవులు పూర్వ మహాద్వారం నిర్మించే సన్నివేశం అది.

నాన్న పూర్వ మహాద్వారాన్ని కట్టేశారు.

కృష్ణుడిని, అర్జునుడిని వేదిక మీదికి తీసుకుని రావటం జరిగింది.

ద్రోణాచార్యులు (నాన్న) అర్జునుడితో “అర్జునా! మూడులోకాల గండా ! అని బిరుదు పొందినావట. నేను నీ హస్తనైపుణ్యాన్ని చూస్తాను. యుద్ధాన్ని చెయ్” అని నాలుగు మాటలు చెప్పి ముగించారు. అప్పుడు నేను, “అదికాదు గురువర్యా, మాకు, కౌరవులకు విద్య నేర్పిన గురువులు మీరు. ధర్మం, అధర్మం మీకు తెలుసు. అధర్మపరులవైపు మీరు నిలబడిన తరువాత నేను యుద్ధం చేయలేను; శస్త్రాలు పట్టుకోలేను. అడవులకు పోయి సుఖంగా జీవించమని ఆశీర్వందించండి. నేను అక్కడికి వెళ్ళి సుఖంగా ఉంటాను. అయితే యుద్ధం మాత్రం చేయను” అని చెప్పి నా చేతిలోని బొమ్మ చేత నాన్న చేతిలోని బొమ్మకు నమస్కారం చేయించాను.

జనం చప్పట్లు కొట్టారు.

అప్పుడు నాన్నకు ఎంత సంతోషం కలిగిందో ఏమో?

తన చేతిలోని బొమ్మను వెనుక ఉన్నవారికి ఇచ్చి, “వచ్చిందిరా, నీకు బొమ్మలాట ఆడటం వచ్చింది. ఈ రోజు నుంచి నువ్వు ‘గొంబె గౌడ’వయ్యావు. మా నాన్న రామనగౌడవయ్యావు. నా తండ్రి పేరును నీకు పెట్టినందుకు నా జీవితం సార్థకమైంది” అని నా తల మీద చెయ్యి పెట్టి ఆశీర్వదించి, నన్ను గట్టిగా హత్తుకుని ఏడ్చేశారు.

నాన్న చూపిన ఆ ప్రేమ నేను ఈ దశకు రావడానికి కారణమైందేమో?

తెలియదు.

ఆ కౌగిలిలో ‘మన వంశం పారంపర్యంగా వచ్చిన కళను మరవద్దు నాయనా’ అని చెప్పినట్టయ్యింది.

అప్పుడు “ఇలాగే సాగిపోరా, నువ్వు గొప్ప కీర్తిని సంపాదిస్తావు.. పండితుడివి అవుతావు” అని ఆశీర్వదించి ఆట ముగించారు.

ఆయన చెప్పినట్టే నేను కీర్తివంతుడిని అయ్యాను.

అనేక పురస్కారాలు వచ్చాయి. సన్మానాలు జరిగాయి.

అందువల్ల ఇప్పటికీ ఆట ప్రదర్శించేటప్పుడు ఆ సన్నివేశం వస్తే చాలు, నాన్న- నాన్న కౌగిలి, గదగ్ కార్యక్రమం- నా కళ్ళ ముందుకు వస్తుంది. ఆటలో నేను చెప్పాల్సిన డైలాగులు గుర్తుకురావు. చేతిలోని బొమ్మ నృత్యం చేయదు.

అలాంటి సందర్భంలో సన్నివేశానికి అవసరమైన మాటలను నా పిల్లలు పలుకుతూ నా చేతిలోని బొమ్మను తీసుకుని ఆట ప్రదర్శిస్తూ, నృత్యం చేస్తారు.

ఆ రోజు నా కళను మా నాన్న మెచ్చుకున్నారు.

నాన్న మెచ్చుకోక ఇంకెవరు మెచ్చుకోవాలి?

నాన్న మెచ్చుకున్న తరువాతే జనం మెచ్చుకున్నారు.

అటుతరువాత నాన్న ఆట ప్రదర్శనకు నాకు అవకాశం ఇవ్వసాగారు.

తాను మెల్లమెల్లగా పల్లెలలో ఆట ప్రదర్శనకు రావడం తగ్గించుకున్నారు.

అది సోమరితనం వల్ల కాదు. ఇకపై నేను ఆటను ప్రదర్శించగలను అనే ధైర్యంతో, నమ్మకంతో.

అందువల్ల ఇప్పటికీ ఆ సన్నివేశం తలుచుకుంటే కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతాయి.

(తరువాయి వచ్చే సంచికలో...)

## 46వ పుట తరువాయి.....

ఎబుదంటే అబుడు ఎట్లంటే అట్ల ఎగిరేకి నా చేతిలా అయ్యేలే ముసలి. నాకు ఇంట్లో అబ్బా అమ్మా వుండారు. వాళ్లని అడగాల” అంటిని.

అంతే కదా అని ఆ పని అరనిమిషంలా చేసె ముసలి. అబ్బ అమ్మ కూడా పోయిరా అనిరి.

రాత్రి పదకొండు గంటలకి బస్సు ఎక్కితిని.

అది ఏ.సి. బస్సు అయినా నాకు నిద్ర రాలే. రాత్రంతా అరనిద్ర పోతా, అరవ మాటలు వింటా వుండా. మా ముసలి మాత్రం గొరక పెట్టి నిద్ర పోతా వుండాడు. ‘చింతలేని వానికి సంతలా నిద్రని’ ఇట్లా వాళ్లని చూసే అనింటారు.

బస్సు మద్రాసు కోయంబేడులా నిలిచె. అబిటికే పొద్దు పొద్దిన 4 గంటలు అయింది. ఇద్దరం బస్సు దిగితిమి. దిగిన రవంత సేపటికే నా ఒళ్లంతా చెమటలు కారతా వుండాయి. ఉడుకుగాలి వెచ్చగా వీస్తా వుంది.

“ఇంత పొద్దిన్నే ఈ ఉడుకు ఏమి ముసలి. మా వూర్లా యాసికి (వేసవి) కాలములా కూడా ఇట్లుండేలే”

“మీరు అదృష్టవంతులురా, మద్రాసు ఎండ ఎంత అనేది రవంతపొద్దు పోతే తెలుస్తుంది.”

ఇద్దరం మాట్లాడతా ఆటోలా పోతా వుండాము. ఒగ పెద్ద ఇంటితావ ఆటో నిలిచె. ముసలి ఆ ఇంట్లోకి పోయె. నేనూ నడిస్తిని.

“తాతా వందిట్టారు” అని ఇద్దరు చిన్నోళ్లు వచ్చి ముసలిని చుట్టుకొనేసిరి.

“ప్రయాణము బాగా జరిగెనా” అనింది ముసలాయమ్మ.

“రాప్పా” అంటా 40 ఏండ్ల చిన్నోడూ వాని పెండ్లాము ఎదురు వచ్చిరి

ఇదంతా చూస్తా వుంటే ఇది ముసలి కొంప (కుటుంబము) అని నాకు అర్థము ఆయె.

(తరువాయి వచ్చే సంచికలో...)

పుస్తక పరిచయం

# హంసగీతం
# గౌతమ బుద్ధుని జీవన ప్రస్థానం- పద్యనాటకం




ప్రసిద్ధ నాటక రచయిత పాడిబండ్ల ఆనందరావుగారు రచించిన పద్యనాటకం 'హంసగీతం'- సురభి నాటక కుటుంబ మూలాలున్న నన్ను అధికోత్సాహంతో చదివేట్టు చేసింది.

క్రీ.శ. 1900 పూర్వం తెలుగులో బుద్ధుని గురించిన సాహిత్యం లేదనే చెప్పాలి. అంతకు పూర్వం పదకవితలలో, కావ్యాలలో, స్తోత్రాలలో దశావతారస్తుతిలో భాగంగా బుద్ధుణ్ణి ప్రస్తుతించినప్పటికీ, ఆ బుద్ధుడు కపిలవస్తు రాకుమారుడైన గౌతమసిద్ధార్థుడు కాదు, పురాణాలలో విష్ణుమూర్తి అవతారంగా చెప్పే మయాబుద్ధుడు. రాక్షసులను వంచించటానికి అవతరించినవాడు, మోసకారి. కావ్యాలలో విస్తృతంగా బుద్ధుడి గురించి చెప్పినవాడు 'దశావతార చరిత్ర'లో 17వ శతాబ్దంవాడైన ధరణిదేవుల రామయ్యమంత్రి. ఇందులోనూ బుద్ధుడు గౌతమబుద్ధుడు కాదు.

1902లో మొట్టమొదటసారిగా తెలుగులో గౌతమబుద్ధుని గురించి 'బుద్ధచరిత్ర' రచించినవారు తిరుపతి వేంకటకవులు. ఇక అప్పటి నుంచి తెలుగు కవులకి 'మాయ' తొలగి పురాణాలలోని బుద్ధుడిని వదలివేసి నిజమైన బుద్ధుడైన, చరిత్రలోని బుద్ధుడైన గౌతమబుద్ధుడి గురించి కథలు, కవితలు, కావ్యాలు, నాటకాలు అల్లడం మొదలు పెట్టారు. ఆలస్యంగా ప్రారంభమైనా ఈ 119 ఏళ్లలో తెలుగులో వచ్చిన బౌద్ధ సాహితి తక్కువ కాదు. పాటిబండ్ల ఆనందరావుగారి 'హంసగీతం' తెలుగులో వచ్చిన బౌద్ధనాటకాల పరంపరలో ఎన్నతగినది.

బుద్ధుడు నాడు ఎంత అవసరమో మనకు తెలియదు. నేడు చాలా అవసరమని భయానకంగా పెచ్చరిల్లుతున్న సామాజిక రుగ్మతలను చూస్తే అర్థమౌతున్నది. ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలంటే సమస్త జీవజాలం పట్ల ప్రేమను కలిగి ఉండాలని బుద్ధుడు బోధించాడు. మనలను సమ్మోహితం చేసి పతనం వైపు నడిపించే కోరికలను త్యజించాలని చెప్పినవాడు బుద్ధుడు. క్రౌర్య తమోభూయిష్ఠమైన అంధకారంలో ఉదయించిన తేజోరేఖ బుద్ధుడు. ఇలాంటి బుద్ధుడి కథను 13 దృశ్యాల నాటకంగా మలచారు పాటిబండ్ల ఆనందరావు.

బౌద్ధదీక్ష తీసుకోవటానికి సుమంతుడు అనే ఔత్సాహికుడు బౌద్ధ సంఘం వద్దకు రావటంతో దృశ్యం-1 మొదలవుతుంది. బౌద్ధసంఘంలో చేరటానికి ముందు "సిద్ధార్థుడు బుద్ధుడైన విధం" తెలుసుకో అంటూ సారిపుత్రుడు బుద్ధుని కథ చెప్పటం మొదలు పెడతాడు. దృశ్యం-2 నుండి బుద్ధుని జననం మొదలుకొని క్రమంగా బుద్ధుడు ఎదిగిన తీరు, పరాక్రమవంతుడయ్యు పరదోషసహిష్ణుత, భూతదయ, కొలియులకు శాక్యులకూ మధ్య జరగవలసిన పోరుకు నాయకత్వం వహించకుండా బుద్ధుడు తనకు తానే దేశబహిష్కార శిక్షను విధించుకోవటం, దేశాటన చేయటం, తపోసాధన, బోధిని పొందటం, తను కనుగొన్న ధర్మాన్ని ప్రచారం చేయటం, శిష్యోపశిష్యులతో బౌద్ధ సంఘం వర్ధిల్లటం, బుద్ధుని మహాపరినిర్వాణం - యీ ఘట్టాలన్నింటినీ క్రమోన్మీలంగా నడిపారు రచయిత. దృశ్యాలన్నీ చకచకా కదులుతాయి, దేవదత్తుడు తిత్తిరి పాత్రల ద్వారా హాస్యాన్ని సాధించదలచిన చోట్ల తప్ప.

మహాభినిష్క్రమణ సమయంలో యశోధరతో, చెన్నుడితో బుద్ధుడు ప్రవర్తించిన తీరు ఆనందరావుగారి నాటకీయ దృశ్య నిర్వహణకు నిదర్శనం.

ఈ నాటకంలో ప్రత్యేకంగా చెప్పవలసింది పద్యరచన గురించి. ముందుమాట 'ఆనందహంస'లో మృత్యుంజయరావు గారు చెప్పినట్లు 'కరుణశ్రీని గుర్తుచేస్తూ' చాలా మెత్తగా సాగిపోతాయి. "ఎక్కడ దాగినాడవుర యిన్ని దినంబులు" (పుట 4), "ఆకాశవీధిలో లోకబాంధవునకు" (పుట 8), "పండి రాలిన పండ్లు పరిగ గింజలు" (పుట 16), "ఈ మృదుభాషణమ్ములిల యింపుగా" (పుట 54) వంటి పద్యాలన్నీ అందుకు ఉదాహరణలు. "ఒక దీపం వేల దీపాలను వెలిగించినట్టుగానే" అని బుద్ధుడు చెప్పినట్లు ఈ నాటకం బుద్ధునిపై మరిన్ని రచనలకు దారితీయును గాక.

**హంసగీతం** పుటలు : 28+115
ప్రచురణ:లతారాజాఫౌండేషన్9885281545
వెల : 200/-

– రేకందార్ గాంధీరాజు
8897221982

# గ్రంథాలయం




**కమ్యూనిస్టులు బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనవచ్చునా, లేదా?**
రచన:రంగనాయకమ్మ
పుటలు: 128, వెల :40/-
ప్రతులకు
అరుణా పబ్లిషింగ్‌హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520 002
ఫోన్: 9440630378

**త్రికళింగ దేశ చరిత్ర**
తెలుగు, దక్షిణ మధ్య ముండారి ప్రజల చరిత్ర
రచన: ప్రొ॥ కె.ఎస్.చలం
పుటలు: 144, వెల :100/-
ప్రతులకు: భూమి బుక్ ట్రస్ట్
ఎస్.ఆర్.టి. 267/1, జవహర్ నగర్,
ఆర్.టి.సి. క్రాస్ రోడ్ దగ్గర,
హైదరాబాద్-20, సెల్: 98499 08929



**దీపిక** అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి
రచన: పెనుగొండ లక్ష్మీనారాయణ
పుటలు: 256, వెల :200/-
ప్రతులకు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866 - 2430302







**చోళ బలిజ తెలగ రాజుల చరిత్ర**
(కొండవీడు రెడ్డి రాజులు బలిజక్షత్రియులు)
పౌరాణిక, చారిత్రక, సామాజిక పరిశోధనా గ్రంథము
రచన: భట్టరుశెట్టి పద్మారావురాయలు
పుటలు: 414, వెల :200/-
పబ్లికేషర్స్ : శ్రీ అన్నయ్యగారి సాయి కుమార్‌రాయలు
కన్వీనర్, ఆలిండియా కూర్మి, కునిబి, బలిజ, కాపు
క్షత్రియ కుల ప్రచార కమిటి, క్రిష్ణప్పనగర్, రైల్వేస్టేషన్
దగ్గర, కడప సెల్: 9440353133




**సల్లో... సల్ల** (కథలు)
సంపాదకుడు:ఆర్.సి. కృష్ణస్వామిరాజు
పుటలు: 126, వెల :120/-
ప్రతులకు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866 - 2430302

**తేనెటీగ కాదది విషపుతేలు**
రచన:ఈదర గోపీచంద్
పుటలు: 180, వెల :120/-
ప్రతులకు:
ఈదర గోపిచంద్
11-7-17,
నవోదయనగర్, నరసరావు పేట
ఫోన్: 94403 45494



**జనంనుంచి జనంలోకి**
రచన: డా॥ ఏటుకూరి ప్రసాద్
పుటలు: 195, వెల :100/-
ప్రతులకు: సోల్ డిస్ట్రిబ్యూషన్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
జి.ఎస్.ఐ.పోస్ట్, హైదరాబాద్-68
ఫోన్ : 040- 29884453/54







**మట్టి పువ్వులు** (కవితల కూర్పు)
కూర్పరి: అగరం వసంత్
పుటలు: 144, వెల :100/-
ప్రతులకు డా. ఎన్. వసంత్
బస్తి యువక బృందం 2/1097,
బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు - 635 109,
కృష్ణగిరి జిల్లా, తమిళనాడు. సెల్: 09488330209




**జరీపూల నానీలు**
రచన: వడ్డేపల్లి సంధ్య
పుటలు: 62, వెల :75/-
ప్రతులకు
బాలేష్ చిప్పా ఫోన్: 98480 82822

**అమ్మకథ** (మదర్ తెరిసా జీవితం-గేయరూపంలో...)
ఆంగ్లమూలం: క్యాథరిన్‌స్పింక్ రచించిన 'మదర్ తెరిసా'
తెలుగు గేయానువాదం:చిటిప్రోలువెంకటరత్నం
పుటలు: 180, వెల :680/-
ప్రతులకు: శ్రీమతి చిటిప్రోలు జయప్రభ
ఫ్లాట్ నెం.: 401 హైవే హైట్స్ అపార్టుమెంట్
ఆర్.టి.సి. కాలనీ, కపర్ధి నగర్, కాకాని రోడ్డు,
గుంటూరు. సెల్: 77023 58616




**శ్రీశ్రీ సాహిత్యనిధి(విజయవాడ) వారి కొత్త ప్రచురణలు**




**కవిత్వంతో నా ప్రయోగాలు**
**శ్రీశ్రీ**
పుటలు: 88 వెల:75/-
కూర్పు:
సింగంపల్లి అశోక్‌కుమార్




**ఫాదర్ గాడ్**
నాన్న జ్ఞాపకాలు
**శ్రీశ్రీ**
పుటలు: 48 వెల:45/-
కూర్పు:
సింగంపల్లి అశోక్‌కుమార్




**శ్రీశ్రీ**
**అంకితాలు**
**శ్రీశ్రీ**
పుటలు:64 వెల :55/-
కూర్పు:
సింగంపల్లి అశోక్‌కుమార్

ప్రతులకు:
శ్రీశ్రీ సాహిత్యనిధి,
305 ప్రగతి టవర్స్
వీరయ్యవీధి
మారుతి నగర్
విజయవాడ-04
ఫోన్: 9246277375

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలంగాణ తొలి సాంస్కృతిక కృతులు, ఆకృతుల ప్రదర్శనం

## హైదరాబాదు 2021 జులై 31 నుండి ఆగస్టు 28 వరకు

ప్రదర్శించబడిన వాటిలో కొన్ని ఈ క్రింద చూడండి. వ్యాసం, కొన్ని ఫోటోలు 22,23,24 పుటలలో...



అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
September 2021 Vol :7, Issue 4

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244